

‘ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 112

గురువారం 13-7-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత బౌలర్ల జోరు

తొలి ఇన్నింగ్స్‌లో తడబడిన వెస్టిండీస్. అశ్విన్‌కు నాలుగు వికెట్లు. -12లో



విప్రో ఉద్యోగులకు ఏఐలో శిక్షణ

తన సిబ్బందికి ఏఐలో శిక్షణనిచ్చేందుకు రూ.8,200 కోట్లు వెచ్చించనుంది. -13లో



సబ్సిడీ ధరకు టమాటాలు

టమాటా ధరకు రెక్కలొచ్చిన నేపథ్యంలో.. పలు పట్టణాల్లో తక్కువ ధరకు రిటైల్‌గా అమ్మాలని కేంద్రం నిర్ణయించింది.

- వివరాలు 6లో



తైవాన్ దిశగా చైనా నౌకలు..

చైనా.. పెద్దసంఖ్యలో ఫైటర్ జెట్లు, యుద్ధ నౌకలను తైవాన్ దిశగా పంపించింది. చైనా తీరుపై తైవాన్ మండిపడింది.

- వివరాలు 6లో



నేటి నుంచి మోదీ ఫ్రాన్స్ పర్యటన

ప్రధాని మోదీ రెండ్రోజులపాటు ఫ్రాన్స్‌లో పర్యటించనున్నారు. తిరుగు ప్రయాణంలో 15న యూఏఈలో పర్యటిస్తారు.

- వివరాలు 6లో



విపక్షాల రెండో భేటీకి 24 పార్టీలు

బీజేపీ ఓటమే లక్ష్యంగా ప్రతిపక్షాలు ఒక్కతాటి పైకి వస్తున్నాయి. విపక్షాల రెండో కీలక భేటీ 17, 18 తేదీల్లో బెంగళూరులో జరగనుంది.

- వివరాలు 6లో

‘కరెంటు’ మంట!

ఉచిత విద్యుత్‌పై రేవంత్ వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ ఆందోళనలు

రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ర్యాలీలు, దిష్టిబొమ్మల దహనాలు

- విద్యుత్ సౌధ ఎదుట ఎమ్మెల్సీ కవిత నేతృత్వంలో ఆందోళన
- జిల్లాల్లో మంత్రులు ఐకే రెడ్డి, వేముల, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి నిరసనలు
- కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ బోగస్ అని తేలిపోయిందని విమర్శ
- రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- కాంగ్రెస్ నేతలు తమ ఊరికి రావొద్దంటూ కరీంనగర్ జిల్లాలో ఫ్లెక్సీలు
- బీఆర్ఎస్ అవాస్తవ ప్రచారం చేస్తోందంటూ కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన
- గాంధీభవన్‌లో మౌనదీక్ష... రాష్ట్రవ్యాప్తంగా నిరసన ర్యాలీలు
- సబ్‌స్టేషన్ల ఎదుట కేసీఆర్, కేటీఆర్‌ల దిష్టిబొమ్మల దహనాలు



విద్యుత్‌సౌధ ఎదుట ధర్నాలో ఎమ్మెల్సీ కవిత

సాక్షి, హైదరాబాద్: అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య ‘పవర్’మంటలు మండుతున్నాయి. రైతులకు ఉచిత విద్యుత్ సరఫరాపై కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతూ బీఆర్ఎస్ శ్రేణులు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు దిగాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పిలుపు మేరకు.. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు, రైతులతో కలసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందంటూ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ ఎదుట ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించగా.. జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు నిరసన

మిగతా 2వ పేజీలో ▶

మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ▼





- కాంగ్రెస్‌ను అడ్డుకునే కుట్రతో కేసీఆర్ అసత్య ప్రచారాలు: మాణిక్‌రావ్ ఠాక్రే
- బీఆర్ఎస్ అవినీతి నుంచి ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నమని ఆరోపణ

ఉచిత విద్యుత్ మొదలుపెట్టిందే మేం!

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ క్రమంగా బలపడుతుండటం, రైతు డిక్లరేషన్‌కు మంచి స్పందన వస్తుండటంతో.. కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు సీఎం కేసీఆర్ కుట్రలు పన్నుతున్నారని కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ఆరోపించారు. బీఆర్ఎస్ అవినీతి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే.. ఉచిత విద్యుత్ అంశంలో కాంగ్రెస్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. అసలు రైతులకు ఉచిత విద్యుత్‌ను ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తుంచుకోవాలన్నారు. బుధవారం ఢిల్లీలో ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డితో కలసి మాణిక్‌రావ్ ఠాక్రే మీడియాతో మాట్లాడారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లోనే రైతులకు అందించే ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రకటించిందని.. మున్ముందు ప్రకటించే డిక్లరేషన్‌లో 24గంటల ఉచిత విద్యుత్ అంశం ఉంటుందని వివరించారు. కేసీఆర్ పాలన అంతా అవినీతి, అక్రమాల్లో మునిగిపోయిందని మాణిక్ రావ్ ఠాక్రే ఆరోపించారు. పదేళ్ల పాలనలో

మిగతా 2వ పేజీలో ▶

మూడోసారి మీరు అధికారంలోకి రావడం కల్ల: రేవంత్ 2లో



- హైదరాబాద్‌కు ఎల్లో అలర్ట్
- వాతావరణ శాఖ వెల్లడి

ఈ జిల్లాల్లో అతి భారీ వర్షాలు..

ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అతి భారీ వర్షాలకు అవకాశం..

రెండు రోజులు భారీ వర్షాలు..

సాక్షి, హైదరాబాద్: నైరుతి బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది సముద్రమట్టం నుంచి 4.5 కి.మీ. నుంచి 7.6 కి.మీ. మధ్య కొనసాగుతోంది. దీనికి సమాంతరంగా పశ్చిమ,మధ్య బంగాళాఖాతంలో కూడా మరో ఆవర్తనం ఏర్పడినట్లు వాతావరణ శాఖ బుధవారం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఉత్తర జిల్లాల్లో కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. హైదరాబాద్‌కు ఎల్లోఅలర్ట్ జారీ చేసింది. ఆదిలా బాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. కాగా, బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 6.5 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మహబూబాబాద్ జిల్లా గార్లలో 7.35 సెం.మీ., మెదక్ జిల్లా

మిగతా 5వ పేజీలో ▶

యమున ఉధృతి.. 207.71మీటర్లకు చేరిన నీటిమట్టం 6లో



- 2023–24 తొలి రెండు నెలల్లో రూ.31,699 కోట్ల రాబడి
- అందులో అప్పుల వద్దే రూ.9,266 కోట్లు
- రూ.28,171 కోట్లు ఖర్చయినట్లు కాగ్‌కు రాష్ట్ర సర్కారు నివేదిక

ఆదాయంలో మూడో వంతు అప్పులే!

సాక్షి, హైదరాబాద్: ఈ ఆర్థిక సంవత్సరంలో అప్పుల పద్దు పరుగెడుతోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను తొలి రెండు నెలల ఆదాయ, వ్యయాలను పరిశీలిస్తే రాష్ట్ర మొత్తం ఆదాయంలో మూడో వంతు అప్పులే కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో కలిపి మొత్తం రూ.31,699 కోట్ల ఆదాయం రాగా, అందులో రూ.9,266 కోట్లు అప్పులే ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం కాగ్‌కు పంపిన నివేదికలో వెల్లడైంది. ఇక వచ్చిన ఆదాయంలో దాదాపు 95 శాతం ఖర్చయిపోయింది. ఈ రెండు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వ ఖర్చు రూ.28,171 కోట్లు అని ఈ నివేదిక వెల్లడించింది.

పన్ను ఆదాయం రూ.20,097 కోట్లు

ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1.52 లక్షల కోట్ల పన్ను ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేయగా, అందులో 13.18% తొలి రెండు నెలల్లో సమకూరింది. అన్ని రకాల పన్నులు కలిపి రూ.20,097 కోట్లు వచ్చినట్టు తేలింది. జీఎస్టీ కింద రూ.7,430 కోట్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.2,358 కోట్లు, అమ్మకపు పన్ను పద్దు కింద రూ.4,802 కోట్లు, ఎక్సైజ్ ద్వారా

మిగతా 3వ పేజీలో ▶



- మార్గదర్శిలో రూ.కోటి దాటి డిపాజిట్ చేసినవారు వేలల్లో..
- జాతీయ బ్యాంకుల్లో కాకుండా తక్కువ వడ్డీ ఇచ్చే చిట్‌ఫండ్ కంపెనీలో డిపాజిట్లా?
- ఆర్బీఐ, ఐటీ, సీబీడీటీ కంట్లో పడకుండా నల్లబాబుల జాగ్రత్తలు

నల్ల‘మార్గ’ం ఉక్కిరిబిక్కిరి..!

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల పుట్టలో దాగిన ‘నల్ల’పాములు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. అక్రమ డిపాజిట్ల గుట్టు తేల్చేందుకు సీఐడీ తీసుకుంటున్న చర్యలతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ బెంబేలెత్తుతోంది. రూ.కోటి దాటి అక్రమ డిపాజిట్లు చేసిన వారెవరు? వారి వెనుక ఉన్నదెవరు? అన్నది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సీఐడీ చర్యలను వ్యతిరేకించడం ద్వారా అక్రమ డిపాజిట్ల సేకరణను మార్గదర్శి పరోక్షంగా అంగీకరించినట్టైందని పరిశీలకులు పేర్కొన్నారు.

ఏపీలోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ 37 బ్రాంచి కార్యాలయాల పరిధిలో ఇప్పటికే వెయ్యి మందికిపైగా అక్రమ డిపాజిట్‌దారులను సీఐడీ గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఇప్పటిదాకా 800 మందికిపైగా అక్రమ డిపాజిట్‌దారులకు సీఐడీ నోటీసులు జారీ చేసింది. డిపాజిట్ చేసిన మొత్తం ఎలా ఆర్జించారు? ఆదాయ మార్గాలను వెల్లడించాలని నోటీసుల్లో పేర్కొంది. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) నిబంధనలను పాటించారా? అనే వివరాలను వెల్లడించాలని మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను ఆదేశించింది. అంత భారీ మొత్తాన్ని

మిగతా 10వ పేజీలో ▶

న్యూస్‌రీల్

టాపర్లంతా క్యాంపస్ కాలేజీలకే..



ఎంసెట్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు ఇచ్చే గడువు బుధవారంతో ముగిసింది. 16న మొదటి విడత సీట్లు కేటాయిస్తారు. విద్యార్థులు 49,42,005 ఆప్షన్లు ఇవ్వగా, వీటిలో 38 లక్షల వరకూ కంప్యూటర్ కోర్సులవే ఉన్నాయి.

- వివరాలు 2లో

15న బీసీ కులవృత్తిదారులకు రూ. లక్ష సాయం



వెనుకబడిన వర్గాల్లోని కులవృత్తిదారులకు లక్ష రూపాయల ఆర్థికసాయాన్ని ప్రతి నెలా 15న అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో భాగంగా ఈనెల 15న తొలి విడత సాయం అందించనుంది.

- వివరాలు 5లో

అదనపు డీఎంఈల వయోపరిమితి పెంపు



ప్రొఫెసర్ నుంచి అడిషనల్ డీఎంఈగా పదోన్నతి పొందేందుకు వీలుగా వయోపరిమితిని 57 నుంచి 64 ఏళ్లకు పెంచుతూ వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రక్రియను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు.

- వివరాలు 3లో

పాలమూరుకు ‘పర్యావరణ’ కష్టాలు!



పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతుల జారీ ప్రక్రియ మళ్లీ వాయిదాపడింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని నిపుణుల మదింపు కమిటీ గత నెల 27న సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

- వివరాలు 5లో

ఇదండీ సంగతి (cartoon title)




ఎందుకు సార్! అక్కడ గ్రాఫిక్స్ వర్కవుట్ కాదా?

జలాశయాలు వెలవెల

- ఇంకా మొదలుకాని వరదలు
- ప్రధాన జలాశయాల్లో అడుగంటిన నిల్వలు
- ఆల్మట్టి, తుంగభద్రకు స్వల్పంగా వరద
- నారాయణపూర్, శ్రీశైలంకు ఇంకా కరువే.. ప్రాణహిత నుంచి మేడిగడ్డకు పెరుగుతున్న ప్రవాహం

అడుగంటిన నాగార్జునసాగర్ జలాశయం



సాక్షి, హైదరాబాద్: తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని జలాశయాలు వెలవెలబోతున్నాయి. ప్రధాన జలాశయాల్లో నిల్వలు అడుగంటిపోయాయి. గతేడాది సరిగ్గా ఇదే సమయానికి కృష్ణా, గోదావరి బేసిన్ల పరిధిలోని ప్రధాన ప్రాజెక్టుల్లో మొత్తం 386.8 టీఎంసీల నిల్వలుండగా, ప్రస్తుతం 285.21 టీఎంసీల నిల్వలు మాత్రమే ఉన్నాయి. కృష్ణా పరీవాహక ప్రాంతంలోని ఆల్మట్టి డ్యాంలో గతేడాది సరిగ్గా ఇదే సమయానికి 91.35 టీఎంసీల నిల్వలుండగా, ప్రస్తుతం 21 టీఎంసీల నిల్వలు మాత్రమే ఉన్నాయి. ఎట్టకేలకు డ్యాంకు గత మంగళవారం నుంచి వరద ప్రవాహం ప్రారంభమైంది. ప్రస్తుతం 19,172 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో డ్యాంలోకి వచ్చి చేరుతోంది. రోజుకు 1.66 టీఎంసీల వరద ఆల్మట్టిలో చేరుతుండగా, మరో 108 టీఎంసీల వరద వచ్చిచేరితేనే డ్యాం నిండనుంది. ఇక నారాయణపూర్ జలాశయంలో 17 టీఎంసీలు, తుంగభద్ర డ్యాంలో 6.89 టీఎంసీల నిల్వలు మాత్రమే ఉన్నాయి.

జూరాలకు ఇంకా మొదలుకాని ఇన్‌ఫ్లో

నారాయణపూర్, జూరాలకు ఇప్పటివరకు ఎలాంటి ఇన్‌ఫ్లో ప్రారంభం కాలేదు. శ్రీశైలంకు 126 క్యూసెక్కుల నామమాత్రపు వరద వస్తోంది. ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్ర డ్యాంలు పూర్తిగా నిండితేనే దిగువన ఉన్న జూరాల, శ్రీశైలం జలాశయాలకు వరద నీరు రానుంది. నైరుతి రుతుపవనాలు ప్రారంభమై నెలన్నర గడుస్తున్నా చెప్పుకోదగ్గ వర్షాలు లేకపోవడం, ఇంకా వర్షాభావ పరిస్థితులు కొనసాగుతుండడంతో ఈ డ్యాంలు ఇప్పట్లో నిండే సూచనలు కనపడటం లేదు.

ప్రాణహితకి స్వల్పంగా పెరిగిన వరద..

గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రాణహిత నదికి స్వల్పంగా వరద ప్రవాహం పెరుగుతుండటంతో లక్ష్మి(మేడిగడ్డ) బ్యారేజీకి ప్రస్తుతం 1,23,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 1,19,878 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. సమ్మక్క

మిగతా 5వ పేజీలో ▶

ఆనందం అంబరమైతే..



➤ మనిషికి నిత్యం సంతోషాన్నిచ్చేది ఏంటి? యోగం, భోగం నిరంతరంగా ఆనందాన్ని ఇవ్వలేవు. ధనం, పదవి, హోదా వంటివి కూడా ఎప్పటికీ మనిషిని ఆనందదాయకంగా ఉంచలేవు. మరి ఏ అంశం మనిషిని నిత్య సంతోషిగా మార్చగలదు? ఈ అంశంపై హార్వర్డ్ యూనివర్సిటీ దశాబ్దాలుగా పరిశోధన చేస్తోంది. మరి ఈ పరిశోధనలో తేలిందేమిటంటే..

- వివరాలు 14లో

దూసుకెళ్తున్నారు..



➤ అమెరికాలో విద్యాభ్యాసం కోసం వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం అమెరికాలో విద్యనభ్యసిస్తున్న విదేశీ విద్యార్థుల్లో చైనీయులు అధికసంఖ్యలో ఉన్నారు. తర్వాత స్థానంలో భారత్ ఉంది. ఈ పరిస్థితి కొన్నేళ్లలోనే మారనుంది. త్వరలోనే భారత్ మొదటి స్థానంలోకి రానుంది. అమెరికా భారత్‌ను పెద్ద మార్కెట్‌గా పరిగణిస్తోంది.

- వివరాలు 3లో


జస్టిస్ ఉజ్జల్ భూయాన్


జస్టిస్ ఎస్.వి. భట్టి

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎస్.వి.భట్టి

రాష్ట్రపతి ముర్ము ఆమోద ముద్ర

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎస్.వి. భట్టి నియామకాలపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేశారు. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం వీరిని సుప్రీం న్యాయమూర్తులుగా నియమించాలని సిఫార్సు చేయడం విదితమే. ప్రస్తు తం జస్టిస్ భూయాన్ తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా, జస్టిస్ భట్టి కేరళ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఉన్నారు. వీరి నియామకాల విషయాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ బుధవారం ఒక ట్వీట్‌లో వెల్లడించారు.



సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న మల్లు రవి, పొన్నం ప్రభాకర్, మహేశ్‌కుమార్‌గౌడ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, జీవన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు

దేశం రాహుల్ వెంటే..

- ఆయనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే ప్రజలు ఊరుకోరు
- మా దీక్షను భగ్నం చేసేందుకే బీఆర్ఎస్ ఉచిత విద్యుత్ డ్రామాలు
- కేసీఆర్ బాటలోనే మోదీ వెళ్తున్నారు
- ‘సత్యాగ్రహ దీక్ష’ సభలో శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి

➤ భారత్‌జోడో యాత్ర పేరుతో దేశవ్యాప్తంగా తిరిగి ప్రజలను చైతన్యపరుస్తున్న రాహుల్ అంటే బీజేపీ బెంబేలెత్తుతోందని, అందుకే కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని టీపీసీసీ నాయకులు మండిపడ్డారు. రాహుల్‌పై బీజేపీ అణచివేతకు నిరసనగా బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో ‘సత్యాగ్రహ మౌన దీక్ష’ నిర్వహించారు.

- వివరాలు 2లో

క్లుప్తంగా...

మేం తలచుకొంటే వారాహి యాత్ర సాగదు

పవన్ కళ్యాణ్‌కు వలంటీర్ల హెచ్చరిక..

సాక్షి, నెట్‌వర్క్: ఏపీలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛందంగా సేవలందిస్తున్న వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతోంది. మూడోరోజు బుధవారంనాడు కూడా నిరసనలు పెల్లుబికాయి. అన్ని జిల్లాల్లో వలంటీర్లు, సచివాలయాల ఉద్యోగులు, ప్రజలు, పలు సంఘాల ప్రతినిధులు పవన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన ర్యాలీలు, మానవ హారాలు నిర్వహించారు. పవన్ దిష్టి బొమ్మలు దహనం చేశారు. పలుచోట్ల పవన్‌పై పోలీసులకు, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. పవన్ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాము తలచుకొంటే వారాహి యాత్ర ముందుకు సాగదని హెచ్చరించారు. పవన్‌పై చర్యలు తీసుకోవాలంటూ పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

15న బీసీల రాజకీయ ప్లీనరీ

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలు రాజకీయంగా అనుసరించాల్సిన వ్యూహంపై ఈ నెల 15న హైదరాబాద్‌లో బీసీల రాజకీయ ప్లీనరీ నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఎల్బీనగర్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో జరిగే ఈ ప్లీనరీకి అన్ని పార్టీల నేతలను ఆహ్వానించనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్లీనరీలో బీసీల రాజకీయ పాలసీని ప్రకటిస్తామని వెల్లడించారు.

ఖాళీ బిందెకు బంగారు పూత..

ఇదే కేసీఆర్ బంగారు తెలంగాణ..

షర్మిల ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: ఖాళీ బిందెకు బంగారు పూత.. ఇదే కేసీఆర్ చెప్పే బంగారు తెలంగాణ.. అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. తెలంగాణను మరో 40 ఏళ్లు కోలుకోలేని దెబ్బ తీశారని ఆమె ట్విట్టర్ వేదికగా మండిపడ్డారు. అప్పులు ఘనం.. అభివృద్ధి శూన్యం చందంగా 10 ఏళ్లుగా కేసీఆర్ చేసిన అప్పులతో రాష్ట్రం దివాలా తీసిందన్నారు. దొర తెచ్చిన అప్పులు అక్షరాలా రూ.5 లక్షల కోట్లు కాగా.. దేనికీ డబ్బు లేదు.. ఖజానా ఖల్లాస్ అని పేర్కొన్నారు. ఒక్కో తలపై రూ.2లక్షల అప్పు పెట్టి, మొత్తం దోచుకుతిన్నారు తప్ప.. రెండు రూపాయల మేలు చేయలేదని విమర్శించారు. పైకి ధనిక రాష్ట్రమని ప్రగల్భాలు పలుకుతూనే.. ఇప్పటికే 35 వేల ఎకరాల భూములు అమ్మారని షర్మిల ఆరోపించారు. కాగా, మహిళా జర్నలిస్టుతో అమానుషంగా వ్యవహరించిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై చట్టపర విచారణ జరపాలని మరో ట్వీట్‌లో షర్మిల డిమాండ్ చేశారు.

కిషన్‌రెడ్డితో మాజీ మంత్రి చంద్రశేఖర్ భేటీ

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డితో మాజీ మంత్రి డాక్టర్ ఎ.చంద్రశేఖర్ భేటీ అయ్యారు. పార్టీ కార్యాలయంలో బుధవారం కిషన్‌రెడ్డిని కలిసిన సందర్భంగా.. బీఆర్ఎస్‌పై, సీఎం కేసీఆర్‌పై పోరుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేసినట్టు సమాచారం. కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న చంద్రశేఖర్.. పార్టీలో చేరి రెండేళ్లు దాటినా ఎలాంటి పదవి ఇవ్వలేదని నాయకత్వంపై అసంతృప్తిగా ఉన్నట్టు చెబుతున్నారు. ఆయన పార్టీ వీడేందుకు సిద్ధమైనట్టు ప్రచారం కూడా జరిగింది. ఇటీవలే చంద్రశేఖర్‌తో రాష్ట్ర పార్టీ ఎన్నికల నిర్వాహక కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సమావేశమై.. పార్టీ మారొద్దంటూ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో కిషన్‌రెడ్డిని కలిసిన చంద్రశేఖర్.. పార్టీ మారే ఆలోచన లేదని స్పష్టం చేసినట్టు తెలుస్తోంది.

వర్గీకరణపై తాడోపేడో తేల్చుకుంటాం



హనుమకొండ: ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతపై కేంద్రంతో తాడో పేడో తేల్చుకుంటామని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సమావేశం బుధవారం హనుమకొండలో జరిగింది. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంద కృష్ణ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత సాధన చివరి మెట్టుకి వచ్చిందన్నారు. ఇప్పుడు కాకపోతే మరెప్పుడూ సాధించుకోలేమని, కేంద్ర ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు మాదిగ జాతి సిద్ధమైందని తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత అంశం మీద చర్చిండానికి ఈ నెల 8న ప్రధాని నరేంద్ర మోదీని వరంగల్‌లో కలిశామన్నారు. ఆయన ఇప్పటికి 3సార్లు హామీ ఇచ్చారని, మాటలు ఆపి ఇకనైనా చేతల్లో చూపాలని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలని డిమాండ్ చేస్తూ లక్షలాది మంది మాదిగలతో ఆగస్టు రెండో వారంలో ఛలో హైదరాబాద్ నిర్వహిస్తున్నామని, విజయమో? సమరమో? తేల్చుకుంటామని ఉద్ఘాటించారు. వర్గీకరణపై కాంగ్రెస్ పార్టీ వైఖరేంటో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ చెప్పాలని, సీఎం కేసీఆర్ ఇప్పటికైనా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్‌లో విద్యుత్ కార్యాలయం ఎదుట రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు



ఖమ్మం జిల్లా మంచుకొండలో ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

'కరెంటు' మంట!

▶ మొదటి పేజీ తరువాయి

తెలిపారు. మరోవైపు రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ కావాలనే అబద్ధపు ప్రచారం చేస్తోందంటూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కూడా ఆందోళనలు, నిరసన ర్యాలీలు నిర్వహించాయి. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను ఊరేగించి దహనం చేశాయి.

రేవంత్ క్షమాపణ చెప్పాలి: కవిత

ఉచిత విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ బోగస్ అని తేలిపోయిందని విద్యుత్ సౌధ వద్ద ఆందోళన సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. రేవంత్ వెంటనే రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మూడు పూటలా అన్నం పెట్టే రైతులకు మూడు గంటలే కరెంట్ ఇవ్వాలన్న రేవంత్‌ను, ఆ పార్టీ నేతలను గ్రామాల్లో తిరగనివ్వొద్దని వ్యాఖ్యానించారు.

- నాడు బషీర్‌బాగ్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులపై చంద్రబాబు కాల్పులు జరిపి ముగ్గురు రైతులను పొట్టనపెట్టుకున్నాడని.. ఇవాళ ఆయన శిష్యుడు రేవంత్‌రెడ్డి ఉచిత కరెంట్ వద్దంటూ రైతుల పొట్టగొట్టాలని చూస్తున్నారని నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన ఆందోళనలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మండిపడ్డారు.
- జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారిపై మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యేలు అబ్రహం, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు బైఠాయించి నిరసన తెలిపారు. ఎలాంటి అవగాహన లేకుండా రైతులను నాశనం చేయాలనే కాంగ్రెస్ తమ నిజ స్వరూపం బయటపడిందన్నారు.
- కరీంనగర్ జిల్లా కేంద్రంలో మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన నిర్వహించాయి. కరీంనగర్ నియోజకవర్గంలో పలు గ్రామాల్లో, ప్రధాన కూడళ్లలో 'కాంగ్రెస్ నేతల్లారా మా ఊరికి రావొద్దు. ఖబడ్దార్ రేవంత్‌రెడ్డి' అంటూ ఫ్లెక్సీలు వెలిశాయి. మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంలోని బస్వాపూర్‌లో రేవంత్ దిష్టి బొమ్మకు చెప్పులు కట్టడాన్ని నిరసిస్తూ.. టెక్స్‌టైల్ పార్క్ వద్ద మంత్రి కేటీఆర్ చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణులు చెప్పుల దండ వేసి నిరసన తెలిపాయి.
- వ్యవసాయం, రైతుల ఇబ్బందుల గురించి కాంగ్రెస్ నేతలకు కనీస అవగాహన లేదంటూ నిజామాబాద్ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు.
- రేవంత్‌రెడ్డి రైతు ద్రోహి అని, పెద్ద బ్లాక్‌మెయిలర్ అని మేడ్చల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ధర్నాలో మంత్రి మల్లారెడ్డి ఆరోపించారు. రైతులపై ఎవరైనా ఇష్టానుసారంగా మాట్లాడితే నాలుకలు చీరేస్తామన్నారు.
- దేశానికి అన్నం పెట్టే రైతన్నను చులకన చేసేలా రేవంత్‌రెడ్డి మాట్లాడటం గర్హనీయమని, ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలో జరిగిన నిరసనలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు.
- ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఆందోళనలు జరిగాయి.


కాంగ్రెస్ మౌన దీక్ష.. నిరసనలు

ఉచిత కరెంట్ పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని, రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి తప్పుడు ప్రచారం చేస్తోందని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. బీఆర్ఎస్ తీరును నిరసిస్తూ గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ నేతలు మౌన దీక్ష చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ ఎక్స్‌రోడ్డులో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బాన్సువాడ, మోర్తాడ్‌లో, కరీంనగర్ జిల్లా కేంద్రం, చొప్పదండి నియోజక వర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చేశారు. విద్యుత్ కొనుగోళ్ల అంశంలో కేసీఆర్ సర్కారు అవినీతి బయటపడుతుందనే కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

టాపర్లంతా క్యాంపస్ కాలేజీలకే..

తొలి విడతలో ఆప్షన్లు ఇచ్చింది 75 వేల మంది

- ఎక్కువ మంది సీఎస్‌సీ కోర్సుకే మొగ్గు
- ఒకే విద్యార్థి ఇచ్చిన అత్యధిక ఆప్షన్లు 1,109
- ముగిసిన ఎంసెట్ ఆప్షన్ల ప్రక్రియ
- 16న తొలి విడత సీట్ల కేటాయింపు



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో ఆప్షన్లు ఇచ్చే గడువు బుధవారంతో ముగిసింది. ఈ నెల 16న మొదటి విడత సీట్లు కేటాయిస్తారు. తొలి దశలో ఎక్కువ మంది కంప్యూటర్ సైన్స్ కోర్సులకే మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. సీట్లు పెరగడం, సీఎస్ఈ, ఇతర కంప్యూటర్ కోర్సుల్లో సీట్లు వస్తాయని భావించడంతో ఎక్కువ మంది ఈ కోర్సును ఎంచుకున్నారు. విద్యార్థులు మొత్తం 49,42,005 ఆప్షన్లు ఇవ్వగా, వీటిలో 38 లక్షల వరకూ కంప్యూటర్ కోర్సులకు సంబంధించినవే ఉన్నాయి. సివిల్ ఇంజనీరింగ్‌లో 3,777 సీట్లు ఉంటే, విద్యార్థుల నుంచి 10 లక్షలకు మించి ఆప్షన్లు రాలేదు. గడువు ముగిసే నాటికి మొత్తం 75,172 మంది ఆప్షన్లు ఇచ్చారు. ఒకే విద్యార్థి అత్యధికంగా 1,109 ఆప్షన్లు ఇచ్చారు. వాస్తవానికి 12వ తేదీన సీట్ల కేటాయింపు జరగాల్సి ఉంది. ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచీల్లో సీట్లు రద్దు చేసుకుని, ఆ స్థానంలో కంప్యూటర్ బ్రాంచీల్లో సీట్లు పెంచుకున్నాయి. దీంతో ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ గడువును పొడిగించారు.

ర్యాంకర్ల నుంచి కన్పించని స్పందన

తొలి విడత ఎంసెట్ కౌన్సెలింగ్‌లో ఎక్కువ ర్యాంకులు పొందిన వారు తక్కువగా దరఖాస్తు చేసుకున్నారు. వాళ్లు అతి కొద్ది ఆప్షన్లు మాత్రమే ఇచ్చారు. విశ్వవిద్యాలయాల క్యాంపస్ పరిధిలో ఉండే సీట్లకు పోటీ పడ్డారు. 500 ర్యాంకు దాటిన వారు మాత్రం టాప్ టెన్ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు ఆప్షన్లు ఇచ్చారు. ఎంసెట్‌లో వెయ్యి వరకూ ర్యాంకు సాధించిన విద్యార్థులు తొలి కౌన్సెలింగ్‌లో 500లోపు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. గతంలో ఈ సంఖ్య ఎక్కువగా ఉండేది. ప్రైవేటు కాలేజీలు వ్యూహాత్మకంగా ర్యాంకర్ల చేతే దరఖాస్తు చేయించి, సీటు వచ్చిన తర్వాత స్పాట్ అడ్మిషన్ సమయంలో రద్దు చేయించడం ఆనవాయితీగా సాగుతోంది. ఈ సంవత్సరం దీనిపై దృష్టి పెట్టిన ఉన్నత విద్యామండలి.. జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో వారు పొందిన సీట్ల వివరాలు తెప్పించే ప్రక్రియ చేపట్టినట్లు చెప్పింది. దీంతో సీట్లను బ్లాక్ చేసే యాజమాన్యాలకు సహరించేందుకు విద్యార్థులు వెనకడుగు వేశారు. ఈ క్రమంలో యూనివర్సిటీ క్యాంపస్ పరిధిలో ఉండే సీట్ల కోసమే ర్యాంకర్లు పోటీపడ్డారు. ఉస్మానియా వర్సిటీ పరిధిలో 630, జేఎన్‌టీయూహెచ్ పరిధిలో 2,580, కాకతీయ పరిధిలోని 1,080 సీట్లతో కలుపుకొని రాష్ట్రంలోని 9 వర్సిటీల పరిధిలో మొత్తం 4,773 సీట్లున్నాయి. వీటికే టాపర్లు ఎక్కువగా ఆప్షన్లు ఇచ్చారు.

తొలి విడతలో 76,359 సీట్లు

ఈ ఏడాది సీఎస్‌సీ, ఇతర కంప్యూటర్ కోర్సుల్లో 14 వేల సీట్లు పెరిగాయి. 7 వేల వరకూ సంప్రదాయ కోర్సులైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్‌లో తగ్గించుకున్న కాలేజీలు, ఆ మేర కంప్యూటర్ బ్రాంచీల్లో పెంచుకున్నాయి. దీంతోపాటు అదనంగా మరో 7 వేల వరకూ సీఎస్‌సీలో సీట్లు పెరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,07,039 ఇంజనీరింగ్ సీట్లు ఉంటే, తొలి విడత కౌన్సెలింగ్‌లో 76,359 సీట్లు అందుబాటులోకి తెచ్చారు. ఇందులో 42,087 సీట్లు సీఎస్‌సీ, ఇతర కంప్యూటర్ బ్రాంచీల్లో ఉన్నాయి.



దాడికి గురైన మంత్రి వర్గీయుడు కిషన్

డోర్నకల్ బీఆర్ఎస్‌లో తన్నులాట!

మంత్రి సత్యవతి, ఎమ్మెల్యే రెడ్యానాయక్ వర్గీయుల బాహాబాహీ

కురవి: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలో రాష్ట్ర గిరిజన శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ వర్గీయులు దుర్భాలాడుకుంటూ తన్నులాడుకున్నారు. పరస్పరం బాహాబాహీకి దిగారు. రూ. 5 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసేందుకు రెడ్యానాయక్ బుధవారం ఉదయం కురవి మండలం బంగ్యా తండాకు చేరుకున్నారు. మా ఊరికి ఏం అభివృద్ధి చేశావంటూ తండాకు చెందిన మంత్రి సత్యవతి వర్గీయుడైన మాజీ సర్పంచ్ హచ్చానాయక్ అనుచరులు ఎమ్మెల్యే ప్రచార రథానికి అడ్డుతగిలారు. ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వాహనం ముందు భాగంలో టైర్ల కింద పడుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో ఎమ్మెల్యే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయకుండానే తండాలో ఏర్పాటు చేసిన సభ వద్దకు వెళ్లారు. సభ వద్ద హచ్చానాయక్ తమ్ముడు కిషన్‌నాయక్ రభస చేస్తుండగా ఎమ్మెల్యే అనుచరుడు సింగ్యానాయక్, ఇతర వర్గీయులు అతనిపై మూకుమ్మడిగా దాడి చేశారు. ప్రతిగా మంత్రి సత్యవతి వర్గీయులు పెద్ద సంఖ్యలో రావడంతో ఇరువర్గాలూ ఒకరినొకరు కొట్టుకున్నారు. అంగీలు చిరిగిపోయినా ఎవ్వరూ తగ్గలేదు. చివరికి పోలీసులు వారించినా వినలేదు. ఈ క్రమంలో ఎమ్మెల్యే రెడ్యానాయక్ తండానుంచి బయటకు వెళ్తుండగా కారుకు అడ్డంగా పడుకున్నా రు. పోలీసులు ఆందోళనకారులను పక్కకు తప్పించడంతో ఎమ్మెల్యే అక్కడినుంచి వెళ్లిపోయారు. పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు.

దేశం రాహుల్ వెంటే..

ఆయనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే ప్రజలు ఊరుకోరు

- మా దీక్షను భగ్నం చేసేందుకే బీఆర్ఎస్ ఉచిత విద్యుత్ డ్రామాలు
- కేసీఆర్ బాటలోనే మోదీ వెళ్తున్నారు
- 'సత్యాగ్రహ దీక్ష'లో శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: విచ్ఛిన్నకర శక్తులకు ఎదురొడ్డి దేశ ఐక్యత కోసం పాటుపడుతున్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ వెంటే దేశం నిలుస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేతలు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టి.జీవన్‌రెడ్డి చెప్పారు. భారత్‌జోడో యాత్ర పేరుతో దేశవ్యాప్తంగా తిరిగి ప్రజలను చైతన్యపరుస్తున్న రాహుల్ అంటే బీజేపీ బెంబేలెత్తుతోందని, అందుకే కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. రాహుల్‌పై బీజేపీ అణచివేతకు నిరసనగా బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో 'సత్యాగ్రహ మౌన దీక్ష' జరిగింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన దీక్ష అనంతరం నిర్వహించిన సభలో శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి మాట్లాడారు. రాహుల్‌పై కక్షసాధింపు చర్యలకు పాల్పడితే దేశప్రజలు ఊరుకోరని, ఆయనకు ఎలాంటి ఇబ్బంది కలిగినా కాంగ్రెస్ కార్యకర్తలు పోరాటాలకు దిగుతారని హెచ్చరించారు.

దేశంలోని ఆర్థిక నేరగాళ్లను దృష్టిలో పెట్టుకుని నాలుగేళ్ల క్రితం ఆయన చేసిన వ్యాఖ్యలపై కోర్టులకెక్కి, శిక్షలు వేయించి, ఉద్దేశపూర్వకంగా లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయించారని విమర్శించారు. గత ప్రభుత్వంలో కూడా గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్నారనే సాకుతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌ల శాసన సభ్యత్వాలను కేసీఆర్ రద్దు చేయించారన్నారు. ఇప్పుడు మోదీ కూడా కేసీఆర్ అడుగుజాడల్లోనే నడుస్తున్నారని ధ్వజమెత్తారు. తాము సత్యాగ్రహ దీక్ష చేస్తున్నామన్న దుగ్ధతో ఆ దీక్షను భగ్నం చేసేందుకు ఉచిత విద్యుత్ పేరుతో బీఆర్ఎస్ డ్రామాలు ఆడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తూ గందరగోళానికి గురిచేస్తోందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందంలో భాగంగానే ఇదంతా జరుగుతోందని, రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీలను ఓడించాలి: మన్సూర్ అలీఖాన్

విద్వేషాన్ని అడ్డుకుని దేశాన్ని రక్షించేందుకు రాహుల్, సోనియా, ఖర్గే పోరాడుతున్నారని ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శి మన్సూర్ అలీఖాన్ చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి బీజేపీ మద్దతు ఇస్తోందని, బీఆర్ఎస్, బీజేపీలను ఓడించేందుకు అందరూ రాహుల్‌కు అండగా నిలవాలని కోరారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ ఒకే నేరంపై వివిధ రాష్ట్రాల్లో కేసులు వేయడం, వాటిని కోర్టులు సమర్థించడం బాధ కలిగిస్తోందన్నారు. మౌనదీక్ష రాహుల్ కోసమే కాదని, దేశంలోని ప్రతి వ్యక్తి స్వేచ్ఛ కోసమని వ్యాఖ్యానించారు. రాహుల్ ఎంపీగా ఉంటే ప్రధాని అవుతాడనే భయం మోదీకి పట్టుకుందని ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. రాహుల్ లోక్‌సభలో అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయించారన్నారు. ఈ దీక్షలో ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ మల్లురవి, వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య, ఏపీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సాకె శైలజానాథ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌తోపాటు డీసీసీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల చైర్మన్లు, పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధులు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని పాల్గొన్నారు.

3 పంటలు కావాలా.. 3 గంటల కరెంటు కావాలా?

- తెలంగాణ రైతులు తేల్చుకోవాల్సిన సమయం ఇది
- అరికాలిలో మెదడు ఉన్నోళ్లను నమ్మితే రైతులు ఆగం
- ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: రైతును రాజును చేసే మనసున్న ముఖ్యమంత్రి కేసీఆర్ కావాలా.. మూడు గంటల కరెంటు చాలు అంటున్న మోసకారి రాబందు కావాలా' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు ప్రశ్నించారు. 'కేసీఆర్ నినాదం మూడు పంటలు.. కాంగ్రెస్ నినాదం మూడు గంటలు.. బీజేపీ విధానం మతం పేరిట మంటలు. వీటిలో ఏది కావాలో తెలంగాణ రైతులు తేల్చుకోవాల్సిన సమయం ఇది' అని కేటీఆర్ పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ విషయంలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను పరోక్షంగా ప్రస్తావిస్తూ 'నాడు చంద్రబాబు వ్యవసాయం దండగ అన్నడు.. నేడు మూడు పూటలు కరెంటు దండగ అంటున్నడు చోటా చంద్రబాబు' అంటూ ట్విట్టర్‌లో విమర్శించారు. 'మూడు గంటల కరెంటుతో మూడు ఎకరాల పొలం పారించాలంటే బక్కచిక్కిన రైతు బాహుబలి మోటార్లు పెట్టాలి. అరికాలిలో మెదడు ఉన్నోళ్లను నమ్ముకుంటే రైతుల బతుకు ఆగమవుతుంది. మరోమారు రాబందు మూడు గంటల కరెంటు మాటెత్తితే రైతుల చేతిలో మాడు పగలడం ఖాయం.'' అని హెచ్చరించారు.

రైతులకు కాంగ్రెస్ రెండో ప్రమాద హెచ్చరిక

తాము అధికారంలోకి వస్తే ధరణిని తొలగిస్తాం అని ప్రకటించిన రాబందు ప్రస్తుతం వ్యవసాయానికి మూడు గంటలు ఉచిత విద్యుత్ చాలు అంటున్నారని, ఇది రైతులకు కాంగ్రెస్ నోట వెలువడిన రెండో ప్రమాద హెచ్చరిక అని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. మూడు ఎకరాల రైతుకు మూడు పూటలా కరెంట్ ఎందుకు అనడం ముమ్మాటికీ సన్న చిన్నకారు రైతును అవమానించడమే అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడూ చిన్నకారు రైతు అంటే చిన్నచూపేనని ఆరోపించారు. నోట్లు తప్ప రైతుల పాట్లు తెలియని రాబందును నమ్మితే రైతు నోట్లో మట్టికొట్టుడు ఖాయమని, అన్నదాత నిండా మునుగుడు పక్కా అని పేర్కొన్నారు. నాడు ఏడు గంటలు ఇవ్వకుండా ఎగ్గొట్టిన కాంగ్రెస్ నేడు ఉచిత కరెంట్‌కు ఎగనామం పెట్టే కుట్ర చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణ రైతన్నలకు ఇది పరీక్షా సమయమని, ఎవరేమిటో గమనించాలని సూచించారు.

మూడోసారి మీరు అధికారంలోకి రావడం కల్ల: రేవంత్



సాక్షి, హైదరాబాద్: మూడు గంటల కరెంటు అని దుష్ప్రచారం చేసినా, మూడు చెరువులు నీళ్లు తాగినా బీఆర్ఎస్ మూడోసారి అధికా రంలోకి రావడం కల్ల అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఉచిత విద్యుత్ పై మంత్రి కేటీఆర్ ట్వీట్‌కు ఆయన ట్విట్టర్ లోనే కౌంటర్ ఇచ్చారు. 'కల్వకుంట్ల అన్నా చెల్లెళ్లు మూడు గంటలు అని దుష్ప్రచారం చేసినా, మూడు చెరువుల నీళ్లు తాగినా మీరు మూడోసారి అధికారంలోకి రావడం కల్ల. వచ్చేది కాంగ్రెస్ పార్టీనే. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చేది కాంగ్రెస్సే' అని రేవంత్ బుధవారం ట్వీట్ చేశారు.

'24 గంటల కరెంటు' నిరూపిస్తే జీవితాంతం బీఆర్ఎస్‌కు సేవ చేస్తా

పది గంటలు ఇచ్చినట్టు చూపించినా సబ్‌స్టేషన్‌లోనే రాజీనామా చేస్తా: కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రైతులకు ఉచిత విద్యుత్ వ్యవహారంలో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ట్విస్ట్ ఇచ్చారు. సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌తో సహా రాష్ట్రంలోని ఏ సబ్‌స్టేషన్‌కైనా వెళ్దామని, అక్కడ లాక్‌బుక్కుల్లో 24 గంటల కరెంట్ ఇస్తున్నట్టు చూపిస్తే జీవితాంతం బీఆర్ఎస్‌కు సేవ చేస్తానని వ్యాఖ్యానించారు. బుధవారం గాంధీభవన్‌లో జరిగిన సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 24 గంటల కరెంటు ఇస్తున్నారని నిరూపిస్తే కేసీఆర్, కేటీఆర్‌ల ఫ్లెక్సీలకు తానే పాలాభిషేకం చేస్తానని, కనీసం 10 గంటలు ఇస్తున్నట్టు నిరూపించినా సబ్‌స్టేషన్‌లోనే రాజీనామా చేస్తానని చెప్పారు. తన సవాల్ స్వీకరించేందుకు ఎవరొస్తారో రావాలని, కనీసం ఆరుగంటలైనా నాణ్యమైన విద్యుత్‌ను వ్యవసాయానికి ఇస్తున్నట్టు చూపించాలని సవాల్ చేశారు. రాష్ట్రంలోని ఒక్కో బీఆర్ఎస్ ఎమ్మెల్యే రూ.వేయి కోట్లు తిన్నాడని, తిన్నదరగకే ధర్నాలు చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. మూడు గంటలు కావాలా, మూడు పంటలు కావాలా అని ట్విట్టర్‌లో ప్రశ్నించిన వ్యక్తిని చెప్పుతో కొట్టాలని, కాంగ్రెస్ సత్యాగ్రహ దీక్షను భగ్నం చేయడానికే బీఆర్ఎస్ కుట్ర చేస్తోందని ఆరోపించారు. కల్వకుంట్ల కుటుంబం నీరవ్ మోదీలాగా దుబాయ్ పారిపోతుందని, ఆ నలుగురితో పాటు కుటుంబ సభ్యులు రాష్ట్రం విడిచి పారిపోయే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని చెప్పారు. చిన్న విషయాన్ని పెద్దది చేసే ప్రయత్నం చేస్తున్నారని, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హైదరాబాద్ వచ్చిన తర్వాత ఈ విషయంలో మాట్లాడి కాంగ్రెస్ పార్టీ కార్యాచరణను ప్రకటిస్తామని కోమటిరెడ్డి వెల్లడించారు.

జడ్జి భర్తపై బీఆర్ఎస్ కార్యకర్తల దాడి

ఆస్పత్రికి వెళ్లాలి.. దారి ఇవ్వండని అడగడమే కారణం

గండేడ్/మహమ్మదాబాద్: ఆస్పత్రికి వెళుతున్న జడ్జి భర్తతో పాటు ఓ సివిల్ కానిస్టేబుల్‌పై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం గండేడ్‌లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెంట్యానాయక్ ఆధ్వర్యంలో రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. అదే సమయంలో కోస్గి సివిల్ జడ్జి ఫరీనాబేగం భర్త, న్యాయవాది శశికిరణ్ తన అత్తమామలు వెంకటేష్, లక్ష్మిలను తీసుకొని మహబూబ్‌నగర్ ఆస్పత్రికి బయల్దేరారు. రాస్తారోకో వల్ల ఆలస్యమవుతుందని భావించిన శశికిరణ్.. బీఆర్ఎస్ కార్యకర్తల వద్దకెళ్లి పక్షవాతం వచ్చిన వాళ్లున్నారు, ఆస్పత్రికి వెళ్లేందుకు దారి ఇవ్వాలని కోరారు. ఆందోళన ముగిసే వరకు ఆగాలని కొందరు నాయకులు సూచించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు, అడ్వొకేట్ శశికిరణ్ మధ్య మాటామాటా పెరిగింది. దీంతో కొందరు శశికిరణ్‌పై దాడికి దిగారు. అదే సమయంలో అటుగా వెళుతున్న కోస్గి మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన రాజాపూర్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డి.. గొడవను గమనించి శశికిరణ్‌కు కొట్టకుండా బీఆర్ఎస్ కార్యకర్తలను వారించబోయారు. దీంతో అతడిపైనా కార్యకర్తలు దాడికి దిగారు. తర్వాత కొందరు ఇరువర్గాలకు నచ్చజెప్పారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి ఆందోళన విరమించారు. కాగా, ఈ సంఘటనలో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు మహమ్మదాబాద్ ఎస్ఐ సురేష్ తెలిపారు. దాడికి పాల్పడిన మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెంట్యానాయక్‌తో పాటు జోగు కృష్ణయ్య, వెంకట్‌రాములు, మల్లేశ్‌లపై కేసు నమోదు చేశారు. తమపై దాడి చేశారంటూ పెంట్యానాయక్, జోగు కృష్ణ చేసిన ఫిర్యాదుపై జడ్జి భర్త శశికిరణ్, హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారెడ్డిపై కూడా కేసు నమోదు చేశారు.

బలంగా ఉన్న స్థానాల్లో సీపీఐ పోటీ

ధరణి రద్దుకు మేం వ్యతిరేకం: చాడ

హుస్నాబాద్: ఏ పార్టీతో పొత్తు ఉన్నా లేకున్నా బలంగా ఉన్న స్థానాల్లో ఒంటరిగానైనా పార్టీ పోటీ చేస్తుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. హుస్నాబాద్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో బీజేపీ గ్రాఫ్ పడిపోయిందని, కర్ణాటక ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌లో నూతన ఉత్సాహాన్నిచ్చాయన్నారు. వామపక్షాలు రెండుసార్లు సమావేశాలు నిర్వ హించుకొని కలిసే ఉందామని నిర్ణయించు కున్నామని, పొత్తులపై చర్చలు జరుగుతున్నా యని తెలిపారు. ధరణి పోర్టల్ కొత్త ప్రయో గమని, అందులో కొన్ని లోపాలు సవరించాలని, ధరణి పోర్టల్ రద్దుకు తాము వ్యతిరేకమన్నారు. రైతులు కరెంట్‌ను ఎవరికి ఎంత అవసరమో అంతే వాడుకుంటారని, తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్‌ను తాము సమర్థిస్తున్నా మని చాడ చెప్పారు.

ఉచిత విద్యుత్ మొదలుపెట్టిందే మేం!

▶ మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ కుటుంబానికే ప్రయోజనాలు చేకూరాయని, ప్రజలకు చేసిందేమీలేకున్నా అయినా పబ్లిసిటీ మాత్రం బాగా చేసుకుంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాల ముసుగు త్వరలోనే తొలగిపోతుందన్నారు. రైతులకు ప్రతి సందర్భంలో కాంగ్రెస్ మేలు చేసిందని, మద్దతుగా నిలిచిందని చెప్పారు. అమెరికాలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలను వక్రీకరించి, తప్పుడు అర్థం వచ్చేలా దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకప్పుడు కాంగ్రెస్ పేరే ఎత్తని కేసీఆర్.. ఇప్పుడు పదే పదే కాంగ్రెస్‌ను ఎందుకు విమర్శిస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణలో పంటల బీమా పథకం ఎందుకు అమలు చేయడం లేదని, రుణమాఫీ హామీ ఎటు పోయిందని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని, అందుకే కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

ఎకరానికి రూ.15వేలు పెట్టుబడి సాయం: వంశీచంద్‌రెడ్డి

బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఏకమైనా ఈసారి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవడం ఖాయమని ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి చెప్పారు. వైఎస్ హయాంలోనే రైతులకు ఉచిత విద్యుత్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిందని వివరించారు. రైతులకు ఎకరానికి 15 వేల పెట్టుబడి సాయం ఇచ్చేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని, కౌలు రైతులకూ ఎకరానికి 12 వేలు సాయం చేస్తామని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో సీఎం అభ్యర్థులకు కొదవలేదు: ఠాక్రే

తెలంగాణ కాంగ్రెస్‌లో సీఎం అభ్యర్థులకు కొదవలేదని.. తమది కేసీఆర్ మాదిరిగా కుటుంబ పార్టీ కాదని మాణిక్‌రావ్ ఠాక్రే వ్యాఖ్యానించారు. రేవంత్, ఉత్తమ్, భట్టి, మధుయాష్కీ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, సీతక్కలాంటి ఎంతో మంది సీఎం అభ్యర్థులు ఉన్నారన్నారు. అయితే ఎమ్మెల్యేల అభిప్రాయాల ఆధారంగానే సీఎం ఎంపిక ఉంటుందని, ఎన్నికలకు ముందు సీఎం అభ్యర్థి ప్రకటన ఉండబోదని చెప్పారు.

క్లుప్తంగా...

పేపర్ లీక్ కేసులో మరో ఇద్దరి అరెస్ట్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసులో కరీంనగర్‌కు చెందిన మద్దెల శ్రీనివాస్, ఆయన కుమార్తె సాహితిని సిట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పేపర్ లీక్ డీల్ ప్రకారమే సాహితి పరీక్ష రాసిందని పోలీసులు భావిస్తున్నారు. కూతురు కోసం శ్రీనివాస్ డీఈ పూల రమేశ్‌తో ఒప్పందం కుదుర్చుకొని రూ.లక్షల్లో లావాదేవీలు జరిపినట్లు పోలీసులు గుర్తించారు. డీఈ రమేశ్ వ్యవహారాలు, కాల్ డేటా, ఆర్థిక లావాదేవీల ఆధారంగా సిట్ పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటివరకు ఈ కేసులో 80మంది అరెస్ట్ కాగా మరింత మందిని అరెస్టు చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

వామపక్ష విద్యార్థి సంఘాల బంద్ విజయవంతం

కొన్ని జిల్లాల్లో విద్యార్థుల అరెస్టు



సాక్షి, హైదరాబాద్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు బుధవారం నిర్వహించిన రాష్ట్రవ్యాప్త బంద్ విజయవంతమైంది. హైదరాబాద్, రంగారెడ్డి, సిద్దిపేట, హనుమకొండ, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో బంద్‌ను పోలీసులు అడ్డుకున్నారు. విద్యార్థులను అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో మంత్రుల నివాస సముదాయాల ముట్టడికి విద్యార్థి సంఘాల నేతలు ప్రయత్నించారు. ఈ సందర్భంగా వారిని పోలీసులు అడ్డుకోవడంతో ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు దౌర్జన్యానికి పాల్పడ్డారని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు. విద్యార్థి సంఘాలు నాయకులు ఆర్‌ఎల్ మూర్తి, టి.నాగరాజు(ఎస్ఎఫ్ఐ), పుట్టా లక్ష్మణ్ (ఎఐఎస్ఎఫ్), పరశురాం (పీడీఎస్‌యూ), ఎస్.నాగేశ్వరరావు, రామకృష్ణ (పీడీఎస్‌యూ) తదితరులు మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రభుత్వం విద్యార్థులకు సక్రమంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దందాను అరికట్టేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

ఆదాయంలో మూడో వంతు అప్పులే!

▶ మొదటి పేజీ తరువాయి

రూ.2,683 కోట్లు, ఇతర పన్నుల నుంచి రూ.1,327 కోట్లు వచ్చాయి. ఇక పన్నేతర ఆదాయం అంచనాల్లో 4 శాతం అంటే రూ. 891.47 కోట్లు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం నుంచి తొలి రెండు నెలల్లో రూ.3 వేల కోట్లకు పైగా గ్రాంట్లు వచ్చాయి. అందులో పన్నుల్లో వాటా కింద రూ.1,494 కోట్లు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ.1,438 కోట్లు వచ్చాయి.

వడ్డీలకు రూ.3,200 కోట్లు

ఖర్చుల విషయానికి వస్తే వేతనాలు, పింఛన్లు, అప్పులకు వడ్డీల రూపంలో సింహభాగం ఖర్చయ్యాయి. వేతనాలకు రూ.6,784 కోట్లు, పింఛన్లకు రూ.2,779 కోట్లు, అప్పులకు వడ్డీల కోసం రూ.3,205 కోట్లు చెల్లించారు. సబ్సిడీల రూపంలో రూ.1,923 కోట్లు, రెవెన్యూ పద్దు కింద రూ.6,692 కోట్లు ఖర్చయ్యాయి. అన్ని రంగాల్లో కలిపి మూలధన వ్యయం కింద రూ.6,800 కోట్ల వరకు ఖర్చయ్యాయి.

దూసుకెళ్తున్నారు..

అమెరికాలో చదువు కోసం పోటెత్తుతున్న మన విద్యార్థులు	త్వరలోనే చైనాను అధిగమించి మొదటి స్థానానికి..	కోవిడ్ తర్వాత మారిన పరిస్థితులు	అక్కడి విద్యా సంస్థలకు అతిపెద్ద మార్కెట్‌గా భారత్	2023లో 2.53 లక్షల మంది చేరిక	ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్, జర్మన్, ఫ్రాన్స్‌ల నుంచి అమెరికాకు పోటీ



సాక్షి ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

అమెరికాలో గ్రాడ్యుయేషన్, అండర్ గ్రాడ్యుయేషన్ చదువుల కోసం వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం అమెరికాలో విద్యనభ్యసిస్తున్న విదేశీ విద్యార్థుల్లో చైనీయులు అధిక సంఖ్యలో ఉన్నారు. తర్వాత స్థానంలో భారత్ ఉంది. కానీ ఈ పరిస్థితి మరికొన్ని సంవత్సరాల్లోనే మారనుంది. త్వరలోనే భారత్ మొదటి స్థానంలోకి రానుంది. చైనా నుంచి వెళ్లే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతుండటమే ఇందుకు కారణం. ఇటీవలి కాలం వరకు అమెరికా విద్యాసంస్థలు చైనా విద్యార్థులను చేర్చుకోవడానికి అధిక ప్రాధాన్యతనిచ్చేవి. కోవిడ్ తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. ద్వైపాక్షిక సంబంధాలు కూడా ప్రభావం చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా విద్యాసంస్థలు భారత్‌ను తమకు అనుకూలమైన అతిపెద్ద మార్కెట్‌గా పరిగణిస్తున్నాయి. స్ప్రింగ్ స్నాప్‌షాట్ పేరిట ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఐఐఈ) నిర్వహించిన సర్వే ఈ విషయం స్పష్టం చేస్తోంది. 2020 నుంచి 2023 నాటికి చైనా నుంచి వచ్చే విద్యార్థుల సంఖ్య 3,68,800 నుంచి 2,53,630కి తగ్గగా.. అదే సమయంలో భారత్ నుంచి వెళ్లే విద్యార్థుల సంఖ్య 1.90 లక్షల నుంచి 2.53 లక్షలకు పెరిగినట్లు ఐఐఈ పేర్కొంది. 2030కి 3.94 లక్షల మందితో భారత్ అగ్రస్థానానికి చేరుతుందని అంచనా వేసింది.

భారత్ వైపే 57% సంస్థలు మొగ్గు

గ్రాడ్యుయేషన్‌తో పాటు అండర్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులను ఆకర్షించడానికి అమెరికా విద్యాసంస్థలు ప్రయత్నిస్తున్నాయి. ప్రతి పది మంది గ్రాడ్యుయేట్ విద్యార్థుల్లో నలుగురు విదేశీ విద్యార్థులు ఉండేలా ఈ రిక్రూట్‌మెంట్ విధానం కొనసాగుతోంది. 2023–24 విద్యా సంవత్సరంలో విదేశీ విద్యార్థుల చేరికకు సంబంధించి ఏప్రిల్ నుంచి మే మధ్య కాలంలో ఐఐఈ సర్వే నిర్వహించింది. మొత్తం 527 విద్యాసంస్థల నుంచి డేటా సేకరించింది. సుమారు 57 శాతం సంస్థలు భారత్ విద్యార్థులను ఎక్కువగా చేర్చుకోవడానికి ప్రయత్నించినట్లు వెల్లడించింది. 2022–23 కంటే 2023–24 విద్యా సంవత్సరంలో విదేశీ విద్యార్థుల నుంచి తమకు అధికంగా దరఖాస్తులు అందినట్లు 61 శాతం కాలేజీలు/యూనివర్సిటీలు వెల్లడిస్తే.. మరో 28 శాతం విద్యా సంస్థలు తమకు గత సంవత్సరం వచ్చిన మేరకు దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నాయి. మరో 12% విద్యా సంస్థలు మాత్రం తమకు దరఖాస్తులు తగ్గినట్లు తెలిపాయి.

అమెరికాకు తగ్గిన ఆదాయం

కోవిడ్ తరువాత గడిచిన రెండేళ్లుగా విదేశీ విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా, కోవిడ్ కంటే ముందున్న ఆదాయం రాలేదని ఐఐఈ సర్వే వెల్లడిస్తోంది. కోవిడ్‌కు ముందు 2018 విద్యా సంవత్సరంలో విదేశీ విద్యార్థుల నుంచి అమెరికాకు వచ్చే ఆదాయం దాదాపు 45 బిలియన్ డాలర్లు.. మన రూపాయల్లో అది రూ. 3.7 లక్షల కోట్లు. ఇప్పటివరకు ఏ విద్యా సంవత్సరంతో పోల్చినా ఇదే అత్యధిక ఆదాయం. కాగా అప్పట్లో ఏటా దాదాపు 11 లక్షల వరకు విదేశీ విద్యార్థులు అమెరికాలో విద్యాభ్యాసం కోసం వచ్చేవారని పేర్కొంది. అయితే 2022–23లో విదేశీ విద్యార్థుల వల్ల అమెరికాకు 33.8 బిలియన్ డాలర్ల ఆదాయం మాత్రమే సమకూరింది. అంటే మన కరెన్సీలో ఇది రూ.2.7 లక్షల కోట్లు. అమెరికా విద్యా సంస్థలకు ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల నుంచి పోటీ ఎక్కువ అవుతున్నట్లు సర్వేలో తేలింది. అంటే ఈ దేశాల విద్యా సంస్థల్లో కూడా విదేశీ విద్యార్థులు అధిక సంఖ్యలో చేరుతున్నారన్నమాట. ప్రస్తుతం దాదాపు 10 లక్షల మంది వరకు విదేశీ విద్యార్థులు అమెరికాలో ఉన్నారు.

టాప్ టెన్ దేశాలివే..

విదేశీ విద్యార్థుల చేరికకు సంబంధించి ఐఐఈ గణాంకాల ప్రకారం.. గత సంవత్సరం చైనా, భారత్, దక్షిణ కొరియా, కెనడా, వియత్నాం, తైవాన్, సౌదీ అరేబియా, బ్రెజిల్, మెక్సికో, నైజీరియా దేశాలు వరుసగా తొలి పది స్థానాల్లో ఉన్నాయి. ఈ టాప్ టెన్ దేశాల విద్యార్థులే కాకుండా ఇతర దేశాల విద్యార్థులను సైతం అమెరికా విద్యాసంస్థలు ఆకర్షిస్తున్నాయి. 2021–22 సంవత్సరంలో 11వ స్థానంలో ఉన్న జపాన్ నుంచి 14 శాతం పెరుగుదల ఉండగా, చైనా నుంచి 8.6 శాతం తగ్గుదల కనిపించింది. 2023లో జపాన్ విద్యార్థుల సంఖ్యలో 33 శాతం పెరుగుదల ఉంటుందని అంచనా వేసింది. నైజీరియా నుంచి కూడా అనూహ్యంగా విద్యార్థులు పెరిగినట్లు ఐఐఈ తెలిపింది ఇక సౌదీ అరేబియా నుంచి 17 శాతం మేర విద్యార్థులు తగ్గారు. అయితే 2030 నాటికి ఈ దేశం నుంచి విద్యార్థులు గణనీయంగా పెరగనున్నారు. తర్వాత నేపాల్, బంగ్లాదేశ్‌ల నుంచి కూడా విద్యార్థుల సంఖ్య పెరిగి ఆ రెండు దేశాలు టాప్ టెన్‌లో (8, 9 స్థానాల్లోకి)కి రానున్నాయి.

అమెరికాకు టాప్ 10 దేశాల నుంచి విద్యార్థులు ఇలా.. (లక్షల్లో)

దేశం	2022లో	ర్యాంకు	2030 నాటికి	ర్యాంకు
చైనా	2.9	1	2.58	2
భారత్	1.99	2	3.94	1
ద.కొరియా	0.41	3	0.32	4
కెనడా	0.27	4	0.27	7
వియత్నాం	0.21	5	0.31	5
తైవాన్	0.2	6	0.21	11
సౌదీ అరేబియా	0.18	7	0.29	6
బ్రెజిల్	0.15	8	0.23	10
మెక్సికో	0.15	9	0.22	14
నైజీరియా	0.14	10	0.33	3

2020-21 నుంచి 2023-24కి అమెరికా విద్యా సంస్థల్లో విదేశీ విద్యార్థుల ప్రవేశాల పెరుగుదల, యథాతథ స్థితి, తగ్గుదల శాతాలు ఇలా..

సంవత్సరం	పెరుగుదల	మార్పులేదు	తగ్గుదల
2020–21	22	26	52
2021–22	43	19	38
2022–23	65	23	12
2023–24	61	28	12



ఇంగ్లిష్ మాట్లాడే ఇతర దేశాలకూ విద్యార్థులు

విదేశీ విద్యార్థులకు అమెరికానే తొలి ప్రాధాన్యత అయినప్పటికీ..అమెరికాతో పాటు ఆంగ్లం మాట్లాడే ఇతర దేశాలకు కూడా విద్యార్థులు గణనీయ సంఖ్యలో వెళుతున్నారు. ఈ మేరకు అమెరికాకు విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్‌తో పాటు జర్మనీ, స్పెయిన్, ఫ్రాన్స్ తదితర దేశాలకు విదేశాల నుంచి విద్యార్థులు వెళ్తున్నారు. ఆయా దేశాలు విదేశీ విద్యార్థులను ఆకట్టుకోవడానికి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధిస్తున్నాయి.

– డాక్టర్ ఎస్తేర్ డి బ్రిమ్మర్, ఈడీ, సీఈఓ, నేషనల్ అసోసియేషన్ ఫర్ ఫారిన్ స్టూడెంట్ ఎఫైర్స్

మహిళా సర్జన్లకు అవకాశమిస్తే బెదిరింపులొచ్చాయి

- మహిళలతోనే ఉత్పాదకత పెరుగుతుంది
- నా సంస్థలోని ఉద్యోగుల్లో 60 శాతం అతివలే
- హెచ్‌సీఎస్సీ 'స్త్రీ' సదస్సులో ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డి.నాగేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగంలో సర్జన్లుగా మహిళలకు అవకాశం ఇచ్చినందుకు తనకు బెదిరింపులు ఎదురయ్యాయని ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ–మెయిల్స్, లేఖల రూపంలో అవి వచ్చాయని తెలిపారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్సీ) బుధవారం 'షీ ట్రంప్స్ విత్ రెస్పెక్ట్, ఈక్వాలిటీ అండ్ ఎంపవర్‌మెంట్'(స్త్రీ) పేరిట నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కీలకోపన్యాసం చేశారు. హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ నేతృత్వంలో బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ)లోని ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... 'తల్లి, భార్య, కుమార్తె నా జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేశారు. ఏఐజీలో పని చేస్తున్న వారిలో 60 శాతం మంది మహిళా ఉద్యోగులే. చాయ్, సిగరెట్, గాసిప్స్ వంటివి ఉండని కారణంగా మహిళా ఉద్యోగుల వల్ల ఉత్పాదకత ఎక్కువగా ఉంటుంది. పురుషుల కంటే స్త్రీలు ఎన్నో పనులను సమన్వయంతో వేగంగా పూర్తి చేయగలరు. మెడికల్ కాలేజీల్లో మహిళల సంఖ్య 60 శాతం ఉంటే.. పీజీకి వచ్చేసరికి 10 నుంచి 20 శాతానికి పడిపోతోంది. యూరప్, అమెరికా దేశాల్లోని గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్‌ల్లో సగం మంది మహిళలే. మన దేశంలో 300 మంది మహిళా గ్యాస్ట్రోఎంట్రాలజిస్టులు ఉంటే... ఐదుగురే సర్జన్లుగా పనిచేసేవారు. ఈ పరిస్థితులను మార్చడానికి వివిధ దేశాలకు చెందిన ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజీ మహిళా సర్జన్లను ఏఐజీకి పిలిపించి గతంలో ఓ క్యాంప్ ఏర్పాటు చేశాం. ఈ స్ఫూర్తితో దేశంలోని 100 మంది మహిళా గ్యాస్ట్రోఎంట్రాలజిస్టులు సర్జరీలు చేయడం ప్రారంభించారు. వీరిని ప్రోత్సహిస్తున్నందుకు 10 మంది నుంచి బెదిరింపులు వచ్చాయి. సాధారణ ప్రసవం, తల్లిపాలు ఇవ్వడం, ఆరు నెలలవరకు ఎలాంటి యాంటీ బయాటిక్స్ వాడకపోవడం వల్ల శిశువులు భవిష్యత్‌లో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాతో ఉంటారు. మనం మహిళలకు మద్దతు ఇవ్వడంతో పాటు బాధ్యతల్లో భాగస్వాముల్ని చేయాలి'అని కోరారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన హోంమంత్రి మహమూద్ అలీ 'కుటుంబ జీవితం–సామాజిక మాధ్యమాలు' అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ–హెచ్‌సీఎస్సీ సంయుక్తంగా చేపట్టిన అధ్యయన పత్రాన్ని ఆవిష్కరించారు.

ప్రభుత్వ పాఠశాలల దత్తతకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలి

హిమాన్షును స్ఫూర్తిగా తీసుకోవాలి: మంత్రి సబితా ఇంద్రారెడ్డి

- కేశవ్‌నగర్‌లో పునర్నిర్మించిన ప్రభుత్వ పాఠశాల ప్రారంభం
- ఈ పాఠశాల దుర్భర పరిస్థితి చూసి కన్నీళ్లు వచ్చాయి
- స్కూల్ కట్టించాం.. మీ నుంచి డాక్టర్లు, ఇంజనీర్లు రావాలి
- సీఎం కేసీఆర్ మనవడు హిమాన్షు రావు



ప్రభుత్వ పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి సబిత ఇంద్రారెడ్డి, హిమాన్షు, అరెకపూడి గాంధీ

గచ్చిబౌలి (హైదరాబాద్): ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకునేందుకు కార్పొరేట్ సంస్థలు, స్కూళ్లు, పారిశ్రామికవేత్తలు, నాయకులు ముందుకు రావాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం గచ్చిబౌలి డివిజన్‌లోని కేశవ్‌నగర్‌లో సీఎం కేసీఆర్ మనవడు, కేటీఆర్ కుమారుడు హిమాన్షురావు చేయూతతో పునర్నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేద పిల్లలకు మెరుగైన విద్యను అందించాలని సీఎం కేసీఆర్‌లో తపన, ఆరాటం ఉంటుందన్నారు. అలాగే రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌లో, ఆయన తనయుడు హిమాన్షులోను సామాజిక బాధ్యత ఉందన్నారు. తాత నుంచి వచ్చిన సామాజిక దృక్పథం వల్లే హిమాన్షు పేద పిల్లలు చదివే పాఠశాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. యువత పుట్టినరోజును ఎలా ఎంజాయ్ చేయాలా అని చూస్తారని, హిమాన్షు మాత్రం సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని తెలిపారు. హిమాన్షు సూచనల మేరకు కేశవ్‌నగర్ పాఠశాలకు అవసరమైన టీచర్లను నియమిస్తామన్నారు. ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ, హిమాన్షు సామాజిక బాధ్యత చూస్తుంటే.. మీరేం చేస్తారని మౌనంగా మమ్మల్ని ప్రశ్నిస్తున్నట్టు ఉందన్నారు. నియోజకవర్గంలోని 62 పాఠశాలలను దత్తతకు తీసుకునే విధంగా కృషి చేస్తానని ఆయన ప్రకటించారు.



బుధవారం గచ్చిబౌలి డివిజన్‌లోని కేశవ్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న హిమాన్షు

కేసీఆర్ నాకు స్ఫూర్తి: హిమాన్షు

'చదువుకున్న వారు సమాజాన్ని, సమస్యలను అర్థం చేసుకుంటారు... పేదరికాన్ని అరికట్టేందుకు కృషి చేస్తారని మా తాత కేసీఆర్ ఇంగ్లిష్‌లో పెద్ద కొటేషన్ చెప్పారు. అదే నాకు స్ఫూర్తినిచ్చింది' అని కేసీఆర్ మనవడు హిమాన్షురావు పేర్కొన్నారు. ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో కాస్ (క్రియేటివ్ యాక్షన్ సర్వీస్) ప్రెసిడెంట్‌గా మొక్కలు నాటడం తనకు సంతృప్తి ఇవ్వలేదని, కేశవ్‌నగర్ పాఠశాలలో దుర్భర పరిస్థితులను చూసి కన్నీళ్లు వచ్చాయన్నారు. ఆడపిల్లల టాయిలెట్ ముందు పందుల గుంపు ఉండటం చూసి ఎంతో బాధపడ్డానని చెప్పారు. ఓక్రిడ్జ్ కాస్ ఆధ్వర్యంలో రెండు పెద్ద ఈవెంట్లు నిర్వహించేందుకు పాఠశాల యాజమాన్యం అనుమతివ్వడంతో రూ.40 లక్షల నిధులు సమకూర్చామని, సీఎస్ఆర్, స్నేహితుల ద్వారా సేకరించిన నిధులతో కేశవ్‌నగర్ పాఠశాలను ఆధునికంగా తీర్చిదిద్దామని హిమాన్షు వివరించారు. పాఠశాలను కట్టించామని, భవిష్యత్తులో ఈ బడి నుంచి డాక్టర్లు, ఇంజనీర్లు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థుల మధ్య బర్త్ డే జరుపుకున్నారు. విద్యార్థులు, మంత్రితో కలిసి భోజనం చేశారు.

మెడికల్ విద్యార్థి ఆత్మహత్య

- ఎర్రగడ్డ ఆయుర్వేద కళాశాలలో బీఏఎంఎస్ చదువుతున్న జగదీశ్
- కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ తండ్రి ఫిర్యాదు

వెంగళరావునగర్ (హైదరాబాద్): మానసిక ఒత్తిడి కారణంగా ఓ మెడికల్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నారాయణపేట జిల్లా విఠలాపూర్ గ్రామానికి చెందిన జి.డి మాణిక్యప్ప వ్యవసాయం చేస్తుంటారు. ఆయనకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు జగదీశ్ (23)కు చిన్నప్పటి నుంచి ఎంబీబీఎస్ చదివి డాక్టర్ కావాలని కోరిక. ఈ క్రమంలో గత ఏడాది నీట్ ఎంట్రన్స్ రాశాడు. ఎంబీబీఎస్ సీటు రాకపోవడంతో ఎర్రగడ్డ ఆయుర్వేద కళాశాలలో బీఏఎంఎస్ మొదటి సంవత్సరంలో చేరాడు. వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో తన స్నేహితుడు ఫణీంద్రతో కలిసి రూం తీసుకుని ఉంటున్నాడు. బీఏఎంఎస్ చేయడం ఇష్టం లేకపోవడంతో కళాశాలకు కూడా సరిగా వెళ్లలేకపోయాడు. ఈ క్రమంలో ఈ నెల 25వ తేదీ నుంచి బీఏఎంఎస్ పరీక్షలు జరుగుతున్నట్టు నోటీసు వచ్చింది. జగదీశ్ సరిగా కళాశాలకు హాజరు కాలేకపోవడంతో హాల్ టికెట్ పొందేందుకు ఇబ్బంది ఎదుర్కొన్నాడు. తనకు హాల్ టికెట్ ఇవ్వరేమో, పరీక్షలు రాయడానికి వీలుపడదేమో అనుకుని ఒత్తిడికి గురయ్యాడు. ఒకవైపు ఇష్టమైన ఎంబీబీఎస్ సీటు రాకపోవడం, మరోవైపు బీఏఎంఎస్ హాల్ టికెట్ ఇస్తారో లేదో అనే ఆందోళనతో జగదీశ్ మానసిక సంఘర్షణకు లోనయ్యాడు. ఇదిలాఉండగా బుధవారం ఉదయం 7.30 గంటలకు జగదీశ్ రూంలో ఉంటున్న ఫణీంద్ర తన మరో స్నేహితుడైన రాజ్‌కుమార్ రూంకు వెళ్లాడు. జగదీశ్ 8.30 గంటల సమయంలో తన స్నేహితుడు అజయ్‌కు వాట్సాప్ ద్వారా తాను చనిపోతున్నట్టు మెసేజ్ పెట్టాడు. వెంటనే అజయ్ ఆందోళన చెంది ఫోన్ చేయగా, తాను చనిపోతున్నట్టు చెప్పి ఫోన్ కట్ చేశాడు. హుటాహుటిన అజయ్ తన స్నేహితుడు నవీన్‌కు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే నవీన్, ఫణీంద్ర, ప్రశాంత్ కలిసి హుటాహుటిన జవహర్‌నగర్‌కు వచ్చి చూడగా గదిలో జగదీశ్ ఉరి వేసుకుని ఉన్నాడు. జగదీశ్‌ను ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని తండ్రి మాణిక్యప్పకు తెలియజేయడంతో ఆయన హుటాహుటిన మధురానగర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. తన కుమారుడి మరణంపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.



జగదీశ్ (ఫైల్)

అదనపు డీఎంఈల వయోపరిమితి పెంపు

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రకటన
- వయోపరిమితి పెంపుపై గవర్నర్ తిరస్కరణ నేపథ్యంలో నిర్ణయం
- అదనపు డీఎంఈల వయోపరిమితి 57 నుంచి 64 ఏళ్లకు పెంపు
- పీఎంపీ, ఆర్‌ఎంపీల శిక్షణపై కమిటీ ఏర్పాటుకు ఆదేశం
- ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ నుంచి అడిషనల్ డీఎంఈ గా పదోన్నతి పొందేందుకు వీలుగా వయోపరిమితిని 57 ఏళ్ల నుంచి 64 ఏళ్లకు పెంచుతూ వైద్య ఆరోగ్యశాఖ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అదనపు డీఎంఈ పదోన్నతి ప్రక్రియను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. డీఎంఈ (వైద్య విద్య డైరెక్టర్), అడిషనల్ డీఎంఈ, మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్ పోస్టుల వయోపరిమితిని 61 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు పెంచే బిల్లును గవర్నర్ తిరస్కరించిన నేపథ్యంలో మంత్రి ఈ నిర్ణయం ప్రకటించడం గమనార్హం. అయితే గవర్నర్ తిరస్కరించినా దీన్ని ఎలా అమలు చేస్తారన్న దానిపై వైద్య ఆరోగ్యశాఖ స్పష్టత ఇవ్వలేదు. బిల్లును తిరిగి గవర్నర్‌కు పంపే ప్రక్రియను ప్రారంభిస్తారా? లేక ఏం చేస్తారన్న దానిపై సమావేశంలో ఎలాంటి చర్చ జరగలేదని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఈ నిర్ణయంతో డీఎంఈ, అడిషనల్ డీఎంఈ, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్ పోస్టుల్లో ఉన్న వారి వయో పరిమితి పెరుగుతుంది. డీఎంఈ రమేష్‌రెడ్డి కొనసాగింపునకు ఎలాంటి అవరోధం ఉండదని చెబుతున్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పదోన్నతి

బుధవారం రాష్ట్ర సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి హరీశ్‌రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రొఫెసర్ల బదిలీల విషయంలో ప్రభుత్వానికి వెంటనే ప్రతిపాదనలు పంపాలని డీఎంఈ రమేష్ రెడ్డిని ఆదేశించారు. బోధనాసుపత్రుల్లో 190 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించే ప్రక్రియను వారంలోగా పూర్తిచేసి వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలని చెప్పారు. వైద్య విధాన పరిషత్‌లోని మొత్తం 112 డిప్యూటీ సివిల్ సర్జన్, సివిల్ సర్జన్ పదోన్నతుల ప్రక్రియ వెంటనే చేపట్టి 15 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే అందులోనే 371 నర్సు పదోన్నతుల ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలన్నారు. వచ్చే 10 రోజుల్లో లోకలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి, నెల రోజుల్లో పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలని వెల్లడించారు. అలాగే ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, రేడియోగ్రాఫర్స్‌కు సంబంధించిన పదోన్నతుల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. సమీక్ష సమావేశంలో ఆ శాఖ కార్యదర్శి రిజ్వీ, ఆర్ అండ్ బీ ఈఎన్‌సీ గణపతి రెడ్డి, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, డీఎంఈ రమేష్ రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీ, ఆర్‌ఎంపీలకు శిక్షణ

ఆర్‌ఎంపీ (రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్), పీఎంపీ (ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్)లకు శిక్షణ ఇచ్చే విషయంపై వైద్యాధికారులకు హరీశ్‌రావు కీలక ఆదేశాలు జారీ చేశారు. హైకోర్టు ఆదేశాలకు లోబడి వారికి శిక్షణ ఇచ్చే అంశంపై వారం రోజుల్లోగా పూర్తిస్థాయి నివేదిక రూపొందించేలా కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. పీఎంపీ, ఆర్‌ఎంపీలకు శిక్షణ ఇవ్వడం, వారి ద్వారా ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడం సరికాదని జూనియర్ డాక్టర్లు మండిపడుతున్నారు. కాగా, డెంగీ వ్యాధి చికిత్సలో ఉపయోగించే 32 సింగిల్ డోనార్ ప్లేట్‌లెట్స్ మిషన్లను రూ.10 కోట్లతో వెంటనే కొనుగోలు చేసి, అన్ని జిల్లా ఆసుపత్రుల్లో ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. వీటివల్ల సకాలంలో రోగ నిర్ధారణ జరిగి సత్వరం చికిత్స అందించడానికి వీలవుతుంది. కాగా, కొత్తగా సమకూర్చుకున్న 228 అమ్మఒడి వాహనాలు, 204 అత్యవసర 108 వాహనాలు, భౌతికకాయాలను తీసుకెళ్లే 34 వాహనాలను ఆగస్టు 1న ప్రారంభించేందుకు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

తుది ఉత్తర్వుల మేరకే ఎంబీబీఎస్ సీట్లు

- పిటిషనర్లూ దరఖాస్తు చేసుకోవచ్చు
- ఏపీ విద్యార్థులకు తెలంగాణలో రిజర్వేషన్ ఎలా ఇస్తారన్న హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: కొత్త మెడికల్ కాలేజీల్లో రిజర్వేషన్ల అంశంపై తుది తీర్పునకు లోబడే సీట్ల కేటాయింపు ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుతానికి పిటిషనర్లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పింది. అలాగే వారి సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించాలని అధికారులకు చెప్పింది. విభజన తర్వాత ఏపీ విద్యార్థులకు తెలంగాణలో రిజర్వేషన్ ఎలా ఇస్తారని న్యాయస్థానం సందేహం వ్యక్తం చేసింది. పూర్తి వాదనలు విన్న తర్వాత తేలుస్తామని చెప్పింది. కొత్త మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలోని 100 శాతం ఎంబీబీఎస్ సీట్లను తెలంగాణ విద్యార్థులకే రిజర్వు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం జూలై 3న ఇచ్చిన జీవో 72ను కొట్టివేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. తెలంగాణ వైద్య కళాశాలల అడ్మిషన్ నిబంధనలకు సవరణ చేస్తూ ప్రభుత్వం వారం కిత్రం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం 2014, జూన్ 2 తర్వాత ఏర్పాటైన మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటాలోని 100 శాతం ఎంబీబీఎస్ సీట్లు తెలంగాణ విద్యార్థులకే రిజర్వ్ కానున్నాయి. అంతకుముందు 85 శాతం మాత్రమే స్థానిక విద్యార్థులకు ఉండగా, మిగతా 15 శాతం అన్‌రిజర్వ్‌డుగా ఉండేది. ఇందులో తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా పోటీ పడేవారు. తాజా జీవోతో ఏపీ విద్యార్థులకు పోటీపడే అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ విజయవాడకు చెందిన పి.సాయిసిరిలోచనతో పాటు మరో ఇద్దరు తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వాదనల అనంతరం హైకోర్టు విచారణను ఆగస్టు 9కి వాయిదా వేసింది.



నేనొక గొప్ప కవిని. నా కవితలను నేను కాగితం మీద రాయను: అవి అనుభవాలు, అనుభూతులను (మాత్రం) కలిగివుంటాయి.
– హానోరే డె బాల్జాక్

సాక్షి
గురువారం, 13 జూలై 2023

‘సెమీ’ ఆశలకు సడన్ బ్రేకులు!

ఆశించిన పురోగతికి అర్ధంతరంగా బ్రేకులు పడినప్పుడు నిరాశ సహజమే! అందులోనూ అది స్వాక్షాత్తూ ప్రధాని గొప్పగా చెప్పిన ఆత్మనిర్భర ఆశయాలకు భంగకరమని అనిపించినప్పుడు నిరుత్సాహం మరీ ఎక్కువే! భారత దేశ సెమీ కండక్టర్ల (చిప్‌ల) తయారీ ఆకాంక్షలకు ఇప్పుడు అలాంటి అవరోధాలే వచ్చాయి. సెమీ కండక్టర్ల తయారీకి కలసి కృషి చేసేందుకు ఒక్కటైన తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజ సంస్థ ‘ఫాక్స్‌కాన్’, భారత సంస్థ ‘వేదాంత’ ఇప్పుడు దేని దారి అది చూసుకోవడం అలాంటి పరిణామమే. దీనివల్ల భారత చిప్ లక్ష్యాలకు ఇబ్బంది ఏమీ ఉండదని కేంద్రం చెబుతున్నప్పటికీ అది సంపూర్ణ సత్యమేమీ కాదు. చిప్‌ల తయారీ నిమిత్తం వేదాంత– ఫాక్స్‌కాన్‌లు గత ఏడాది ఉమ్మడి భాగస్వామ్యానికి దిగి, గుజరాత్ ప్రభుత్వంతో 19.5 బిలియన్ డాలర్ల విలువైన సెమీ కండక్టర్ల కేంద్రం ఏర్పాటుకు ఒప్పందం చేసుకున్నాయి. తీరా పట్టుమని పది నెలలకే ఆ గ్రూపు నుంచి వైదొలగుతున్నట్టు ఫాక్స్‌కాన్ ప్రకటించడం ఒక విధంగా ఆకస్మిక బ్రేకనే చెప్పాలి. ఎలక్ట్రానిక్స్ తయారీ, డిజైన్ రంగంలో ప్రపంచ కేంద్రంగా మన దేశం ఆవిర్భవించేందుకు తగిన వాతావరణ పరికల్పనే లక్ష్యంగా పెట్టుకున్న భారత సెమీ కండక్టర్ మిషన్ (ఐఎస్ఎం)కు ఇది శుభవార్త కానే కాదు.

‘సెమీ కండక్టర్ల ఆలోచనను నిజం చేయడానికి’ వేదాంత సంస్థతో కలసి ఏడాది పైగా కృషి చేసిన ఫాక్స్‌కాన్ పరస్పర అంగీకారంతో, ఈ ఉమ్మడి భాగస్వామ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని నిర్ణయించుకున్నట్టు సోమవారం ప్రకటించింది. అంటే ఇక ఆ బృహత్ ప్రయత్నంలో ఫాక్స్‌కాన్ పేరు ఉండదు. ప్రాజెక్ట్ పూర్తిగా వేదాంత సంస్థకే సొంతమన్నమాట. తొలి ప్రకటన వచ్చిన 24 గంటల లోపే ఇటు ఫాక్స్‌కాన్ సైతం విడిగా తగిన సాంకేతిక భాగస్వామిని చేర్చుకొని, తనదైన వ్యూహంతో ముందుకు నడుస్తుందన్న సంకేతాలొచ్చేశాయి. కలసి అడుగులేసిన సంస్థలు ఏడాదికే ఇలా వేరు కుంపట్లయిన పరిణామానికి కారణాలేమిటన్నది అవి చెప్పలేదు. గుజరాత్‌లో చిప్‌ల తయారీకి కావాల్సిన లైసెన్స్‌తో కూడిన సాంకేతిక పరిజ్ఞానంకోసం వేదాంత, ఫాక్స్‌కాన్‌లు ఎస్టీమైక్రోను ఆసరాగా బరిలోకి దింపాయి. కానీ, ప్రభుత్వం మాత్రం సదరు యూరోపియన్ చిప్ తయారీ సంస్థ కూడా నిష్పూచీగా మిగలక, ఒప్పందంలో భాగస్వామిగా ఉండాల్సిందే అనడంతో చిక్కొచ్చినట్టుంది.

ప్రపంచంలో 37 శాతం చిప్‌లు తైవాన్‌వే! భారత ఎలక్ట్రానిక్ చిప్ అవసరాలన్నీ ప్రధానంగా దిగుమతి ద్వారానే తీరుతున్నాయి. కొన్నేళ్ళుగా ఏటా దాదాపు 1000 కోట్ల డాలర్ల విలువైన చిప్‌లను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. అందులో సుమారు 70 శాతం చైనా నుంచి వస్తున్నవే. చిప్‌ల తయారీలోని ఈ అంతరాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఐఎస్ఎం ప్రారంభమైంది. అమెరికా, జపాన్, దక్షిణ కొరియా, అనేక ఐరోపా దేశాలు చిప్‌ల తయారీ సత్తా పెంచుకుంటున్నాయి. తాజాగా భారత్ ఆ పరుగులో చేరింది. దేశంలో చిప్‌ల తయారీ కేంద్రాల్ని నెలకొల్పాలని వచ్చేవారికి పెట్టుబడి రూపంలో ప్రోత్సాహకాలిచ్చేందుకు సిద్ధపడింది. అమెరికా చిప్ తయారీ సంస్థ మైక్రాన్ ఇటీవలే భారత్‌లో చిప్ కేంద్రానికి ఆమోదం పొందింది. కేంద్ర, గుజరాత్ సర్కార్లు దానికి గణనీయంగా పెట్టుబడి సాయం చేస్తున్నాయి. ఆత్మ నిర్భరతకై ఇలాంటి యత్నాలు జరుగుతున్న వేళ భారీ ఒప్పందమైన వేదాంత – ఫాక్స్‌కాన్ చిక్కుల్లో పడడమే విచారకరం.

కారణాలేమైనా గత ఏడాది ఫిబ్రవరి 14న ఫాక్స్‌కాన్– వేదాంతల మధ్య మొలకెత్తిన ప్రేమ మూణ్ణాళ్ళ ముచ్చటైంది. గుజరాత్‌లో చిప్‌ల తయారీ కేంద్రాల ఏర్పాటుకై గత సెప్టెంబర్‌లో చేసుకున్న రూ. 1.54 లక్ష కోట్ల మేర ఒప్పందాలు ఇరుకునపడ్డాయి. ఏ సంస్థకు ఆ సంస్థ విడివిడిగా ముందుకు పోయినా భారత సెమీ కండక్టర్ల మిషన్‌లో జాప్యం తప్పదనిపిస్తోంది. చిప్‌ల తయారీకి తగ్గ పునాది లేకున్నా చిప్ డిజైన్‌లో మాత్రం మన దేశం ముందంజలో ఉంది. దాన్ని ఆయుధంగా మలుచుకోవాలి. సొంత తయారీతో పదునుపెట్టుకోవాలి. పైగా, కరోనాతో సరఫరా వ్యవస్థలకు అంతరాయం, రష్యా – ఉక్రెయిన్ యుద్ధంతో వచ్చిపడ్డ అనివార్యతల రీత్యా రక్షణ, ఎలక్ట్రానిక్స్ తదితర కీలక రంగాల్లో భారత్ ఎంత త్వరగా సొంతకాళ్ళపై నిలబడగలిగితే వ్యూహాత్మకంగా అంత మంచిది.

ఆ మాటకొస్తే, ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అమెరికా పైచేయి సాధించగలిగిందీ ఈ చిప్‌ల వల్లేనంటారు విశ్లేషకులు. అమెరికా, చైనాల మధ్య ఇప్పుడు నడుస్తున్న భౌగోళిక రాజకీయాల తోపులాటలోకూ ఇవే కారణం. ఇవాళ దేశాలన్నీ తమ గడ్డపైనే అన్ని రకాల చిప్‌ల రూపకల్పనకు అత్యంత ప్రాధాన్యమిస్తోందీ, ప్రోత్సాహకాలిస్తున్నదీ అందుకే. కాబట్టి, మనకు అవసరమైన చిప్‌ల డిజైనింగ్ నుంచి తయారీ దాకా అన్నీ మన చేతుల్లోనే ఉండడం పోటీలో ముందు ఉండడానికో, ఆర్థిక ప్రయోజనాల రీత్యానో కాకున్నా... వ్యూహాత్మకంగా భారత్‌కు అత్యంత కీలకం. అందుకే, వేదాంత – ఫాక్స్‌కాన్‌ల బంధం విచ్ఛిన్నమైందన్న నిరాశను పక్కనపెట్టి, సెమీ కండక్టర్ల రంగాన్ని దృఢంగా నిర్మించేందుకు మరింతగా కృషి చేయాలి. చైనా లాంటివి పడనివ్వకుండా చేసినా పట్టుదలతో సాగాలి.

వేదాంత – ఫాక్స్‌కాన్‌లకు ఇరుకున పెట్టిన ఆర్థిక, సాంకేతిక అంశాలనూ క్షుణ్ణంగా పరిశీలించాలి. భవిష్యత్తులో ఇలాంటి మరో ప్రయత్నానికి ఆ చిక్కులు రాకుండా నివారించాలి. సెమీ కండక్టర్ల రంగంలో సాంకేతిక విజ్ఞాన బదలీని ప్రోత్సహించాలి. పరిశోధన, అభివృద్ధిలో దేశ, విదేశీ సంస్థల మధ్య సహకారాన్నీ పెంచిపోషించడమూ అంతే ముఖ్యం. ఎందుకంటే, ఐఎస్ఎం కింద రూ. 76 వేల కోట్ల కేటాయింపుతో నాలుగు పథకాలు ప్రవేశపెట్టామంటున్న ప్రభుత్వం సంస్థలకు తగిన వాతావరణం కల్పిస్తేనే ఫలితం. మేకిన్ ఇండియాకు బ్రేకులు పడకూడదంటే అది అత్యంత కీలకం.

అసలు కావలిసింది ‘ఉమ్మడి ఆర్థిక స్మృతి!’

దేశ పౌరుల్లో కొందరికి భారీ ఆస్తులున్నాయి! కొందరికి రెక్కల కష్టం తప్ప వేరే మార్గం లేదు. దేశంలో భూములు ఎన్ని? అవి ఉమ్మడిగానే ఉంటున్నాయా? దేశంలో, ఉత్పత్తి రాసుల్ని కురిపించే పరిశ్రమల్లో పౌరులందరూ సమానులేనా? సమస్త రవాణా సాధనాలనూ నిర్మించడానికీ, నడపడానికీ, కోట్ల కోట్ల డబ్బు రాసుల రాబడులకూ కారకులు ఎవరు? వాటి యాజమాన్యాలు ఎవరివి? ఆస్తి హక్కులకు కారణాలు ఏమిటి? పాకీ దొడ్లు తుడిచే అట్టడుగు కులాల శ్రామికులకు దేని మీద యాజమాన్యం ఉంది? దేశంలో, నిత్యం 24 గంటలూ ఉత్పత్తుల కార్యాలలో మునిగి బ్రతికే శ్రామికులకు సుఖ శాంతుల్లో ఉమ్మడితనం ఉందా? ‘ఉమ్మడి పౌర స్మృతి’ అనేది నిజంగా ఎప్పుడు సాధ్యం? ‘ఉమ్మడి ఆర్థిక స్మృతి’ అనేది ఉన్నప్పుడు మాత్రమే!

అభిప్రాయం



రంగనాయకమ్మ

‘ఒకే ఇంట్లో వున్న ఇద్దరు వ్యక్తులకు రెండు వేరు వేరు చట్టాలు వుంటే, ఆ కుటుంబం సవ్యంగా సాగుతుందా, చెప్పండి?’ అని ప్రధాని మోదీ, బీజేపీ కార్యకర్తల్ని అడిగిన వార్త, పది రోజులుగా ఒక చర్చనీయాంశం అయింది! అన్ని మతాల వారినీ ఒకే రకపు పౌరులుగా చేయాలనే ప్రయత్నంతో, ‘ఉమ్మడి పౌర స్మృతి’ అనే విధానం ఎంత అవసరమో చెప్పడానికి మోదీ తమ పార్టీ కార్యకర్తలకు ఇచ్చిన ఉపన్యాసం అది! దేశంలో, ఐదు రాష్ట్రాలలో, త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని, అన్న బోధనగా ఆ మాటల్ని అర్థం చేసుకోవచ్చు. ముస్లిం ఓటర్ల ఓట్లు బీజేపీకి ఎలానూ రావని ఆ పార్టీకి తెలుసు. కాబట్టి, హిందూ ఓటర్లలో అత్యధికుల్ని తన వైపు తిప్పుకోవడానికే బీజేపీ చేసే ప్రయత్నం అది. ఆ విధంగా భారత దేశ ప్రజలందర్నీ పౌరులుగా కాక, హిందువులుగా, ముస్లిములుగా, విభజించడానికే మోదీ వేసిన ఎత్తుగడ అది– అని కొన్ని ప్రతిపక్షాలు సరిగానే విమర్శిస్తున్నాయి.

‘ఉమ్మడి పౌర స్మృతి’ అనే విధానపు మంచి చెడ్డల గురించి చెప్పుకోవాలంటే, ముందు అది ఏమిటో కనీసంగా తెలియాలి. ఒక దేశంలోనే కాదు, ప్రపంచం లోనే వున్న ఆడా, మగా పౌరులందరికీ, మతం, కులం, ప్రాంతం వంటి తేడాలు లేకుండా, పౌరుల వ్యక్తిగత జీవితాల్నీ, కుటుంబ జీవితాల్నీ శాసించే, ఒకే రకమైన చట్టం (‘స్మృతి’) ఉండవలిసిందే! ఎందుకంటే, ఉదాహరణకి, ఒకటి రెండు మతాల్లో, పురుషులకు ఎక్కువ మంది స్త్రీలతో పెళ్ళిళ్ళు! ఇంకో మతంలో, పెళ్ళయిన వాళ్ళు విడిపోవడంలో స్త్రీలకే కాదు, పురుషులకు కూడా అసాధ్యమైనంత కష్టం! మతాల్లో, ఆస్తి హక్కులు ఆడవాళ్ళకీ, మగవాళ్ళకీ వేరు వేరుగా! మొగవాడి దృష్టిలో ఆడది తక్కువ! ఆడదాని దృష్టిలో మొగవాడు ఎక్కువ! ఈ విధంగా, పెళ్ళీ, విడాకులూ, దత్తతా, ఆస్తి హక్కూ, వంటి విషయాల్లో, వేరు వేరు మతస్తుల ఆచారాలూ, నియమాలూ, వేరు వేరే! ఎందుకూ? భారత్‌లో, మతాల గురించీ, కులాల గురించీ, సమానత్వాల బోధనలతో మాట్లాడే వాళ్ళు, అసలు బ్రతుకు తెరువుకి పునాది కారణం అయిన ఆదాయాల్లో తేడాల గురించి ఎందుకు ఎత్తరు?

‘ఉమ్మడి పౌర స్మృతి’ కోసం ప్రయత్నించాలని, భారత రాజ్యాంగంలో కూడా ఒక చోట చెప్పారని తెలుస్తుంది! కానీ, దాన్ని సాధించడానికి సరైన పునాదిగా ఏ పరిస్థితులు ఏర్పడాలో భారత రాజ్యాంగం చెప్పదు! ఎవరి మతాచారాల్ని వారు ఆచరించే హక్కులు ఉండవచ్చని ఒక వేపు చెపుతూనే, ‘మతాలతో నిమిత్తం లేకుండా’ పౌరులందరికీ, వ్యక్తిగత, కుటుంబ జీవితాలకు సంబంధించి ఒకే చట్టం ఉండాలని



ఇంకో పక్క సూచిస్తుంది. ఎంత గడుసు రాజ్యాంగం! ఒకటి ‘ప్రాథమికమైన హక్కు’! రెండోది కేవలం ‘సూచన’! సూచన, నిబంధనగా ఎప్పటికీ అవదు. ఉమ్మడి పౌర స్మృతి కూడా నిజానికి సూచన వంటిదే! కానీ, దాన్ని చట్టంగా నిలబెట్టాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి ఇప్పుడు.

మోదీని, బీజేపీ కార్యకర్తలు ఈ తర్కంతో అడగాలి: అయ్యా! తమరు ఉమ్మడి పౌర స్మృతి పేరుతో పౌరులందరికీ ఒకే చట్టం ఉండాలంటున్నారు! ఆ స్మృతి, కేవలం వ్యక్తిగత, కుటుంబ జీవితాలకు మాత్రమే కదా? మరి, పౌరులందరూ ఆర్థికంగా ఒకే స్థితిలో లేరు! ‘ఆర్థికంగా’ అంటే, ‘రూపాయి నోట్ల’ పరంగా కాదు, శ్రమలు చేయడాల పరంగా, ఉత్పత్తి కార్యాల పరంగా! దేశ పౌరుల్లో, కొందరికి భారీ భారీ ఆస్తులున్నాయి! కొందరికి రెక్కల కష్టం తప్ప వేరే మార్గం లేదు. దేశంలో భూములు ఎన్ని? అవి ఉమ్మడిగానే వుంటున్నాయా? దేశంలో, ఉత్పత్తి రాసుల్ని కురిపించే పరిశ్రమల్లో పౌరులందరూ సమానులేనా? సమస్త రవాణా సాధనాలనూ నిర్మించడానికీ, నడపడానికీ, కోట్ల కోట్ల డబ్బు రాసుల రాబడులకూ కారకులు ఎవరు? వాటి యాజమాన్యాలు ఎవరివి? ఆస్తి హక్కులకు కారణాలు ఏమిటి? పాకీ దొడ్లు తుడిచే అట్టడుగు కులాల శ్రామికులకు దేనిమీద యాజమాన్యం వుంది? దేశంలో, నిత్యం, 24 గంటలూ, ఉత్పత్తుల కార్యాలలో మునిగి బ్రతికే శ్రామికులకు, సుఖ శాంతుల్లో ఉమ్మడితనం వుందా? ఆడవాళ్ళ గృహ కార్యాలలో, పిల్లల పెంపకాల్లో, వృద్ధుల సంరక్షణల్లో, పురుషుల ఉమ్మడి పాత్ర వుందా? శ్రామిక జనంలో, మేధా శ్రామికులు వేరూ, శారీరక శ్రమల వారు వేరూ! శ్రమలు చేయడాల్లో ఉమ్మడితనం లేకపోతే, పౌరులుగా సమానులా?

ఈ రకంగా ఆర్థిక అసమానతల గురించి స్పష్టంగా గ్రహిస్తూ, మోదీ వంటి నాయకుల్ని అడగవలిసిన ప్రశ్న ఏమిటి? వ్యవసాయంలో, పరిశ్రమల్లో, రవాణాల్లో, సమస్త శ్రమల్లోనూ కాదా; ఏ ఒక్క శ్రమలో అయినా వేలు పెట్టని పౌరులకూ, రాత్రింబవళ్ళూ డ్యూటీలతో సతమతమయ్యే పౌరులకూ మధ్య ఉమ్మడితనం ఉన్నట్టా? ఇది వుందో లేదో ప్రశ్న లేకుండా, పెళ్ళికో, విడాకులకో, దత్తతకో, దీనికో, దానికో ఉమ్మడి చట్టాలా? హక్కులే సమానంగా, ఉమ్మడిగా లేనప్పుడు, ఉమ్మడి పౌర స్మృతి గురించి ఉపన్యాసం ఇస్తున్నారేమీ మహాశయా?– అని మోదీని ప్రజలందరూ ప్రశ్నించ లేరా? ఎన్నికల ముచ్చట్లలోనూ, నాయకుల ఆరాధనల్లోనూ మునిగిపోయిన ఏ పార్టీ ప్రజలకైనా, ఏ ప్రశ్నలూ రావు.

‘ఉమ్మడి పౌర స్మృతి’ అనేది నిజంగా ఎప్పుడు సాధ్యం? ‘ఉమ్మడి ఆర్థిక స్మృతి’ అనేది ఉన్నప్పుడు! ఉమ్మడి ఆర్థిక స్మృతి అంటే: మానవుల మనుగడకు ఆధారమైన భూములూ, గనులూ, అడవులూ, పరిశ్రమలూ, రవాణా సాధనాలూ వంటి ఉత్పత్తి సాధనాలు, పౌరులందరి ఉమ్మడి ఆస్తిగా, అంటే, ‘సమాజపు ఆస్తి’ గా ఉన్నప్పుడు! అలా ఉంచే చట్టమే ఉమ్మడి ఆర్థిక స్మృతి! చిన్న పిల్లలూ, వృద్ధులూ, అనారోగ్యంతో వున్నవారూ తప్ప, ఇతర స్త్రీ-పురుషులందరూ, వేరు వేరు విలువలు కలిగిన, ఉత్పత్తి కార్యాలలో బాధ్యతలు కలిగి వుండే విధానమే ఉమ్మడి ఆర్థిక స్మృతి! ఆ విధానమే ఉమ్మడి పౌర స్మృతికి దారితీయగలదు!

శ్రమ దోపిడీని అనుమతించే వర్గ భేదాల రాజ్యాంగ పాలన వున్న చోట, తర్క రహిత మతాచారాలు జీవితాల్ని శాసిస్తూ వుంటాయి. సమానత్వం లేని శ్రమ విభజన వల్ల తలెత్తిన కుల వ్యవస్థ ఉన్నంతవరకూ, కుల కట్టుబాట్లూ, కులాచారాలూ, సమస్త కులాల పౌరుల్నీ ఎంతగానో లొంగదీస్తాయి! ఉమ్మడి ఆర్థిక వ్యవస్థ లేని సమాజంలో, దుర్భరమైన దారిద్ర్యం కారణంగా, స్త్రీలని భోగ్య వస్తువులుగా కొనడాలూ, అమ్మడాలూ వంటి ‘వృత్తులు’ పుట్టుకొచ్చి సాగుతున్నాయి. కేవలం ఉమ్మడి పౌర స్మృతి వల్ల, మతం గానీ, కులం గానీ, వ్యభిచారం వంటి ‘వృత్తులు’ గానీ మాయం అవుతాయా? ఉన్న అసమానతల మీద సంస్కరణలు కొంత ఉపశమనాన్ని ఇస్తాయి. నిజమే! కానీ, మౌలికమైన మార్పులు అత్యవసరమైన సమాజంలో, చిట్టి పొట్టి సంస్కరణలు స్థిరపడతాయా?

‘ఉమ్మడి పౌర స్మృతి’ని వ్యతిరేకించే వారు, ముస్లిం ఆడకూతుర్లకూ (‘ముసల్మాన్ బేటియా’), ముస్లింలలో వెనకబడ్డ ‘పాస్మండా’ కులాలకూ ద్రోహం చేస్తున్నారు– అని వాపోయింది ప్రధాని కరుణా హృదయం! మరి, మొన్న బిల్కిస్ బానోనీ, ఇతర ముస్లిం స్త్రీలనీ అత్యాచారాలకు గురిచేసిన నేరస్థుల్ని, బీజేపీ ప్రభుత్వం విడుదల చేయడం ‘ముస్లిం బేటీయా’లకు ద్రోహం చేయడం అవ లేదా?

వ్యాసకర్త సుప్రసిద్ధ రచయిత్రి

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

టమోటా కూరోచ్!



ఇప్పుడే మా పనిమనిషి మా ఇంటికి కిలో టమోటాలు తెచ్చాడు. అతడు నణుగుతూ, ‘దీదీ (అక్క), దీనికంటే చికెన్ తెచ్చుకునివుంటే బాగుండేది కదా’ అన్నాడు. టమోటా కిలో రూ.250. చికెన్ కిలో రూ.240.

– హనా మొహిసిన్ ఖాన్, పైలట్

రెండూ ఇవ్వాలి!



మీరు ఎవరికైనా ఏదైనా చేయాలన్న బాధ్యతను మాత్రమే అప్పగించి, అది నిర్వర్తించడానికి తగిన అధికారం ఇవ్వకపోతే ఉపయోగం ఏముంది! అలా చేస్తే... అతడిని మీరు ముందే విఫలం చేస్తున్నట్టు!

– మార్క్ క్యూబన్, వ్యాపారవేత్త

మీరు సరితూగరు!



ప్రొఫెసర్ ఇర్ఫాన్ హబీబ్, ప్రొఫెసర్ రొమిల్లా థాపర్ ఇద్దరూ తమ తొంభయ్యో పడిలో ఉన్నప్పటికీ చురుగ్గా ఉన్నారు. హిందూత్వ భ్రమల కల్పన యుగంలో దాన్ని అడ్డుకునేలా ముఖ్యమైన పాండిత్య పనితనం చూపుతున్నారు. వాళ్లు దేశం వదలాలని కోరుకునే హిందూత్వ రచయితలు కేవలం శుష్కమైన మాటలతో వారి జ్ఞానానికి సరితూగలేరు.

– మణిముగ్ధ శర్మ, జర్నలిస్ట్

మీ లైన్లో లేకపోతే...



ఆర్.సి.మజుందార్ సంగతేమిటి? 11 భాగాల ‘ద హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ ఇండియన్ పీపుల్’, మూడు భాగాల ‘హిస్టరీ ఆఫ్ ద ఫ్రీడమ్ మూవ్‌మెంట్ ఇన్ ఇండియా’ – ఇవన్నీ భారత చరిత్ర మీద పనిచేసే ఏ పండితుడికైనా మూలాధారాలు కదా? కేవలం నెహ్రూ ‘అబుల్ ఫజల్’ కావడానికి నిరాకరించినందున ఆయన్ని పక్కనపెట్టారు.

– జగదీశ్ ఉపాసనే, సంపాదకుడు

సోమరితనమే సుఖం



10 నిమిషాల జాగింగ్ చేస్తే, 8 నిమిషాల ఆయుఃప్రమాణం పెరుగుతుందన్నారు. కానీ ఒక సందేహం. నిజంగా నేను దేన్ని పెంచాలనుకుంటున్నాను? ఆయుః ప్రమాణాన్నా? జాగింగ్ చేయకుండా ఉండే కాలాన్నా? రెండోదే కావాలనుకుంటే, నేను జాగింగ్ చేయకూడదు. ఎందుకంటే, ప్రతి పదినిమిషాలకు నేను నా 2 నిమిషాల జాగింగ్ చేయకుండా ఉండే కాలాన్ని నష్టపోతాను.

– కౌశిక్ బాసు, ఆర్థికవేత్త

జై హనుమాన్



2023 ఆసియన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్స్ అధికారిక చిహ్నంగా హనుమంతుడిని ఎంచుకుంది థాయ్‌లాండ్. “ప్రభువు హనుమంతుడు బలం, శక్తి, వివేకం చూపుతారు.” అని అధికారిక ప్రకటన వెల్లడించింది. ఒక క్రీడల పోటీకి ఇండియా ఇదే పని చేసివుంటే, మనల్ని ఫాసిస్టు హిందూ రాజ్యంగా విమర్శించేవాళ్లు.

– ఆనంద్ రంగనాథన్, ‘స్వరాజ్య’ కన్సల్టింగ్ ఎడిటర్

ఒక్కసారిగా వదిలితే...



ఇండియాలో వరదల ప్రమాదానికి ముఖ్య కారణం కేవలం భారీ వానలు మాత్రమే కాదు. డ్యాముల్లోంచి నీటిని ఉన్నట్టుండి విడుదల చేయడం! ఇది విధ్వంసక ప్రభావాన్ని చూపుతున్నది. నిజమైన ప్రమాదం నీటిని ఆయుధంగా వాడటంలో పొంచి ఉంది. దీనికి మనం జలవనరుల అధికారులను జవాబుదారీగా నిలబెట్టాలి.

– మనన్ భట్, నేవీ వెటరన్

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, తిథి: బ.ఏకాదశి రా. 8.20 వరకు, తదుపరి ద్వాదశి నక్షత్రం: కృత్తిక రా. 11.22 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం: ఉ. 11.16 నుండి 12.54 వరకు, దుర్ముహూర్తం: ఉ. 9.04 నుండి 10.08 వరకు, తదుపరి ప. 3.08 నుండి 3.59 వరకు అమృతఘడియలు: రా.8.54 నుండి 9.42 వరకు.

సూర్యోదయం : 5.36
సూర్యాస్తమయం: 6.35
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ. 6.00 నుండి 7.30 వరకు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

‘సంచారు’లను చట్టసభలకు పంపాలి!

అభిప్రాయం



వెంకట్ గుంటిపల్లి

వెనుకబడిన, బలహీన వర్గాలకు చెందినవారికి తెలంగాణ ఏర్పడిన తర్వాత కొంత న్యాయం జరుగుతున్నమాట నిజం. అయితే గుర్తింపు కోసం పరితపిస్తూ, నాగరిక సమాజానికి దగ్గరవుదామని చేస్తున్న సంచార జాతులవారి ప్రయత్నాలు అంతగా ఫలించకపోవడం విచారకరం. అలాగని ప్రస్తుత ప్రభుత్వం వారికి అసలేమీ చేయడం లేదని కాదు. ఇప్పటికే వారికి ఇళ్లు, రుణాలు మంజూరు చేస్తూ ఆదుకుంటున్నారు.

సంచార జాతులవారు ఎవరూ కూడా యాభైవేలకు మించి లేరు. వెయ్యి, రెండువేల లోపు ఉన్న జాతులు, కులాల వారే ఎక్కువ. వీరు చేసే వృత్తిని బట్టి కింది రకాలుగా వర్గీకరించవచ్చు. వారు చిరు వ్యాపారులు, వేటగాళ్లు, యాచకులు, సాంస్కృతిక సారథులు, కళాకారులు. పూసల, మందుల, అత్తరు సాహెబ్ వంటివారు ఊళ్ల వెంట తిరుగుతూ వారి కుల నామం గల వస్తువులనే అమ్ముతూ జీవిస్తారు. గంగిరెద్దుల మహిళలు అద్దాలు, దువ్వెనలు అమ్ముతూ తిరుగుతారు. పిట్టల, నక్కల, పార్ధి, పాముల వంటి వారు అటు వేట, ఇటు యాచక వృత్తిలో ఉన్నారు. ‘వీరముష్టి’, ‘వీరభద్రీయ’, ‘పిచ్చికుంట్ల’, ‘గంగిరెద్దుల’, ‘బుడిగ’, ‘దాసరి’, ‘జంగం’, ‘బాగోతు’, ‘రామజోగి’ వంటివారు భారతీయ సమాజంలోని మతాలు, కులాలకు సంబంధించిన ధర్మ ప్రచారం చేసే సాంస్కృతిక సారథులు. ‘సురభి’, ‘పటంవారు’, ‘కాకిపడగల’, ‘దొమ్మర’ వంటి వారు ఆట, పాటల్లో ఆరితేరిన కళాకారులు.

ఇవాళ వీరంతా తమ అస్తిత్వాన్నే కోల్పోతున్నారు. పాతికేళ్ల క్రితం వరకూ గ్రామాలలో ‘బాలసంత’ వారు తొలి పొద్దునే గంట కొడుతూ పాట పాడి భిక్షాటన చేసి వేళ్లేవారు. వీరి ప్రధాన వృత్తి వేషం వేసుకుని కళలు ప్రదర్శిస్తూ, జాతకాలు చెబుతూ భిక్షాటన చేయడం. ప్రభుత్వ లెక్కల ప్రకారం వీరి జనాభా కేవలం మూడు వేలు. ప్రస్తుతం వీరి వృత్తి అంతరించిపోయింది. ‘బుడుబుక్క’ల వారు కూడా తెల్లవారు



జామునే భిక్షాటనకు వచ్చేవారు. వీరి జనాభా వెయ్యి లోపే ఉంది. ఆ తర్వాత ఫకీర్లు వచ్చి పాటలు పాడుతూ వెళ్లిపోయేవారు. అంటే ఉదయాన్నే ఈ జాతులు గ్రామంలోకి వచ్చి జానపదులు పనులు చేసుకోవడానికి నిద్రలేపేవారన్నమాట. ఫకీరులు వెళ్లగానే హరిదాసులు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తూ వస్తుండేవారు. తెల్లవారిన తరువాత ‘పూసవేర్ల’, ‘పూసల’ కులానికి చెందిన వారు వచ్చి అలంకరణ సామగ్రిని నెత్తినపెట్టుకొని అమ్ముకోవడానికి వచ్చేవారు. సమగ్ర సర్వే ప్రకారం పూసలవారు 40 వేల వరకు ఉన్నారు.

తిండి తిని విశ్రాంతిగా ఉన్న జానపదులను గారడివారి విన్యాసాలు అలరించేవి. ‘సాధనాసూరుల’ విన్యాసాలు ఆకట్టుకొనేవి. రాత్రి రకరకాల పురాణ కథలను చిందువారు యక్షగానాల రూపంలో చెప్పేవారు. మూలికా వైద్యం చేసే ‘జోగి’; కనికట్టు విద్య ప్రదర్శన, శ్మశానాలలో కాపలాలతో జీవనం గడిపే ‘కాటి పాపల’ వారు; శరీరం కోసుకుని రక్తం చిందిస్తూ భిక్షాటన చేసే ‘మొండి’ వారు జీవనాధారాన్ని కోల్పోయారు. వీరుకాక అనేక కులాలను ఆశ్రయించి వారి కులపురాణాలు, వంశ చరిత్రలను గానం చేసే ఆశ్రిత కులావారూ సంచార జీవులే. యాదవులు, రెడ్లు, గౌడలు, చాకలి, మంగలి, పద్మశాలి వంటి చాలా కులాలవారిని ఆశ్రయించి బతికే వీరికి ఇప్పుడు ఆదరణ పూర్తిగా లేకుండా పోయింది. వైశ్యుల ఆశ్రిత కులమైన ‘వీరభద్రీయ’ ‘వీరముష్టి’లు ఇప్పుడు మచ్చుకైనా ఆ వృత్తిలో లేరనే చెప్పాలి. పాములు, ముంగీసలు, కోతులను ఆడించే ‘పాముల’ వారు ఇప్పుడు కనుమరగయ్యే పరిస్థితి. దేవతా ప్రతిమ నెత్తిపై పెట్టుకొని ఊరేగించే ‘పెద్దమ్మ దేవర’ వాళ్లు, ‘ఎల్లమ్మలు’, ‘ముత్యాల వాండ్ల’ బతుకులు భారమయ్యాయి. భిక్షాటనే ప్రధాన వృత్తిగా గల‘మొండిపట్ట’, ‘పరిముగ్గుల’, ‘కంజరభట్ట’, ‘కైకాడి’, ‘కాశీకావడి’వారు; జ్యోతిషమే వృత్తిగా ఉన్న ‘జోషినంది వాల’, నైజాం సర్కార్‌కు ఆయుధాలు తయారు చేసిన ‘సిక్లిగర్’లు తమ అస్తిత్వాన్ని పూర్తిగా కోల్పోయారు.

పైన పేర్కొన్న సంచార జాతులవారు నిద్ర లేచిన దగ్గరి నుంచి పండుకునే వరకు పల్లె జనం జీవితంలో తమ తమ వంతు పాత్రలను పోషిస్తూ.. వారు ఇచ్చే డబ్బులు, ధాన్యం, ఆహారం వంటివాటిని భిక్షగా, కట్నంగా పొందేవారు. అయితే కాలం మారిపోవడంతో ప్రస్తుతం వీరి సంప్రదాయ కళలు, వృత్తులకు ఆదరణ పోయింది. దీంతో వీరు రకరకాల పనులు చేసుకుంటూ బతుకుతున్నారు.


ఇటువంటి తరుణంలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ‘పేరుకు మాత్రమే సంచార జాతులు కాని సంచారం చేయవద్ద’ని ఆయా కులాలకు ఆత్మగౌరవ భవనాలు, పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు పంచుతుండడం ముదావహం. నాగరిక ప్రపంచానికి ఇప్పుడిప్పుడే దగ్గరవుతున్న సంచార జాతుల ఉద్ధరణ తెలంగాణ ప్రభుత్వంలోనే జరుగుతున్నదని చెప్పాలి. ఎంబీసీ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులు కేటాయించడం, చిరు వ్యాపారాల కోసం రుణాలివ్వడం, చదువుకోవడానికి అవకాశం ఇవ్వడం ఆహ్వానించదగ్గ పరిణామం.

మూడేళ్ల క్రితం కేసీఆర్ ఎంబీసీ, సంచార జాతుల ప్రతినిధులతో భేటీ అయినప్పుడు సంచార జాతుల బిడ్డలను పెద్దల సభలకు పంపి తెలంగాణలో రాజకీయ చైతన్యం సృష్టించే దిశగా ఆలోచన చేస్తున్నానని కూడా హామీ ఇచ్చారు. ముఖ్యంగా కొన్ని కులాలు ఎస్సీ, ఎస్టీ జాబితాలో చేరాలనుకుంటున్నాయి కాబట్టి వాటి సామాజిక, ఆర్థిక పరిస్థితులను పునఃపరిశీలించి ప్రభుత్వం కేంద్రానికి సిఫారసు చేయాలి. దేశంలో ‘ప్రభుత్వ పథకాల ప్రయోగశాల’ అని పేరున్న తెలంగాణలో ప్రభుత్వం సంచార జాతులను మరింత ఆదరించాల్సిన అవసరం ఉన్నది. తెలంగాణ ఉద్యమంలో ఆయా వృత్తులతో ప్రదర్శనల్లో ముందున్న సంచార జాతులను ఇప్పటికే ప్రభుత్వం గుర్తించినా రాజకీయంగా ఏ మాత్రం వారు ఎదిగే వాతావరణం ఇంకా ఏర్పడలేదు. ఇటువంటివారిని నామినేటెడ్ పదవుల్లో నియమిస్తే వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుంది.

వ్యాసకర్త సంచార జాతుల సంఘం జాతీయ కన్వీనర్

పక్కన పెడితే సరి!

ఓ సమస్య మనకు ఎదురైనప్పుడు, ఆ సమస్యను మనసులోనే పెట్టుకుంటే బుర్ర వేడెక్కిపోతుంది. దాని గురించే ఆలోచిస్తూనే కూర్చుంటే ఇక మెదడు మొద్దుబారిపోతుంది. కనుక వీలైనంత మేరకు సమస్యను అతిగా పట్టించుకోకుండా ఉండటం మన సుకూ, శరీరానికీ మంచిది. దీన్నే ఒక గురువు గారు తన శిష్యులకు పాఠంగా చెప్పారు.



జ్యోతిర్మయం

గురువు ముందున్న బల్లమీద ఓ గాజు పాత్ర ఉంది. అది ఖాళీది. దాన్ని పైకెత్తి దీని బరువెంతో చెప్పగలరా అని శిష్యులను అడిగారు.

ఓ విద్యార్థి ఒక జవాబు చెప్పాడు. మరో విద్యార్థి మరొక జవాబు ఇచ్చాడు. అందరు విద్యార్థులు తమకు తోచిన జవాబు చెప్పిన తర్వాత– ‘నిజం చెప్పాలంటే నాకూ దీని బరువు ఎంతుంటుందో తెలీదు. కానీ నా ప్రశ్న అది కాదు’ అంటూ గురువు తన మాటలు కొనసాగించారు.

‘దీన్ని నా అరచేతిలో ఓ అర గంటపాటు పెట్టుకుంటే ఏమవుతుంది?’

‘ఏమీ అవదు’ అని అందరూ ముక్తకంఠంతో చెప్పారు.

‘ఓ గంట పాటు అలానే పెట్టుకుంటే?’

‘చేయి నొప్పెడుతుంది’ అన్నారు విద్యార్థులు.

‘ఈ రెండు సందర్భాల్లోనూ దీని బరువు ఏదన్నా మారిందంటారా?’ అని అడిగారు గురువు.

విద్యార్థులకు విషయం అర్థమైపోయింది. ‘నా చేయి నొప్పెట్టకుండా ఉండటానికి ఏం చేయాలి?’ అని గురువు అడగ్గానే, ‘వెంటనే కింద పెట్టెయ్యాలి’ అని జవాబిచ్చారు.

అదీ విషయం! ఓ సమస్యను పక్కన పెడితే తానుగా అది సరైపోతుందని వివరించారు గురువు.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన ఉదయ్ తేజ

కొల్చారం(నర్సాపూర్): పాఠశాల నుంచి వచ్చి ఇంటి బయట ఆడుకుంటున్న బాలుడిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. కొల్చారం మండల కేంద్రంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలుని తండ్రి తెనుగు దత్తాత్రి చెప్పిన వివరాల ప్రకారం... ఐదేళ్ల ఉదయ్‌తేజ మెదక్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఒకటోతరగతి చదువుతున్నాడు. రోజులాగే మంగళవారం పాఠశాలకు వెళ్లివచ్చి, ఇంటి బయట ఆడుకుంటుండగా.. అటువైపుగా వచ్చిన వీధి కుక్కలు ఒక్కసారిగా ఉదయ్‌తేజపై దాడి చేశాయి. నోటితో కరిచి పట్టుకొని కొద్ది దూరం వరకు లాక్కెళ్లాయి. అటుగా వెళుతున్న ఓ వ్యక్తి అది గమనించి.. తన చేతి లో ఉన్న కర్రతో కుక్కలను కొట్టాడు. కాసేపటి తరువాత కుక్కలు బాలుడిని వదిలి వెళ్లిపోయాయి. అప్పటికే ఉదయ్ తేజ ముక్కు భాగంలో తీవ్ర గాయమై, రక్తస్రావమైంది. చికిత్స నిమిత్తం మెదక్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. బాలునికి ప్లాస్టిక్ సర్జరీ అవసరమని డాక్టర్లు సూచించారు.

గూడ్స్ వ్యాగన్‌లో మంటలు


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మంచిర్యాల క్రైం: నాగపూర్ నుంచి సికింద్రాబాద్ వైపు బొగ్గు లోడుతో వెళ్తున్న ఓ గూడ్స్ రైలులో బుధవారం మధ్యాహ్నం మంచిర్యాల రైల్వేస్టేషన్ సమీపంలోకి రాగానే మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన రైల్వే అధికారులు రైలును మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో నిలిపివేసి స్థానిక అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పిందని రైల్వే అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదని పేర్కొన్నారు.

బేషరతుగా కార్యదర్శుల్ని క్రమబద్ధీకరించండి

సాక్షి, హైదరాబాద్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులందరినీ (జేపీఎస్) ఎలాంటి షరతులు లేకుండా ఒకేసారి క్రమబద్ధీకరిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. కార్యదర్శులు నాలుగేళ్లపాటు విధులు నిర్వహించిన కాలాన్ని పరిగణనలోకి తీసుకుని.. వెంటనే వారి సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరింది. మళ్లీ ఇప్పుడు కొత్త నిబంధనలతో వారిని అయోమయానికి గురి చేయ వద్దని అసోసియేషన్ అధ్యక్షుడు పి.మధుసూదనరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇ.శ్రీనివాస్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తమ ప్రధాన డిమాండ్లలో ఒకటైన ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి.. ఓపీఎస్‌లుగా పనిచేస్తున్న వారిని కూడా జేపీఎస్‌లుగా పరిగణిస్తూ క్రమబద్ధీకరించాలని కోరారు.

భూమి ఇవ్వలేదని కులబహిష్కరణ


రాళ్లపేటలో తమ గోడు వెళ్లబోసుకుంటున్న బాధిత కుటుంబం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): భూమి అడిగితే ఇవ్వనందుకు ఓ కుటుంబాన్ని కులం నుంచి బహిష్కరించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధిత కుటుంబం బుధ వారం తమ గోడును మీడియాకు తెలిపింది. వివరాలిలా ఉన్నాయి.. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం రాళ్లపేట శివారులో షేక్ సాబీర్, షేక్ బాబు, షేక్ పెద్దోషన్‌లు తమ కుటుంబాలతో కలసి జీవిస్తున్నారు. వీరికి ఉమ్మడి ఆస్తి కింద నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కాగా కులస్తులు ఆ భూమిని వివిధ నిర్మాణాల కోసం కోరగా.. ఇచ్చేందుకు వీరి కుటుంబం నిరాకరించింది. ఆ భూమిని నమ్ముకునే తాము బతుకుతున్నామని.. ఇచ్చేది లేదని స్పష్టం చేయడంతో ఆగ్రహించిన కులపెద్దలు వారం క్రితం షేక్ సాబీర్ కుటుంబాన్ని బహిష్కరణ చేస్తున్నట్లు ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులతో కులస్తుల్లో ఎవరు మాట్లాడినా రూ.10 వేలు జరిమానా విధిస్తామంటూ హెచ్చరికలు జారీచేశారు. దీంతో ఆ కుటుంబంతో ఎవరూ మాట్లాడటం లేదు. అకారణంగా తమను కులబహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాలమూరుకు 'పర్యావరణ' కష్టాలు!

- అనుమతుల జారీ మళ్లీ వాయిదా
- మదింపు కమిటీ సమావేశం మినిట్స్ విడుదల
- పర్యావరణ పునరుద్ధరణకు ఇప్పటికే రూ.142 కోట్లు కేటాయించామన్న రాష్ట్ర ప్రభుత్వం
- ఎస్‌ఓపీ ఆధారంగా మళ్లీ లెక్కలు వేయాలన్న కమిటీ



సాక్షి, హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతుల జారీ ప్రక్రియ మళ్లీ వాయిదా పడింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని నిపుణుల మదింపు కమిటీ గత నెల 27న సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన మినిట్స్‌ను తాజాగా విడుదల చేసింది. దీని ప్రకారం.. పర్యావరణ అనుమతులు లేకుండా ప్రాజెక్టు పనులు చేపట్టడం వల్ల పర్యావరణానికి జరిగిన నష్టాన్ని చక్కదిద్దడానికి (పర్యావరణ పునరుద్ధరణకు) రూ.142 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసినట్టు రాష్ట్ర నీటిపారుదల శాఖ నివేదించింది. అయితే నష్ట నివారణ వ్యయాన్ని లెక్కించడంలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)ను నీటిపారుదల శాఖ అనుసరించలేదని నిపుణుల కమిటీ అభిప్రాయపడింది. పర్యావరణానికి జరిగిన నష్టం విలువ, నష్ట నివారణ చర్యల వ్యయం, సామాజిక ప్రభావ నివారణ చర్యల వ్యయాలను ఎస్‌ఓపీ ఆధారంగా మళ్లీ లెక్కించి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. కాగా రూ.55,086.57 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్టు, ఇప్పటికే రూ.21200 కోట్లు ఖర్చు చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ శాఖకు తెలియజేసింది. ప్రాజెక్టు ద్వారా 6 జిల్లాల్లోని 70 మండలాల పరిధిలో మొత్తం 8,83,945 హెక్టార్లకు సాగునీరు అందుతుందని, సత్వరం పర్యావరణ అనుమతులు జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది.

గత నవంబర్‌లోనే ఉల్లంఘనల నిర్ధారణ

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం..పర్యావరణ ప్రభావం మదింపు (ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్/ఈఐఏ) నోటిఫికేషన్ 2006ను ఉల్లంఘించినట్టు గతేడాది నవంబర్ 14న జరిగిన సమావేశంలో కమిటీ నిర్ధారించింది. వాస్తవానికి ఇలాంటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతుల జారీ విషయంలో అనుసరించాల్సిన ఎస్‌ఓపీని 2021లో కేంద్ర పర్యావరణ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ప్రతిపాదనలను సైతం ఎస్‌ఓపీ ఆధారంగా మదింపు నిర్వహించాలని అప్పట్లో నిపుణుల కమిటీ నిర్ణయించింది. దీంతో ఎస్‌ఓపీ అమలులో భాగంగా.. అనుమతులు లేకుండా పనులు చేపట్టడంతో పర్యావరణానికి జరిగిన నష్టాన్ని చక్కదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.6124.36 కోట్లతో పర్యావరణ నిర్వహణ ప్రణాళిక (ఈఎంపీ)ని సిద్ధం చేసింది. అందులో రూ.142.49 కోట్లను పర్యావరణ పునరుద్ధరణకు కేటాయించింది. అయితే వీటిని లెక్కించే విషయంలో ఎస్‌ఓపీని పాటించలేదని నిర్ధారించిన నిపుణుల కమిటీ మళ్లీ కొత్తగా అంచనాలు రూపొందించాలని ఆదేశించింది. పర్యావరణ అనుమతులు లేకుండా 90 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి చేయడంపై గతంలో ఎన్జీటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. రూ.528 కోట్లను పర్యావరణ పరిహారంగా కృష్ణా బోర్డుకు చెల్లించాలని అప్పట్లో ఆదేశాలివ్వగా దీనిపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది.

15న బీసీ కుల వృత్తిదారులకు రూ. లక్ష సాయం

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన వర్గాల్లోని కులవృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించేందుకు రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చర్యలు వేగవంతం చేసింది. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన దరఖాస్తులను నిశితంగా పరిశీలించి, అర్హత ఉన్న వారిని గుర్తించి ప్రతి నెలా 15వ తేదీన వీలైనంత మందికి సాయం అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో భాగంగా ఈనెల 15వ తేదీన మొదటి విడత కింద సాయం అందించేందుకు బీసీ సంక్షేమ శాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. మండల స్థాయిలో లబ్ధిదారుల ఎంపిక జాబితాలను ఎంపీడీఓలు జిల్లా కలెక్టర్లకు సమర్పిస్తారు. వాటి నుంచి ప్రాధాన్యతా క్రమంలో లబ్ధిదారులకు ఆర్థిక సాయం కింద చెక్కులు పంపిణీ చేస్తారు. అయితే చాలాచోట్ల అర్హుల జాబితా వివరాలను ఎంపీడీఓలు ఇంకా సమర్పించలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో వాటిని ఈనెల 14వ తేదీ సాయంత్రానికల్లా సమర్పించాలంటూ జిల్లా కలెక్టరేట్ల నుంచి సంబంధిత ఎంపీడీఓలకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. రేపట్లోగా జాబితాలు పంపితే ఆమేరకు లబ్ధిదారులకు చెక్కులు రూపొందించి పంపిణీ చేస్తారని సమాచారం.

5.5 లక్షల దరఖాస్తులు..: బీసీ కులవృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం పథకానికి సంబంధించి గత నెల 20వ తేదీతో దరఖాస్తుల గడువు ముగిసింది. ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకున్న వారు 5.51 లక్షల మంది ఉన్నారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హతలను ఖరారు చేసే బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపీడీఓలకు అప్పగించింది. అయితే చాలాచోట్ల దరఖాస్తుల పరిశీలనలో కాస్త జాప్యం జరిగిందని చెపుతున్నారు. దీంతో జాబితాల రూపకల్పన ఆలస్యం కావడంతో పలు జిల్లాల్లో కలెక్టర్లకు జాబితాలు ఇంకా చేరలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో గురువారం బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ జిల్లా కలెక్టర్లతో ప్రత్యేకంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఆర్థిక సాయం పంపిణీకి సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

జలాశయాలు వెలవెల

▶ మొదటి పేజీ తరువాయి

బ్యారేజీకి వస్తున్న 83,945 క్యూసెక్కులను వచ్చినట్టు కిందికి పంపిస్తున్నారు.

కృష్ణా పరీవాహక ప్రాంతం పరిధిలోని ప్రధాన ప్రాజెక్టుల్లో గతేడాది ఇదే సమయంలో, ప్రస్తుతం ఉన్న నిల్వలను కింది పట్టికలో చూడవచ్చు.

ప్రాజెక్టు	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	గతేడాది నిల్వ (టీఎంసీల్లో)
ఆల్మట్టి	129.72	21.08	19172	561	91.35
నారాయణపూర్	37.64	17.43	0	50	33.55
ఉజ్జయిని	117.64	44.89	2574	221	62.08
జూరాల	9.66	6.22	0	1238	6.88
తుంగభద్ర	100.86	6.89	17383	347	95.31
శ్రీశైలం	215.81	33.72	126	126	44.35
నాగార్జునసాగర్	312.05	147.46	4185	6288	165.04
పులిచింతల	45.77	22.92	0	5083	33.8

గోదావరి పరీవాహక ప్రాంతం పరిధిలోని ప్రధాన ప్రాజెక్టుల్లో గతేడాది ఇదే సమయంలో, ప్రస్తుతం ఉన్న నిల్వలను కింది పట్టికలో చూడవచ్చు.

ప్రాజెక్టు	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	గతేడాది నిల్వ (టీఎంసీల్లో)
జైక్వాడ్	102.73	46.79	1221	302	54.52
సింగూరు	29.91	18.17	790	405	20.59
నిజాంసాగర్	17.8	2.96	0	61	6.46
శ్రీరాంసాగర్	90.31	22.08	4901	986	75.15
మిడ్ మానేరు	27.5	15.61	750	2020	9.48
లోయర్ మానేరు	24.07	8.44	250	226	9.71
కడెం	7.60	3.61	1906	89	5.73
ఎల్లంపల్లి	20.18	13.78	8829	3404	13.09
సరస్వతి బ్యారేజీ	7.27	8	2542	0	-
లక్ష్మీ బ్యారేజీ	19.35	13	123800	119878	-
సమ్మక్క బ్యారేజీ	6.94	4.8	83,945	83,945	-
సీతమ్మసాగర్	0.2	0.2	0	0	-

లక్ష్మీబ్యారేజీ 36 గేట్లు ఎత్తివేత

- లక్ష్మీపంపుహౌస్ నుంచి ఏడు మోటార్లతో ఎత్తిపోతలు
- కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద నీటిమట్టం 7.910 మీటర్లు


లక్ష్మీబ్యారేజీ గేట్లు ఎత్తడంతో దిగువకు తరలిపోతున్న నీరు

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీకి ఎగువన మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నదికి వరద ఉధృతి భారీగా పెరుగుతోంది. బుధవారం లక్ష్మీబ్యారేజీలోని మొత్తం 85 గేట్లకుగాను అధికారులు 36 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలేస్తున్నారు. ప్రాణహిత నది ద్వారా 1.23 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 13.36 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద నీటి మట్టం 7.910 మీటర్ల ఎత్తుకు పెరిగింది. కన్నెపల్లిలోని లక్ష్మీపంపుహౌస్‌లో పదకొండు మోటార్లలోని ఏడింటి ద్వారా ఎత్తిపోస్తున్నారు. ఇలా 10,590 క్యూసెక్కుల నీరు ఎత్తిపోయగా అన్నారం (సరస్వతి) బ్యారేజీకి తరలిపోతున్నాయి. పది రోజుల్లో లక్ష్మీ పంపుహౌస్ ద్వారా 6.50 టీఎంసీల నీరు సరస్వతి బ్యారేజీకి చేరినట్లు ఇంజనీర్లు తెలిపారు. లక్ష్మీపంపుహౌస్ నుంచి ఎత్తిపోసిన ప్రాణహిత జలాలతో అన్నారం బ్యారేజీ వద్ద నీటిమట్టం పెరిగింది. ఇక్కడ 8.10 టీఎంసీల నీటినిల్వ ఉంది. కాగా, గోదావరి, మానేరుల నుంచి ఇన్‌ఫ్లోలు రావటం లేదు. ప్రాణహిత నది ఇన్‌ఫ్లో మరింత పెరిగితే రాత్రి మరిన్ని గేట్లు ఎత్తే అవకాశం ఉందని తెలిసింది.

రెండు రోజులు భారీ వర్షాలు..

▶ మొదటి పేజీ తరువాయి

ఆర్డీఓ ఆఫీస్ ప్రాంతంలో 6.15 సెం.మీ., మెదక్ జిల్లా రాజ్‌పల్లిలో 6.05 సెం.మీ., ఖమ్మం జిల్లా కారెపల్లిలో 5.78 సెం.మీ., సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌లో 5.58 సెం.మీ. వర్షపాతం నమోదైంది. 7.35 సెం.మీ., మెదక్ జిల్లా ఆర్డీఓ ఆఫీస్ ప్రాంతంలో 6.15 సెం.మీ., మెదక్ జిల్లా రాజ్‌పల్లిలో 6.05 సెం.మీ., ఖమ్మం జిల్లా కారెపల్లిలో 5.78 సెం.మీ., సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌లో 5.58 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

ఆస్తి తీసుకున్నారు.. బయటకు వెళ్లగొట్టారు

ఆదుకోవాలంటూ డిప్యూటీ తహసీల్దార్‌కు వృద్ధురాలి వేడుకోలు


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న యల్లమ్మ

శాలిగౌరారం: వృద్ధాప్యంలో ఉన్న తల్లిని చూసుకోవాల్సిన కుటుంబ సభ్యులు ఆస్తి తీసుకొని బయటకు వెళ్లగొట్టారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధిలోని బాలిశెట్టిగూడెంలో జరిగిన ఘటన వివరాలిలా ఉన్నాయి. బట్ట వీరయ్య–యల్లమ్మ(73) దంపతులకు వివాహితులైన ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వీరయ్యకు సొంత ఇల్లుతోపాటు ఎకరం పదిగుంటల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిని కుమారుడు భిక్షం పేరున పట్టామార్పిడి చేశాడు. వయోభారంతో 2012లో వీరయ్య మృతిచెందాడు. ఆయన బతికి ఉన్నంతకాలం యల్లమ్మకు ఎలాంటి ఇబ్బందీ కలగలేదు. గత సంవత్సరం కుమారుడు భిక్షం కూడా మృతిచెందాడు. అప్పటినుంచి వృద్ధురాలైన యల్లమ్మను కోడలు, ఇద్దరు మనుమలు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వృద్ధురాలు కులపెద్దలను ఆశ్రయించగా.. వారి మాటలను కూడా కోడలు, మనుమలు లెక్కచేయకుండా ఆ వృద్ధురాలిని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తూనే ఉన్నారు. ఈక్రమంలో యల్లమ్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మూడుసార్లు ఫిర్యాదు చేసింది. సీఐ సమస్యను పరిష్కరించి పంపించగా.. కొద్ది రోజులకే తిరిగి ఇబ్బందులకు గురిచేయడం మొదలుపెట్టారు. తట్టుకోలేక బిడ్డల దగ్గరకు వెళ్తే.. వాళ్లకూ ఫోన్‌చేసి బెదిరిస్తున్నారు. తినేందుకు తిండి లేక, ఉండేందుకు ఇల్లు లేక.. వృద్ధురాలు యల్లమ్మ మరోసారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. 'ఇల్లు లేదు.. బియ్యం ఇవ్వం.. చచ్చిపో' అని ఇంట్లోంచి వెళ్లగొట్టారని, తనను ఆదుకోవాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ సత్తార్‌కు బుధవారం వినతిపత్రం అందజేసింది.

కాడెడ్లు లేక.. సాగులో సగమై..


విత్తనాలు వేస్తున్న భార్యాభర్తలు

ముధోల్: ముందుగా కురిసిన వర్షాలతో సోయా విత్తనాలు వేశారు. మోస్తరు వర్షాలతో పూర్తి స్థాయిలో పంట మొలకెత్తలేదు. కౌలుభారం మీద పడుతుందని.. కాడెడ్లు లేకున్నా నిర్మల్ జిల్లా ముధోల్ మండల కేంద్రానికి చెందిన రైతు దంపతులు కేర్బా, లక్ష్మి బుధవారం ఇలా సరిటెతో విత్తనాలు వేశారు. కౌలుకు తీసుకున్న ఏడెకరాల్లో మొలకెత్తని చోట మళ్లీ విత్తేందుకు భర్త సరిటె లాగుతుంటే.. భార్య విత్తనాలు వేస్తూ సాగిపోయింది.

మైనర్ ప్రేమికుల ఆత్మహత్య

- ఇద్దరూ ఇంటర్ విద్యార్థులే..
- ప్రియుడి ఇంట్లో దూలానికి ఉరేసుకుని బలవన్మరణం
- సిద్దిపేట జిల్లా లచ్చపేటలో ఘటన


భగీరథ్


నేహ

దుబ్బాకటౌన్: స్కూల్‌లో చదువుకుంటున్నప్పటి నుంచి ప్రేమించుకుంటున్నారు. అయితే తమ ప్రేమను పెద్దలు ఒప్పుకుంటారో.. లేదోనన్న భయంతో మైనర్ జంట బలవన్మరణానికి పాల్పడింది. ప్రియుడి ఇంట్లోనే ఒకే దులానికి ఇరువురూ చున్నీలతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేటలో బుధవారం ఈ విషాద సంఘటన జరిగింది. ఎస్‌ఐ మహేందర్, బంధువుల కథనం ప్రకారం.. లచ్చపేటకు చెందిన కౌన్సిలర్ కూరపాటి బంగారయ్య మనవడు భగీరథ్ (17) ఇంటర్ సెకండియర్ చదువుతుండగా, దుబ్బాక పట్టణానికి చెందిన తోట్ల వెంకటేశ్, రేణుక దంపతుల పెద్ద కూతురు నేహ (16) ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. లచ్చపేట మోడల్ స్కూల్‌లో భగీరథ్ టెన్త్, నేహ తొమ్మిదో తరగతి చదువుకుంటున్న సమయంనుంచే ఇద్దరూ ఒకరినొకరు ప్రేమించుకుంటున్నారు. భగీరథ్ టెన్త్ అయిపోవడంతో ఇంటర్ ఫస్టియర్ చదువుకునేందుకు హైదరాబాద్ వెళ్లాడు. నేహ ఇటీవల టెన్త్ పూర్తి చేసింది. నేహకు టెన్త్‌లో 9.5 జీపీఏ రావడంతో ట్రిపుల్‌ఐటీలో సీటు కోసం ఎదురుచూస్తూనే తాత్కాలికంగా ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో చేరింది. దీంతో భగీరథ్ సైతం హైదరాబాద్‌కు వెళ్లకుండా సెకండియర్ దుబ్బాకలోనే చదువుకునే ఉద్దేశంతో ఇక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలోనే వారిద్దరూ లచ్చపేటలోని భగీరథ్ ఇంట్లో బుధవారం తెల్లవారుజామున ఒకే దులానికి చున్నీలతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో భగీరథ్ కుటుంబీకులు ఈ ఘటనను చూసి ఒక్కసారిగా షాక్‌కు గురై పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులకు అక్కడ ఓ సూసైడ్ నోట్ లభించింది. అందులో తమ చావుకు ఎవరూ బాధ్యులు కాదని, తమ శవాలు ఒకే దగ్గర దహనం చేయాలంటూ రాసి ఉంది'ని ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి నేహ తల్లి రేణుక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

42.76 లక్షల ఎకరాల్లో పంటల సాగు

గత ఏడాది కన్నా 11 లక్షల ఎకరాలు తక్కువ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వానాకాలంలో 42.76 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ సీజన్ సాధారణ సాగు విస్తీర్ణం 1.24 కోట్ల ఎకరాలు కాగా, 42.76 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. వాస్తవంగా గతేడాది వానాకాలం సీజన్లో ఇదే సమయానికి 53.79 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అంటే ఏకంగా 11 లక్షల ఎకరాలు తక్కువగా ఈసారి పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ లెక్కలు చెబుతున్నాయి. సీజన్ ఆలస్యం కావడం వల్లే ఈ పరిస్థితి నెలకొంది. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 50.59 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 31.91 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. ఇక వరి సాధారణ సాగు విస్తీర్ణం 49.86 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.95 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. ఇక పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 9.43 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.88 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. సోయాబీన్ సాధారణ సాగు విస్తీర్ణం 4.13 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 3.19 లక్షల ఎకరాల్లో సాగైంది. ఇక మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 7.13 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 1.68 లక్షల ఎకరాల్లో సాగైంది. వర్షాలు లేకపోవడం, కాల్వల్లో నీటి విడుదల లేకపోవడంతో అనేకచోట్ల ఇంకా వరి నారు పోయలేదు.

క్లుప్తంగా...

తూర్పు నిజాముద్దీన్‌లో రాహుల్ ఇల్లు, ఆఫీసు!

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్నేయ ఢిల్లీలోని తూర్పు నిజాముద్దీన్ ప్రాంతంలో తన నివాసం, కార్యాలయాన్ని త్వరలో ఏర్పాటు చేసుకొనే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. నివాసం, కార్యాలయం ఒకే ప్రాంగణంలో ఉంటాయని తెలిపాయి. రాహుల్ ప్రస్తుతం తన తల్లి సోనియా గాంధీ అధికారిక నివాసమైన 10, జన్‌పథ్‌లో ఉంటున్నారు. పరువు నష్టం వ్యాఖ్యల కేసులో జైలు శిక్ష పడడం, తద్వారా లోక్‌సభ సభ్యత్వం కోల్పోవడంతో 12, తుగ్లక్ లేన్‌లోని ఇంటిని ఆయన ఖాళీ చేయాల్సి వచ్చింది.

బెంగాల్ స్థానిక ఎన్నికల్లో తృణమూల్ హవా

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ) ఘన విజయం దిశగా దూసుకుపోతోంది. 63,229 గ్రామ పంచాయతీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా, టీఎంసీ ఇప్పటిదాకా 34,913 సీట్లు గెలుచుకుంది. మరో 607 స్థానాల్లో ముందంజలో ఉంది. ప్రతిపక్ష బీజేపీ 9,722 సీట్లు సాధించింది. కాంగ్రెస్‌కు 2,543, సీపీఎంకు 2,937 సీట్లు లభించాయి. టీఎంసీ 6,430 పంచాయతీ సమితి సీట్లు కైవసం చేసుకుంది. మరో 195 సీట్లలో లీడింగ్‌లో ఉంది. అలాగే 674 జిల్లా పరిషత్ స్థానాలను తన ఖాతాలో వేసుకుంది. ఓట్ల లెక్కింపు ఇంకా పూర్తి కాలేదు. స్థానిక సంస్థల ఓట్ల లెక్కింపు సందర్భంగా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో హింస చోటుచేసుకుంది.



ప్రఖ్యాత జేమ్స్ వెబ్ అంతరిక్ష టెలిస్కోప్ పంపిన నక్షత్రాల ఆవిర్భావం తాలూకు తాజా చిత్రమిది. రోహో ఒఫియోకీగా పిలిచే ఈ ప్రాంతానికి సంబంధించి ఇప్పటివరకు తీసిన అత్యంత స్పష్టమైన ఫొటో ఇదే. ఈ ప్రాంతం భూమికి 390 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. జేమ్స్ వెబ్ పని చేయడం మొదలై బుధవారానికి ఏడాది పూర్తైంది.

ప్రభుత్వాన్నే ముంచేసిన.. వలసల వరద..

నెదర్లాండ్స్ ప్రభుత్వ పతనం
యూరప్ రాజకీయాల్లో కీలక మలుపు

వలసలే కేంద్రంగా కొత్త రూపు సంతరించుకుంటున్న రాజకీయాలు

నెదర్లాండ్స్‌లో నాలుగు పార్టీల సంకీర్ణ ప్రభుత్వం ఎన్నికైన ఏడాదిన్నరకే పేకమేడలా కుప్పకూలింది. యూరప్‌లో చాలా దేశాలు ఎదుర్కొంటున్న వలసల ఉధృతే ఇందుకు ప్రధాన కారణం కావడం అక్కడ సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది..



నెదర్లాండ్స్‌లోకి వలసలను కట్టడి చేసేందుకు ప్రధాని మార్క్ రుట్టె ప్రతిపాదించిన కఠినతరమైన వలసల విధానం చివరికి ఆయన ప్రభుత్వానికే ఎసరు తెచ్చింది. పాలక సంకీర్ణంలోని మిగతా మూడు భాగస్వామ్య పార్టీలూ ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించడంతో రుట్టె రాజీనామా చేశారు. అయితే, భాగస్వాముల మాటకు తలొగ్గి రాజీ పడేకంటే దీర్ఘకాలిక స్వీయ రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమన్న దూరదృష్టి ఆయన నిర్ణయంలో ప్రతిఫలించిందని పరిశీలకులు భావిస్తున్నారు. అంతేగాక యూరప్‌లో వలసల సమస్య నానాటికీ ఎంత తీవ్రతరంగా మారుతోందో, అక్కడి రాజకీయాలను ఎంతగా ప్రభావితం చేస్తోందో, దీన్ని రైట్ వింగ్ పార్టీలు సొమ్ము చేసుకోకుండా ఆపడం ప్రధాన పార్టీలకు ఎంత కష్టతరంగా పరిణమిస్తోందో ఈ ఉదంతం మరోసారి తేటతెల్లం చేసిందని చెబుతున్నారు.

రుట్టె కేంద్రంగా...



- ➤ నెదర్లాండ్స్‌లో వలసలపై నెలకొన్న తాజా సంక్షోభం ప్రధాని రుట్టె సంప్రదాయ వైఖరి కారణంగానే ముదురు పాకాన పడింది.
- ➤ 13 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న రుట్టె, దీన్ని కూడా అందివచ్చిన అవకాశంగానే మలచుకుని వెంటనే రాజీనామా చేశారు.
- ➤ ఇటీవల బలం పుంజుకుంటున్న రైట్‌వింగ్ పార్టీల దూకుడుకు అడ్డుకట్ట వేయడంతో పాటు దేశ ప్రయోజనాలు కాపాడేందుకు అధికారాన్ని కూడా తృణప్రాయంగా వదులుకున్నారన్న ఇమేజీ సాధించి ఒక్క దెబ్బకు రెండు పిట్టలు కొట్టే లక్ష్యంతోనే ఆయన రాజీనామా చేసినట్టు కనిపిస్తోంది.
- ➤ రైట్ వింగ్ పార్టీలతో ప్రభుత్వం ఏర్పాటు చేసే ప్రశ్నే లేదని కుండ బద్దలు కొట్టడం ద్వారా రుట్టె తన ఉద్దేశాన్ని చెప్పకనే చెప్పారు.
- ➤ అంతేగాక రాజీనామా ద్వారా యూరప్ యవనికపై వలసల కట్టడి కోసం గళమెత్తుతున్న బలమైన నేతగా రుట్టె ఆవిర్భవించారు.
- ➤ యూరప్‌లోకి వలసల కట్టడికి సంయుక్త ఈయూ బోర్డర్ ఏజెన్సీ వంటివాటి ఏర్పాటును కూడా కొంతకాలంగా ఆయన ప్రతిపాదిస్తున్నారు. అయితే రాజీనామా ద్వారా దేశ ప్రయోజనాల కంటే స్వీయ రాజకీయ ప్రయోజనాలకే ఆయన పెద్దపీట వేసుకున్నారన్న విమర్శలూ వినిపిస్తున్నాయి!

'కేవలం ప్రతిపాదిత వలస విధానంపై విభేదాల వల్ల ఏకంగా పాలక సంకీర్ణమే కుప్పకూలడం నమ్మశక్యం కాని నిజం! ఏదేమైనా రాజీనామా నిర్ణయం ప్రధాని రుట్టె రాజకీయ చతురతకు అద్దం పట్టింది'
– మార్సెల్ హనెగ్రాఫ్, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ పొలిటికల్ సైన్స్, యూనివర్సిటీ ఆఫ్ ఆమ్‌స్టర్‌డామ్

ఏమిటీ ప్రతిపాదిత విధానం...

ప్రధానంగా, నెదర్లాండ్స్‌లో నివసిస్తున్న వలసదారుల పిల్లలకు వలసదారులుగా గుర్తింపు ఇచ్చేందుకు కనీసం రెండేళ్ల వెయిటింగ్ పీరియడ్ ఉండాలని ప్రధాని రుట్టె ప్రతిపాదించారు. దీన్ని సంకీర్ణ భాగస్వాములు తీవ్రంగా వ్యతిరేకించారు.

యూరప్‌కు పెనుభారంగా వలసలు...

- ➤ ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం తదితర కారణాలతో యూరప్ దేశాలకు కొన్నేళ్లుగా వలసలు భారీగా పెరుగుతున్నాయి.
- ➤ 2015లో సిరియా నుంచి శరణార్థులు వెల్లువెత్తిన నాటి నుంచీ ఈ ధోరణి నానాటికీ పెరుగుతూనే ఉంది.
- ➤ కానీ ద్రవ్యోల్బణం తదితరాలతో అసలే ధరాభారం, జీవన వ్యయం నానాటికీ పెరిగిపోతున్న సమయంలో ఈ వలసలు క్రమంగా యూరప్ దేశాలకు తలకు మించిన భారంగా మారుతున్నాయి.
- ➤ దీన్ని అవకాశంగా మలచుకుంటూ పలు యూరప్ దేశాల్లో రైట్ వింగ్ పార్టీలు శరణార్థుల పక్షం వహిస్తుండటంతో యూరప్ రాజకీయాలే కీలకమైన, అనూహ్యమైన మలుపు తిరుగుతున్నాయి. చాలా దేశాల్లో ఇప్పటికే రాజకీయాలను నిర్దేశించే స్థాయికి చేరుకున్నాయి కూడా.
- ➤ ఏళ్లుగా పాతుకుపోయిన సంప్రదాయ పార్టీలకు ఈ రైట్ వింగ్ పార్టీల ఎదుగుదల పెను సవాలుగా మారుతోంది.
- ➤ జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, హంగరీ మొదలుకుని చిన్నా పెద్దా యూరప్ దేశాలన్నింట్లోనూ ఇదే పరిస్థితి!
- ➤ దాంతో రైట్ వింగ్ పార్టీలకు ముకుతాడు వేసేందుకు సంప్రదాయ పార్టీలన్నీ చేతులు కలుపుతున్న కొత్త ధోరణి కూడా కొన్ని దేశాల్లో ఇప్పటికే మొదలైంది.



యూరప్‌లోని అత్యంత ధనిక దేశాల్లో నెదర్లాండ్స్‌ది నాలుగో స్థానం

నెదర్లాండ్స్‌లోకి వలసల సంఖ్య గతేడాది ఏకంగా మూడో వంతు పెరిగి 47 వేలు దాటేసింది! దాంతో ప్రధాని రుట్టె కట్టడి చర్యలను ప్రతిపాదించాల్సి వచ్చింది.

వలసదారుల దెబ్బకు చాలా యూరప్ దేశాల్లో మాదిరిగానే నెదర్లాండ్స్‌లో కూడా ఇళ్ల ధరలు, అద్దెలు అందుబాటులో లేకుండా పోతున్నాయి.

ఈసారి దేశంలోకి శరణార్థుల సంఖ్య ఏకంగా 70 వేలు దాటొచ్చని అంచనా.

ఇదేగాక పెరుగుతున్న వలసల వల్ల అనేకానేక సమస్యలతో నెదర్లాండ్స్ సతమతమవుతోంది.


నవంబర్‌లో జరుగుతాయని భావిస్తున్న ఎన్నికల్లో అన్ని పార్టీలకూ ఇది అతి పెద్ద ప్రచారాంశంగా మారినా ఆశ్చర్యం లేదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

ఇప్పుడిక నెదర్లాండ్స్ రాజకీయంగా ఎలాంటి మలుపులు తిరుగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

–సాక్షి, నేషనల్ డెస్క్

నేటి నుంచి ఫ్రాన్స్‌లో... ప్రధాని మోదీ పర్యటన

పలు కీలక ఆయుధ ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం



న్యూఢిల్లీ: ప్రధాని మోదీ నేటి నుంచి రెండు రోజులపాటు ఫ్రాన్స్‌లో పర్యటించనున్నారు. అధికారిక పర్యటన వివరాలు బుధవారం వెల్లడయ్యాయి. పారిస్ నగరంలో జూలై 14వ తేదీన జరిగే బాస్టిల్ డే పరేడ్‌లో ప్రధాని మోదీ ప్రత్యేక అతిథిగా హాజరుకానున్నారు. ఈ కవాతులో భారత త్రివిధ దళాలకు చెందిన బృందం పాల్గొననుంది. ప్రధాని అయ్యాక మోదీ ఫ్రాన్స్‌లో పర్యటించడం ఇది ఐదోసారి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఆహ్వానం మేరకు మోదీ అక్కడ పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా మాక్రాన్ మోదీకి ఫ్రాన్స్ అధికార విందుతోపాటు ప్రత్యేక ఆతిథ్య విందు ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఇరుదేశాల అగ్రనేతలు విస్తృతస్థాయి అంశాలపై చర్చలు జరపనున్నారు. తర్వాత ఫ్రాన్స్ సెనేట్, నేషనల్ అసెంబ్లీ అధ్యక్షులనూ మోదీ కలుస్తారు. అక్కడి భారతీయులనుద్దేశించి ప్రసంగిస్తారు. ఫ్రాన్స్ పారిశ్రామికవేత్తలు, భారతీయ సీఈవోలు, అక్కడి ప్రముఖులను కలుస్తారు. 'ఇండియా–ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యం 25 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆరంభమైన ప్రధాని మోదీ పర్యటన ఇరుదేశాల భిన్నరంగాల భాగస్వామ్యాన్ని కొత్త పుంతలు తొక్కించనుంది' అని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. సాంస్కృతిక, శాస్త్రీయ, విద్య, ఆర్థిక, రక్షణ రంగాల్లో పరస్పర భాగస్వామ్యంపై చర్చించనున్నారు. 'నేవీ వేరియంట్ 26 రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలుతోపాటు ఇరుదేశాలు సంయుక్తంగా విమాన ఇంజిన్‌ను భారత్‌లో తయారుచేసే ఒప్పందం ఖరారుకావచ్చు' అని విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ ఖ్వాత్రా చెప్పారు. ఫ్రాన్స్ గణతంత్ర వేడుకలుగా భావించే బాస్టిల్ డే కవాతులో పాల్గొనేందుకు ఇప్పటికే 269 మంది సభ్యుల త్రివిధ దళ బృందం సీ–17 గ్లోబ్‌మాస్టర్ యుద్ధ సరుకు రవాణా విమానంలో పారిస్‌కు చేరుకుంది. ఛాంప్స్ ఎలీసెస్ చారిత్రక ప్రాంత గగనతలంలో ఫ్రెంచ్ యుద్ధవిమానాలకు తోడు భారత రాఫెల్ ఫైటర్‌జెట్‌లు ఫ్లైపాస్ట్‌లో పాల్గొననున్నాయి.

తిరుగుప్రయాణంలో యూఏఈలో పర్యటన

ఫ్రాన్స్ పర్యటన తర్వాత తిరుగుప్రయాణంలో జూలై 15వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లో పర్యటించనున్నారు. యూఏఈ అధ్యక్షులు, అబుదాబీ పాలకుడు అయిన షేక్ మొహమ్మద్ బిన్ జయేద్ అల్ నహ్యాన్‌తో ఈ సందర్భంగా మోదీ భేటీ కానున్నారు. సంస్కృతి, ఇంధనం, ఆహార భద్రత, రక్షణ, ఫిన్‌టెక్, విద్య, ఆరోగ్య రంగాల్లో ద్వైపాక్షిక ఒప్పందాలను మరింత పటిష్టం చేసుకోవడంపై ఇరుదేశాధినేతలు చర్చించనున్నారు. 'కాప్–28కు యూఏఈ, జీ20కి భారత్ సారథ్యం వహిస్తున్న ఈ తరుణంలో అగ్రనేతలు అంతర్జాతీయ అంశాలపైనా చర్చలు జరపనున్నారు' అని భారత విదేశాంగ శాఖ తెలిపింది.

సబ్సిడీ ధరలకు టమాటాలు

విక్రయించనున్న కేంద్రం

- ఢిల్లీసహా పలు నగరాల్లో రిటైల్‌గా అమ్మకం
- వినియోగదారులకు సాయపడనున్న కేంద్రం
- ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి టమాటాల సేకరణ

సాక్షి, న్యూఢిల్లీ: వంట గదిలో టమాటా ధరల నిప్పు రాజేస్తున్న తరుణంలో ప్రజలకు కాస్తయినా ఉపశమనం కల్పించాలని మోదీ సర్కార్ భావిస్తోంది. ఇందులోభాగంగా టమాటాలను భారీ ఎత్తున సేకరించి పలు పట్టణాల్లో తక్కువ ధరకు రిటైల్‌గా అమ్మాలని నిర్ణయించింది. ఇలా తొలిసారిగా దేశరాజధానిలో రిటైల్‌గా విక్రయాలు మొదలుకానుండటం విశేషం. ఇందుకోసం తక్షణం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి టమాటాలను కొనుగోలు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య(నాఫెడ్), జాతీయ సహకార వినియోగదారుల సమాఖ్య(ఎన్‌సీసీఎఫ్)లను కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఈ శుక్రవారం నుంచి ఢిల్లీ–దేశ రాజధాని ప్రాంతం(ఎన్సీఆర్)లో రిటైల్ కేంద్రాల ద్వారా తక్కువ ధరలకు విక్రయిస్తారు. అఖిల భారత స్థాయి ధరల సూచిక సగటుకు మించి గత నెల రోజులుగా ధరలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆరోజు రేటుకు కనీసం 30 శాతం డిస్కౌంట్ ధరకు టమాటాలను విక్రయిస్తారు. 'ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమబెంగాల్‌లలో విక్రయాలు మొదలుకానున్నాయి. పట్నా, వారణాసి, కాన్పూర్, కోల్‌కతాలో సొంత రిటైల్ కేంద్రాలు లేదా స్థానిక ఒప్పందాల ద్వారా విక్రయిస్తాం' అని వినియోగదారుల శాఖ కార్యదర్శి రోహిత్ సింగ్ చెప్పారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లె (చిత్తూరు) నుంచి సహేతుకమైన పరిమాణంలో టమాటా వస్తోంది. గుజరాత్, మధ్యప్రదేశ్ సహా కొన్ని రాష్ట్రాలకు టమాటా మహారాష్ట్రలోని సతారా, నారాయణగావ్, నాసిక్ నుంచి సరఫరా అవుతోంది. కొత్త పంట దిగుబడి నేపథ్యంలో త్వరలోనే ధరలు దిగొస్తాయని అధికారులు హామీ ఇస్తున్నారు.



ప్రపంచంలోనే అత్యంత భారీ పుష్పమిది. దీని పేరు అమోర్‌ఫోఫాలస్ టైటానియం. ఫ్రాన్స్‌లోని విల్లెర్స్ లెస్ నాన్సీ నగరంలో ఇటీవల ఈ పుష్పం దాదాపు రెండు మీటర్ల ఎత్తు పెరిగి వికసించి చూపరులను ఆకట్టుకుంటోంది. దగ్గరికెళితే కుళ్లిపోయిన మాంసం వాసన కంపు కొడుతోంది.



ఢిల్లీలో ముంపు ప్రాంతం నుంచి ఫ్లైఓవర్ మీదకు చేరుకుంటున్న స్థానికులు



హిమాచల్‌లోని మండీలో పూర్తిగా ధ్వంసమైన వంతెన

యమున ఉధృతి

ఢిల్లీలో 207.71 మీటర్లకు చేరిన నీటిమట్టం

- నగర చరిత్రలోనే ఆల్‌టైమ్ రికార్డు
- జల దిగ్బంధంలో సమీప ప్రాంతాలు
- ఉత్తరాదిన వర్ష బీభత్సం

న్యూఢిల్లీ: ఢిల్లీలో జల ప్రళయం కొనసాగుతూనే ఉంది. ఎగువ నుంచి వస్తున్న భారీ వరదతో యమునా నది మరింత ఉధృతరూపం దాల్చింది. నదిలో నీటిమట్టం బుధవారం 207.71 మీటర్లకు చేరింది. ఢిల్లీ చరిత్రలో ఇదే ఆల్‌టైమ్ రికార్డు. 1978లో 207.49 మీటర్ల నీటిమట్టం నమోదైంది. నీటి మట్టం మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఢిల్లీ నీటి పారుదల, వరద నియంత్రణ విభాగం సూచించింది. బుధవారం నది సమీపంలోని ప్రాంతాలు నీట మునిగాయి. ప్రభుత్వ అధికారులు వేలాది మందిని సురక్షిత ప్రాతాలకు తరలించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితి తీవ్రత దృష్ట్యా ఢిల్లీ ప్రభుత్వం 144 సెక్షన్ విధించింది.

అమిత్ షాకు కేజ్రీవాల్ లేఖ

ఢిల్లీలో వరద ఉధృతి పెరుగుతోందని, యమునలో నీటిమట్టం మరింత పెరగకుండా చర్యలు తీసుకొనే విషయంలో సహకారం అందించాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశ రాజధానిలో భీకర వరదలు రావడం ప్రపంచానికి మంచి సందేశం కాదని చెప్పారు. జీ–20 సదస్సుకు త్వరలో ఢిల్లీ ఆతిథ్యం ఇవ్వబోతోందని గుర్తుచేశారు. ఈ మేరకు ఆయన బుధవారం కేంద్ర హోంశామంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. హరియాణాలోని హత్రీకుండ్ బ్యారేజీ నుంచి నీటి విడుదలను తగ్గిస్తే ఢిల్లీలో వరదలు తగ్గుముఖం పడతాయని సూచించారు. ఢిల్లీ ప్రజలను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు. యమునా నదిలో నీటిమట్టం 207.72 మీటర్లకు చేరే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ అంచనా వేసిందని తెలిపారు. అదే జరిగితే భారీ నష్టం వాటిల్లుతుందని కేజ్రీవాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న జల ప్రవాహమే ఇందుకు కారణమని ఆయన ట్వీట్ చేశారు.

హిమాచల్‌లో 88 మంది మృతి

హిమాచల్ ప్రదేశ్‌లో వర్ష బీభత్సం కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం మధ్యాహ్నంకల్లా రాష్ట్రంలో వర్షాలు, వరదల వల్ల మృతి చెందినవారి సంఖ్య 88కి చేరింది. మరో 16 మంది గల్లంతయ్యారు. 100 మంది క్షతగాత్రులయ్యారు. పెద్ద సంఖ్యలో ఇళ్లు దెబ్బతిన్నాయి. పశువుల కొట్టాలు కూలిపోయాయి. మరోవైపు పంజాబ్, హరియాణాలో మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలు కొంత తగ్గుముఖం పట్టాయి. రెండు రాష్ట్రాల్లో మృతుల సంఖ్య 18కు చేరుకుంది. హరియాణాలో చాలా ప్రాంతాలు జలమయంగా మారాయి. పంజాబ్‌లో 10,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు బుధవారం వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌లో వర్షాల కారణంగా గత 24 గంటల్లో 12 మంది ప్రాణాలు కోల్పోయారు.

తైవాన్ దిశగా చైనా నౌకలు, యుద్ధ విమానాలు

తైపీ: తైవాన్‌పై కన్నేసిన డ్రాగన్ దేశం చైనా దుందుడుకు చర్యలకు పాల్పడుతోంది. మంగళవారం, బుధవారం పెద్ద సంఖ్యలో నావికాదళం నౌకలను, ఫైటర్ జెట్లు, బాంబర్లతో కూడిన యుద్ధ విమానాలను తైవాన్ దిశగా పంపించింది. ఈ విషయాన్ని తైవాన్ రక్షణ శాఖ వెల్లడించింది. చైనా తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. శత్రువుల దండయాత్ర నుంచి తనను తాను కాపాడుకోవడమే లక్ష్యంగా తైవాన్ ప్రతిఏటా నిర్వహించే సైనిక విన్యాసాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో చైనా తన నౌకలను, యుద్ధ విమానాలను తైవాన్ దిశగా నడిపించడం ప్రాధాన్యం సంతరించుకుంది. చైనా ప్రజా విముక్తి సైన్యం(పీఎల్ఏ) మంగళవారం ఉదయం 6 గంటల నుంచి బుధవారం మధ్యాహ్నం వరకూ 38 యుద్ధ విమానాలను, 9 నౌకలను తైవాన్ వైపు మళ్లించింది. అంతేకాకుండా మరో 30 విమానాలు దూసుకొచ్చాయి. ఇందులో జె–10, జె–16 ఫైటర్ జెట్లు కూడా ఉన్నాయి. ఇందులో కొన్ని విమానాలు చైనా–తైవాన్ మధ్య జలసంధిలో అనధికారిక సరిహద్దు అయిన మిడ్‌లైన్‌ను దాటి ముందుకెళ్లినట్లు సమాచారం. చైనాకు చెందిన హెచ్–6 బాంబర్లు కూడా దక్షిణ తైవాన్ సమీపంలో సంచరించినట్లు తెలుస్తోంది. తైవాన్ తమ దేశంలో అంతర్భాగమేనని డ్రాగన్ చెబుతోంది. ఎప్పటికైనా కలిపేసుకోవాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది.



బెంగళూరులో హిందుస్తాన్ ఏరోనాటిక్స్ ఎయిర్‌పోర్ట్‌లో ముందుచక్రం తెరుచుకోకపోవడంతో ఎమర్జెన్సీ ల్యాండింగ్‌వేళ ముందుకు పడిన ప్రైవేట్ విమానం. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

విపక్షాల రెండో సమావేశానికి 24 పార్టీలు

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు ఒక్కతాటిపైకి వస్తున్నాయి. ప్రతిపక్ష కూటమి మరింత విస్తరిస్తోంది. భాగస్వామిగా చేరేందుకు మరిన్ని పార్టీలు ముందుకొస్తున్నట్లు తెలుస్తోంది. విపక్ష నేతలు జూన్ 23న బిహార్ రాజధాని పట్నాలో సమావేశమయ్యారు. ఈ భేటీలో 15 పార్టీల నాయకులు పాల్గొన్నారు. ప్రతిపక్షాల రెండో కీలక సమావేశం ఈ నెల 17, 18 తేదీల్లో బెంగళూరులో జరుగనుంది. ఈ సమావేశానికి హాజరు కావాలంటూ 24 పార్టీల నాయకులకు నిర్వాహకులు ఆహ్వానం పంపారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చీఫ్ సోనియా గాంధీ హాజరుకానున్నారు. విపక్షాల రెండో సమావేశంలో ఎండీఎంకే, కేడీఎంకే, వీసీకే, ఆర్ఎస్పీ, ఫార్వర్డ్ బ్లాక్, ఐయూఎంఎల్, కేరళ కాంగ్రెస్(జోసెఫ్), కేరళ కాంగ్రెస్(మణి) తదితర పార్టీల నాయకులు పాల్గొంటారని సమాచారం. ఆహ్వానం అందుకున్న 24 పార్టీలకు లోక్‌సభలో ప్రస్తుతం 150 మంది సభ్యులు ఉన్నారు.

రష్యా లెఫ్టినెంట్ జనరల్ మృతి

కీవ్: ఉక్రెయిన్ సైన్యం దాడిలో రష్యాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఉక్రెయిన్ సేనల క్షిపణి దాడిలో రష్యా లెఫ్టినెంట్ జనరల్ ఒలేగ్ యూరివిజ్ త్సొకోవ్ మరణించారు. ఉక్రెయిన్‌లోని బెర్డియాన్స్క్ నగరంలో తాజాగా ఈ ఘటన జరిగింది. బ్రిటన్ సరఫరా చేసిన స్ట్రామ్ షాడో క్షిపణిని ప్రయోగించి రష్యా సైనిక ఉన్నతాధికారిని అంతం చేయడం గమనార్హం. బెర్డియాన్స్క్ ఎ ప్రస్తుతం రష్యా ఆధీనంలో ఉంది. సిటీలోని ఓ హోటల్‌లో రష్యా సైనిక కమాండర్లు ఉంటున్నారు. ఉక్రెయిన్ క్షిపణి దాడిలో ఈ హోటల్ నేలమట్టమైనట్లు సమాచారం. ఇక్కడికి సమీపంలోనే రష్యాకు చెందిన యాంటీ మిస్సైల్ డిఫెన్స్ వ్యవస్థ ఉన్నప్పటికీ క్షిపణి దాడి జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఉ.కొరియా క్షిపణి కవ్వింపులు

సియోల్: అమెరికా, దక్షిణ కొరియాలను హెచ్చరిస్తూ ఉత్తరకొరియా మరోమారు ఖండాతర క్షిపణిని పరీక్షించింది. తమ భూభాగంపై గగనతల నిఘా కార్యకలాపాలు కొనసాగిస్తే ఆ విమానాలను కూల్చేస్తామని అమెరికాను ఉ.కొరియా హెచ్చరించిన రెండ్రోజులకే ఇలా ఖండాతర క్షిపణి(ఇంటర్‌కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్–ఐసీబీఎం)ని ప్రయోగించడం గమనార్హం. ఉ.కొరియా గత మూడు నెలల్లో ఐసీబీఎంను పరీక్షించడం ఇదే తొలిసారి. కాగా బుధవారం ప్రయోగించిన క్షిపణి అధునాతనమైనదిగా రక్షణరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గతంలో హవసాంగ్–18 క్షిపణిలో ద్రవ ఇంధనం వాడగా ఈసారి ఘన ఇంధనం వాడినట్లు తెలుస్తోంది. ప్రయోగించాక జాడ గుర్తించడంగానీ, మార్గమధ్యంలో అడ్డుకోవడంగానీ కష్టమని నిపుణులు హెచ్చరించారు.

42 చట్టాల్లో సవరణలకు కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: 19 మంత్రిత్వ శాఖలకు చెందిన 42 చట్టాలకు సంబంధించి 183 నిబంధనల్లో సవరణలు చేయడానికి కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలియజేసింది. వీటిలో జన విశ్వాస్(అమెండ్‌మెంట్ ఆఫ్ ప్రొవిజన్స్) బిల్లు–2023 ఉంది. ఈ బిల్లు ప్రకారం చిన్నచిన్న నేరాలను ఇక నేరాలుగా పరిగణించరు. సవరణలు ప్రతిపాదించిన చట్టాల్లో డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్–1940, ఫార్మసీ యాక్ట్–1948, కాపీరైట్ యాక్ట్–1957, సినిమాటోగ్రఫీ యాక్ట్–1952, మోటార్ వెహికల్స్ యాక్ట్–1988 ఉన్నాయి.

పార్లమెంట్‌లో వ్యూహ రచనపై కాంగ్రెస్ భేటీ!

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అధికార బీజేపీని ఇరుకునపెట్టేందుకు, దేశంలో నెలకొన్న సమస్యలపై నిలదీసేందుకు పార్టీ అనుసరించాల్సిన వ్యూహాల తుది ఖరారు కోసం కాంగ్రెస్ పార్టీ 15వ తేదీన ఢిల్లీలో సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. పెరిగిన నిత్యావసర సరకుల ధరలు, నిరుద్యోగం, మణిపూర్‌లో కొనసాగుతున్న హింస, బాలాసోర్‌లో ఘోర రైలు ప్రమాదం, రెజ్లర్ల ఆందోళన వంటి అంశాలను ప్రధానంగా లేవనెత్తి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. సోనియాగాంధీ నివాసంలో జరిగే ఈ భేటీలో లోక్‌సభ, రాజ్యసభలో పక్షనేతలు, పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే పాల్గొననున్నారు.



గోపాల్‌పూర్‌లో వనభోజనాలు

కరీంనగర్‌రూరల్: ఆషాఢమాసం పురస్కరించుకొని కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లో బుధవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు నిర్వహించారు.



'స్వచ్ఛ సర్వేక్షణ్' పోటీలో ఖాసీంపేట

ఖాసీంపేట గ్రామ పంచాయతీ అభివృద్ధిలో దూసుకుపోతోంది. ఈ పల్లె జాతీయ స్థాయి పోటీలో స్వచ్ఛతలో ముందంజలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
27.0/20.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలి వేగంగా వీస్తుంది.

న్యూస్‌రీల్

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిల్లాను ముందువరుసలో ఉంచాలి



కరీంనగర్: స్వచ్ఛ సర్వేక్షణ్–2023 పోటీల్లో కరీంనగర్ జిల్లాను జాతీయస్థాయిలో ముందుండేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలకు సూచించారు. బుధవారం స్వచ్ఛసర్వేక్షణ్‌పై రాష్ట్రస్థాయిలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన సమీక్షలో జెడ్పీ సీఈవోతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్ సురేశ్, ఇప్సాన్ సంస్థ ప్రతినిధి వివేక్ స్వచ్ఛ సర్వేక్షణ్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పరిశీలన వివరాలను వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలు, ఎంపీడీవోలను ఉద్దేశించి అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా ఇప్పటికే దేశంలోనే 5స్టార్ రేటింగ్‌తో ముందువరుసలో ఉందని తెలిపారు. సంపూర్ణ పారిశుధ్య సమగ్ర ఆరోగ్యానికి నాంది అని తెలియజేస్తూ ఈనెల15 నుంచి ఆగస్టు 15 జరిగే స్వచ్ఛత– పరిశీలన (స్వచ్ఛ సర్వేక్షన్)కు సమయాత్తం కావాలని అన్నారు. డీఆర్డీఏ శ్రీలత, డీపీవో వీరబుచ్చయ్య, డీఎల్‌పీవో కిషన్, లతా, యూనిసెఫ్ సమన్వయకర్త కిషన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలి



విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ అందిస్తున్న సేవలు, రాయితీలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ఆయన కార్యాలయంలో రీజియన్‌లోని డిపోల పనితీరు, ఆర్థిక పరిస్థితి తదితర అంశాలపై సమీక్షించారు. ప్రయాణికులకు కల్పించిన వివిధ రాయితీలు, ప్రజల్లోకి చేరవేసేందుకు తీసుకుంటున్న చర్యలపై డిపో మేనేజర్లు, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు, రీజినల్ మేనేజర్లకు పలు సూచనలు చేశారు. కరీంనగర్ రీజియన్‌లో ఈఆర్థిక సంవత్సరం జూన్ మాసానికి జగిత్యాల, మెట్‌పల్లి, హుజూరాబాద్, మంథని, కరీంనగర్–1, వేములవాడ డిపోలు లాభాల్లో ఉన్నాయని, మిగతా డిపోల సిబ్బంది కూడా లాభాలు ఆర్జించడంలో సమష్టిగా కృషి చేయాలన్నారు. సమావేశంలో కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్.సుచరిత, డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఆపరేషన్స్) ఎస్.చందర్‌రావు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్) కె.సత్యనారాయణ, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

శృతి మించి ప్రవర్తిస్తే చర్యలు

కరీంనగర్‌క్రైం: నగరంలో ధర్నాలు చేసే టప్పుడు శృతి మించి ప్రవర్తిస్తే చర్యలు తప్పవని సీపీ సుబ్బారాయుడు అన్నారు. వివిధ సంఘాల ప్రతినిధులు, నాయకులు తమ వ్యక్తిగత గుర్తింపు కోసం, మీడియా, సోషల్ మీడియాలో ప్రచారం కోసం పాకులాడుతూ కలెక్టరే ట్ గేట్లు ఎక్కే ప్రయత్నం చేస్తున్నారని, అక్కడ విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది అడ్డుకునే యత్నం చేస్తే తోసేయడం, ఘర్షణ పడటం ఈ మధ్య పెరిగిందన్నారు. పోలీసులతో తోపులాడే ఫొటోలను సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్ట్రాగామ్ తదితర వాటిలో పెట్టుకుంటూ గుర్తింపు కోసం తాపత్రయం కనిపిస్తోందని తెలిపారు. గంటల తరబడి కలెక్టరేట్ ఎదుట ధర్నాలు చేస్తూ కార్యాలయంలోకి వెళ్తే వారిని ఇబ్బందులకు గురిచేయొద్దని అన్నారు. క్రమపద్ధతిలో క్రమశిక్షణతో కొన్ని నిమిషాల పాటు ధర్నా చేసుకొని మీడియా ద్వారా సమస్యను విన్నవించుకోవాలని, సమస్యను అధికారుల దృష్టికి తీసుకవస్తూ వినతిపత్రం ఇచ్చి వెళ్లిపోవాలని సూచించారు.

ఒక్క సీటు ప్లీజ్..!

- ఆర్‌సీవో కార్యాలయాల చుట్టూ విద్యార్థుల తల్లిదండ్రుల ప్రదక్షిణలు
- సమాధానం చెప్పలేక తలలు పట్టుకుంటున్న అధికారులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో సీట్లకు పెరిగిన డిమాండ్

'సారూ.. ఒక్క సీటు ఇవ్వండి.. సమాచారం లేక దరఖాస్తు చేసుకోలేదు.. ప్రవేశ పరీక్ష రాయలేదు.. పెద్ద మనస్సు చేసుకోండి.. మేము నిరుపేదలం.. డబ్బులతో చదివించే స్థోమత లేదు.. ఎలాగైనా సీటు ఇచ్చి పుణ్యం కట్టుకోండి.. అని ఇలాంటి మాటలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఆర్సీవో కార్యాలయాల వద్ద కొన్ని రోజులుగా వినిపిస్తున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకులాల్లో చదివించాలనే తపనతో ఆర్సీవో కార్యాలయాల వద్ద సీటు కోసం పడిగాపులు కాస్తున్నారు. వీరికి సమాధానం చెప్పలేక తలలు పట్టుకుంటున్నారు'



రుక్మాపూర్ గురుకుల పాఠశాల

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన, మైనార్టీ, టీఎస్ఆర్‌జేసీకి చెందిన సుమారు 72 వరకు గురుకులాలు ఉన్నాయి. బీసీ గురుకులాలు 25, ఎస్సీ గురుకులాలు 25 వీటితో పాటు గిరిజన, మైనార్టీ, టీఎస్ఆర్‌జేసీ కళాశాలలు 22 ఉన్నాయి. వీటిలో 25 వేలకు పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో ఎక్కువగా నిరుపేద కుటుంబాల వారే ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల్లో ఉచిత విద్య, వసతితో పాటు పౌష్టికాహారం అందిస్తుండడంతో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ప్రైవేట్‌లో అధిక ఫీజులు కూడా గురుకులాల వైపు మళ్లేలా చేస్తోంది. ఫలితంగా సీట్లకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.

భారీగా అందుతున్న విజ్ఞప్తులు

ప్రభుత్వం, గురుకుల సొసైటీలు వేసవిలోనే గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రచారం నిర్వహించాయి. అనంతరం విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి, అర్హత సాధించిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయించడం వెనువెంటనే జరుగుతున్నాయి. సీట్ల భర్తీ అయ్యాక కొందరు తల్లిదండ్రులు మా పిల్లలకు ఒక సీటు ఇప్పించండి సార్ అంటూ గురుకుల ఆర్సీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొంత మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసినా సీటు రాకపోవడంతో ఆర్సీవో కార్యాలయాలకు చేరుతున్నారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన విద్యార్థుల నుంచి కూడా విజ్ఞప్తులు అందుతున్నాయి. ఒక దశలో ప్రజాప్రతినిధులను ఆశ్రయించి వారి సిఫార్సు లెటర్లను సంపాదించి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇలా వస్తున్న వారిలో చాలా మంది మేము నిరుపేదలం.. మా పిల్లలను చదివించే స్థోమత లేదని చెబుతుండటం గమనార్హం. అయితే సీట్ల కేటాయింపు తమ పరిధిలోని అంశం కాదని, ఇప్పటికే ప్రవేశ పరీక్ష ద్వారా సీట్లన్నీ నిండిపోయాయని అధికారులు చెబుతున్నారు. మిగిలిన సీట్లకు సంబంధించి పై అధికారుల ఆదేశానుసారం ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థుల మెరిట్ ఆధారంగానే ప్రవేశాలు ఉంటాయని ఇంకా కొన్ని రోజులు వేచి చూడల్సిందేనని సమాధానాలు వస్తుండడంతో చేసేదేమిలేక ఇంటిబాట పడుతున్నారు. దీంతో పిల్లల చదువుల కోసం గురుకులాల్లో సీట్ల ప్రవేశానికి తల్లిదండ్రులు పడరాని పాట్లు పడుతున్నారు.

పరీక్షలో అర్హత సాధించిన వారికే

గురుకులాల్లో ప్రవేశాలకు వేసవిలోనే నోటిఫికేషన్ విడుదల చేసి ఐదో తరగతితో పాటు ఇతర తరగతుల్లో ఖాళీల భర్తీకి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారికే సీట్లు కేటాయించాం. పరీక్ష రాయని వారికి ఎలాంటి అవకాశం లేదు. ఏటా ఏప్రిల్, మే నెలల్లో వచ్చే ప్రవేశపరీక్ష ప్రకటనను చూసుకొని దరఖాస్తు చేసుకోవాలి. అంతా ఆన్‌లైన్ ద్వారానే ప్రవేశాలుంటాయి. ప్రవేశాల విషయంలో తమ ప్రమేయం లేదు. మెరిట్‌తోనే అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుంది.

– ఎం.సూర్యప్రకాష్‌రావు, ఏఆర్‌సీవో

సీట్ల సంఖ్య పెంచాలి



ప్రభుత్వం గురుకులాల్లో సీట్ల సంఖ్యను పెంచాలి. తీవ్ర పోటీని దృష్టిలో ఉంచుకుని పరీక్ష రాసి సీట్లు రాని పిల్లలందరికీ సీట్లు కేటాయించాలి. గురుకులాల్లో మౌలిక వసతులపై దృష్టిసారించాలి. ఇప్పటివరకు పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు ఇతరత్రా మెటీరియల్ అందించకపోవడం బాధాకరం.

– నంద గణేష్, యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

రాజుకున్న 'విద్యుత్' మంటలు





చింతకుంటలో బీఆర్ఎస్ కట్టిన ఫ్లెక్సీ, కరీంనగర్‌లో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్
- పోటాపోటీగా నిరసనలు, దిష్టిబొమ్మల దహనాలు
- కాంగ్రెస్ నేతలు తమ ఊరికి రావద్దంటూ గ్రామాల్లో ఫ్లెక్సీలు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అక్కర్లేదని, మూడు గంటల విద్యుత్ సరిపోతుందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు పోటాపోటీగా నిరసనలు, దిష్టిబొమ్మల దహనాలు చేస్తూ ఆందోళనకు దిగాయి. మొన్నటివరకు బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే ప్రధాన పోరు అనుకున్న పరిస్థితుల నుంచి విద్యుత్ మంటలతో ఒక్కసారిగా నువ్వా..నేనా అన్నట్లు బీఆర్ఎస్, కాంగ్రెస్ నిరసనల పేరిట రోడ్లు ఎక్కడంతో ఆందోళనల అంశమే ప్రధాన చర్చగా మారింది. విదేశీ పర్యటనలో ఉన్న రేవంత్‌రెడ్డి తానా మహాసభల్లో ఉచిత విద్యుత్ మూడు గంటలు సరిపోతుందని చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. జిల్లాకేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో మంగళవారం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఊరితీసి దహనం చేయడంతో కాంగ్రెస్‌శ్రేణులు ఒక్కసారిగా అప్రమత్తమై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మల దహనం, విద్యుత్ కార్యాలయాల ముందు ధర్నాకు పిలుపునిచ్చింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. 24 గంటల ఉచిత విద్యుత్‌తోపాటు కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేసి రైతుకు వెన్నుదన్నుగా ఉండేందుకు రైతుబీమా, రైతుబంధు, రుణమాఫీ వంటి పథకాలను అమలు చేసి రైతుకు అండగా నిలిచామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొంటుంటే, ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని, ప్రాజెక్టుల నిర్మాణం తమ హయాంలోనే జరిగిందని కాంగ్రెస్ శ్రేణులు బదులిస్తూ నిరసనలు చేపట్టాయి. ఉచిత కరెంట్‌పై రేవంత్‌రెడ్డి మాటలు బేషరతుగా ఉపసంహరించుకోని క్షమాపణ చెప్పాలని, లేకుంటే కాంగ్రెస్ నేతలను అడ్డుకుని తీరుతామని బీఆర్ఎస్ శ్రేణులు తేల్చిచెబుతుండడంతో మున్ముందు ఆందోళనలు ఏవైపు దారి తీస్తాయోనన్న చర్చ నడుస్తోంది. ఇప్పటికే కరీంనగర్ నియోజకవర్గంలో పలు గ్రామాల్లో, ప్రధాన కూడళ్లల్లో 'కాంగ్రెస్ నేతల్లారా మా ఊరికి రావద్దు.. ఖబడ్దార్ రేవంత్‌రెడ్డి..' అంటూ ఫ్లెక్సీలు వెలిశాయి. కరీంనగర్ జిల్లా కేంద్రంలో విద్యుత్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ శ్రేణులు కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశాయి. జగిత్యాల జిల్లాకేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. చొప్పదండి నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు సీఎం కేసీఆర్, రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు చెప్పులు కట్టడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు టెక్స్‌టైల్స్ పార్క్ వద్ద ఉన్న మంత్రి కేటీఆర్ చిత్రపటానికి చెప్పులదండ వేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలుచోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల బాధ్యులు పోటాపోటీగా ధర్నాలు నిర్వహించి నిరసనలతో హోరెత్తించారు.

ఇంటెలిజెన్స్ పోలీసులకు సేవా పతకాలు

కరీంనగర్‌క్రైం: రాష్ట్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చినందుకు పోలీసులకు సేవా పతకాలు ప్రకటించింది. కరీంనగర్ ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న పలువురు సిబ్బంది ఎంపికయ్యారు. హెడ్‌కానిస్టేబుల్ కాసర్ల మునీందర్‌రెడ్డికి మహోన్నత సేవా పతకం, పాకాల మనోహర్‌రెడ్డికి సేవా పతకం లభించింది.

సంక్షేమ పథకాల్లో ట్రాన్స్‌జెండర్లకు ప్రాధాన్యం



కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

కరీంనగర్: ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు, బీసీ రుణాలు వంటి పథకాలతో పాటు కమ్యూనిటీ పరంగా అమలు చేసే ప్రతీ పథకంలోనూ ట్రాన్స్‌జెండర్లకు ప్రాధాన్యం ఇస్తామని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. బుధవారం నగరంలోని క్రిస్టియన్‌కాలనీలో ప్రభుత్వ మహిళా సహకార అభివృద్ధి సంస్థ మహిళా ఉద్యోగినుల వసతిగృహంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లు సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ట్రాన్స్‌జెండర్‌లందరూ ఓటుహక్కు కలిగి ఉండాలని, అందుకు ఓటరు నమోదుకు తహసీల్దార్‌కు దరఖాస్తు అందజేయాలని తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డులతో పాటు ఆధార్, ట్రాన్స్‌జెండర్ ఐడీ కార్డులను కూడా అందజేయడం జరుగుతుందన్నారు. స్వయం ఉపాధిలో భాగంగా కుట్టుమిషన్ కోసం కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించగా డీఆర్డీవో ద్వారా వెంటనే అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వసతిగృహ ప్రాంగణంలో కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో సంధ్యారాణి, తహసీల్దార్ సుధాకర్, జిల్లా మేనేజర్ జి.సునంద, సఖీ కోఆర్డినేటర్ లక్ష్మీ, ట్రాన్స్‌జెండర్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ చేతుల మీదుగా పాప దత్తత

శిశుగృహకు చెందిన ఆరు నెలల బాలికను హైదరాబాద్‌కు చెందిన సంతానం లేని దంపతులకు కలెక్టర్ ఆర్వీ కర్ణన్ చేతుల మీదుగా క్యాంపు కార్యాలయంలో బుధవారం దత్తత ఇచ్చారు. ×సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ×లో 2019లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు సమర్పించుకున్న వీరికి కరీంనగర్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న శిశు గృహాలోని పాపను సీనియార్టీ ప్రకారం చూపించగా పాపను 15 రోజుల క్రితం రిజర్వ్ చేసుకొని దత్తత స్వీకరించారు. జెడ్పీ సీఈవో ప్రియాంక, డీడబ్ల్యూవో సంధ్యారాణి, శిశు గృహ మేనేజర్ తేజస్వి, సోషల్ వర్కర్ రాజేష్‌ఖన్నా, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

నగర అభివృద్ధే లక్ష్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్

కరీంనగర్ కార్పొరేషన్: నగర అభివృద్ధే ప్రధాన లక్ష్యమని మేయర్ సునీల్‌రావు అన్నారు. బుధవారం నగరంలోని 25వ డివిజన్ కిసాన్‌నగర్‌లో రూ.50లక్షలతో చేపట్టిన ఎస్‌డబ్ల్యూజీ డ్రైనేజీ పైపులైన్, సిమెంట్ ప్యాచ్‌వర్క్స్ పనులకు భూమిపూజ చేశారు. రాష్ట్రప్రభుత్వంపై విశ్వాసంతో ప్రజలు తమకు అవకాశం కల్పించారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా అభివృద్ధి చేపడుతున్నామని అన్నారు. మూడేళ్లలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడించారు. కిసాన్‌నగర్ శివారు ప్రాంత పరిధిలోని 25, 26, 24, 3 డివిజన్‌లలో అభివృద్ధి పనులతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్‌లు ఎడ్ల సరిత అశోక్, తిరుపతి, డీఈ మసూద్ అలీ పాల్గొన్నారు.

ఆ నిధులు రాష్ట్రానివే

నగరంలోని తీగలగుట్టపల్లిలో గురువారం శంకుస్థాపన చేయనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణానికి వెచ్చిస్తున్న నిధులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని మేయర్ సునీల్‌రావు విమర్శించారు. కేంద్రం ఇచ్చిందని చెబుతున్న రూ.126 కోట్లు రాష్ట్రానికి సంబంధించిన నిధులేనని ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి విధిగా రావాల్సిన సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) నిధుల నుంచే ఆర్ఓబీకి కేటాయించారన్నారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ అమ్మకాల్లో సెస్ పేరిట కేంద్రం పన్నులు వసూలు చేస్తుందన్నారు. ఆ నిధులను యధావిధిగా రాష్ట్రాలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

కాంగ్రెస్‌కు పుట్టగతులుండవ్



మాట్లాడుతున్న చల్ల హరిశంకర్

కరీంనగర్: రైతులకు మూడు గంటల కరెంట్ ఇస్తే సరిపోతుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో పుట్టగతులుండవని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. మీసేవా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్, బీజేపీలని, ఆ రెండు పార్టీలు రైతు వ్యతిరేక విధానాలతో రాష్ట్రాన్ని అధోగతిపాలు చేశాయని గుర్తు చేశారు. వ్యవసాయం దండుగన్న వారిని ప్రజలు తిరస్కరించారని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పదేళ్లల్లోనే వ్యవసాయాన్ని పండుగ చేసి రైతును రారాజు చేస్తే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు జీర్ణించుకోవడం లేదని ధ్వజమెత్తారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా దేశంలో ఎక్కడ లేని విధంగా సాగునీరు, పెట్టుబడి సాయం, ఉచిత విద్యుత్, రైతుబీమా, రైతుబంధు, కాళేశ్వరం ప్రాజెక్టు, రిజర్వాయర్లను నిర్మించి కోటి ఎకరాల మాగాణిలో వరిధాన్యాన్ని పండిస్తూ దేశంలోనే మొదటిస్థానం తెలంగాణ ఆక్రమిస్తే కాంగ్రెస్ నేతలకు కడుపుమంట, కళ్లమంట మొదలైందని మండిపడ్డారు. మొన్న ధరణి, నేడు ఉచిత విద్యుత్ వద్దన్న కాంగ్రెస్ నేతలు రేపు రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ కూడా రద్దు చేస్తారని వారి మాటలు ప్రజలు నమ్మవద్దని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్, అనుబంధ విభాగాల నాయకులు గడ్డం ప్రశాంత్‌రెడ్డి, కులదీప్ వర్మ, సాయికృష్ణ, మీర్ షౌకత్ అలీ, వాజిద్, చంద్రశేఖర్, శ్రీనివాస్, వొడ్నాల రాజు, వసంతరావు, కల్పన,పావని, అఫ్రోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

మోకీలు మార్పిడి @ జిల్లా ఆస్పత్రి

'జమ్మికుంట మండలంలోని రామన్నపల్లికి చెందిన బెజుగం సత్యనారాయణ అనే రైతు ఆరేళ్లుగా మోకాలు నొప్పితో బాధపడుతున్నాడు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి, ఆపరేషన్ చేయించుకోలేని పరిస్థితిలో ప్రభుత్వ వైద్యులు అండగా నిలిచారు. ఈ నెల 6న మోకీలు మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా చేశారు.'

'ధర్మారం మండలంలోని కమ్మరిఖాన్‌పేటకు చెందిన మెంగెని రమాదేవి నాలుగేళ్లుగా మోకాళ్ల నొప్పితో బాధపడుతోంది. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే ఆపరేషన్‌కు రూ.3 లక్షలు ఖర్చవుతాయని వైద్యులు తెలిపారు. దీంతో ఆమె ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. డాక్టర్లు ఈ నెల 3న మోకీలు మార్పిడి శస్త్రచికిత్స చేశారు.'

- కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో విజయవంతంగా శస్త్రచికిత్స
- అన్ని రకాల ఆపరేషన్లపై వైద్యుల దృష్టి
- పైసా ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీలో సేవలు
- మెడికల్ కళాశాల రావడంతో పెరిగిన సౌకర్యాలు
- పేదలకు అందుతున్న మెరుగైన వైద్యం



శస్త్రచికిత్స అనంతరం పేషెంట్లతో వైద్యులు

కరీంనగర్ టౌన్: జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి మోకీలు మార్పిడి శస్త్రచికిత్సకు కేరాఫ్‌గా మారింది. సుమారు రూ.2 లక్షల ఖరీదైన ఈ ఆపరేషన్‌ను ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా చేస్తున్నారు. ఇదొక్కటే కాదు.. అత్యంత ఖరీదైన అన్ని విభాగాల శస్త్రచికిత్సలపై వైద్యులు దృష్టిసారించారు. జిల్లా ఆస్పత్రి మెడికల్ కళాశాలగా మారడంతో డాక్టర్లు, ప్రొఫెసర్ల సంఖ్య పెరిగింది. అన్ని విభాగాలకు సరిపడా వైద్యులు అందుబాటులో ఉన్నారు. ప్రతిరోజు మోకీలు, తుంటి మార్పిడి, ల్యాప్రోస్కోపిక్ సర్జరీలు చేస్తూ నిరుపేదలకు ఖరీదైన వైద్యాన్ని పైసా ఖర్చు లేకుండా అందిస్తున్నారు.

అన్ని రకాల శస్త్రచికిత్సలు..

దశలవారీగా రోగులకు అన్ని రకాల ఆపరేషన్లు చేసేలా కార్యాచరణ రూపొందించారు. రెండేళ్ల క్రితం వరకు కోవిడ్–19 పలు శస్త్రచికిత్సలపై తీవ్ర ప్రభావం చూపింది. అంతేకాకుండా కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి కోవిడ్ ఆస్పత్రిగా మారడంతో పేషెంట్లు రావడానికి విముఖత చూపారు. ప్రస్తుతం వైద్యులు సాధారణ శస్త్రచికిత్సలతోపాటు అన్ని రకాల ఖరీదైన ఆపరేషన్లు చేస్తూ పేద రోగులకు అండగా నిలుస్తున్నారు.

అత్యాధునిక ఆపరేషన్ థియేటర్

గతంలో జిల్లా దవాఖానాలో అడపాదడపా శస్త్రచికిత్సలు జరిగేవి. ఇటీవల ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించడం, వైద్య కళాశాల ఏర్పాటు పుణ్యమా అని సరిపడా వైద్యులను నియమించారు. ఫలితంగా నిరంతరం ఆపరేషన్లు జరుగుతున్నాయి. వీటికోసం అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ అందుబాటులో ఉంది. ఇటీవలి కాలంలో తుంటి ఎముకలు విరిగిన వారికి సైతం తుంటి ఎముక మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా చేశారు. మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలతోపాటు శరీరంపై కోతలు, కుట్లు లేకుండా అత్యాధునిక ల్యాప్రోస్కోపిక్ ఆపరేషన్లను ఆరోగ్యశ్రీ పథకంలో చేస్తున్నారు.

పేదలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మెషినరీతో అన్ని రకాల శస్త్రచికిత్సలు చేస్తున్నాం. ప్రైవేటు ఆస్పత్రుల్లో చేసే ఎంటి ఖరీదైన ఆపరేషన్లయినా ఇక్కడ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. పేదలు ప్రైవేటు దవాఖానాకు వెళ్లి, ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ నారగోని కుమార్‌గౌడ్, ఆర్థోపెడిక్ డిపార్ట్‌మెంట్ హెడ్

క్లుప్తంగా

గుడుంబా విక్రయిస్తున్న మహిళ రిమాండ్



రామడుగు: గుడుంబా విక్రయిస్తున్న రామడుగు మండలంలోని తిర్మలాపూర్‌కు చెందిన మన్నె రమను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ సీఐ ఎం.తిరుమలత తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. రమ గత నెలలో గుడుంబా విక్రయిస్తుండగా ఎక్సైజ్ అధికారులు పట్టుకొని, తహసీల్దార్ రాజ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ క్రమంలో ఆమె మళ్లీ గుడుంబా విక్రయిస్తూ పట్టుబడటంతో అధికారులు బైండోవర్ కింద ఫైన్ చెల్లించాలని రెండుసార్లు నోటీసులు ఇచ్చారు. వాటికి రమ స్పందించకపోవడంతో బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఎస్సైలు స్వప్న, సింధు, సిబ్బంది శ్రీలత, స్వప్న, రమాదేవి, అశోక్, ప్రశాంత్ ఉన్నారు.

పారమిత విద్యాసంస్థలకు అంతర్జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రసాద్‌రావు

విద్యానగర్: పారమిత విద్యాసంస్థలకు అంతర్జాతీయ అవార్డు లభించింది. స్కిల్ ఎడ్యుకేషన్‌ను పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అందిస్తున్నందుకుగాను లండన్‌లోని కేంబ్రిడ్జి యూనివర్సిటీ, నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అలయన్స్(నిసా) వారు బెస్ట్ స్కూల్ ఇన్ ఇన్నోవేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ అవార్డు ప్రకటించారు. గత ఆదివారం కేంబ్రిడ్జి యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్లు గైడోజా, ఫెర్నాండేజ్, నిసా ప్రెసిడెంట్ కుల్‌భూషణ్ శర్మ చేతులమీదుగా పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాద్‌రావు, డైరెక్టర్ రశ్మిత అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడుతూ.. ఈ అత్యున్నత పురస్కారం దక్కడంలో విద్యార్థుల విజయాలు, తల్లితండ్రులు, ఉపాధ్యాయుల సహకారం ఉన్నాయని తెలిపారు.

15, 16 తేదీల్లో రాష్ట్రస్థాయి ఓపెన్ చదరంగ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్: చదరంగ సమాఖ్య ఉమ్మడి కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మేజర్ కేపీ శివకుమార్ సౌజన్యంతో ఈ నెల 15, 16 తేదీల్లో రాష్ట్రస్థాయి ఓపెన్ చదరంగ పోటీలను కరీంనగర్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో నిర్వహిస్తున్నట్లు సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు మోసం అంజయ్య, గడ్డాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఈ నెల 14న మధ్యాహ్నం 1గంట నుంచి 15వ తేదీ ఉదయం 10 గంటల వరకు తమ పేర్లను ఆర్యవైశ్య భవన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. చెస్ బోర్డులు, పావులు వెంట తెచ్చుకోవాలని, క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 95153 42207 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

16న సివిల్స్ ఉచిత శిక్షణకు ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష

సప్తగిరికాలనీ: బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని బీసీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సివిల్స్ లాంగ్‌టర్మ్ ఉచిత శిక్షణ కోసం ఈ నెల 16న ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు గురువారం నుంచి https-://studycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని అన్నారు. పూర్తి వివరాలకు 040-27077929, 77808 59322 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్' పోటీలో ఖాసీంపేట

- స్వచ్ఛతలో ముందంజ
- గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం
- త్వరలో కేంద్ర బృందం రాక




మహిళా సమాఖ్య భవనం వద్ద ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత, ఆహ్లాదకరంగా పల్లె ప్రకృతి వనం

గన్నేరువరం: ఖాసీంపేట గ్రామ పంచాయతీ అభివృద్ధిలో దూసుకుపోతోంది. గన్నేరువరం మండలంలో 16 గ్రామాలుండగా ఈ పల్లె జాతీయ స్థాయి పోటీలో స్వచ్ఛతలో ముందంజలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇంకుడు గుంతల నిర్మాణం మొదలు నీటి పొదుపు, హరితహారం వంటి కార్యక్రమాలను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. పరిసరాల పరిశుభ్రతకు ఇటీవల జిల్లా స్థాయిలో గ్రామ పంచాయతీ పురస్కారం అందుకుంది. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ పథకం పురస్కారం కోసం రాష్ట్రస్థాయిలో 2 వేలలోపు జనాభా గల గ్రామ పంచాయతీలతో పోటీలో నిలిచింది.

366 కుటుంబాలు..

ఖాసీంపేటలో 1,366 మంది జనాభా, 1,144 మంది ఓటర్లు ఉన్నారు. 366 కుటుంబాలు ఉండగా ఇంటింటికీ ఇంకుడుగుంత నిర్మించుకున్నారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ సెంటర్, వాటర్ ప్లాంట్, వివిధ కమ్యూనిటీ భవనాలపై క్లీన్ అండ్ గ్రీన్‌లో భాగంగా వర్షపు నీరు భవనాలపై నుంచి భూమిలోకి వెళ్లేలా సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించారు. అలాగే అంతరాయం లేకుండా ఇంటింటికీ నీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే గ్రామస్తులు కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకుల విక్రయానికి, కొనుగోలుకు అనుగుణంగా వారసంత, వ్యవసాయ సమగ్ర సమాచారం కోసం రైతు వేదిక, యువత, విద్యార్థులకు క్రీడా ప్రాంగణం, ఆహ్లాదం కోసం పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. గ్రామంలో రోడ్ల వెంట హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. శ్మశాన వాటిక, మిషన్ భగీరథ నీటి సరఫరాకు 40 వేల లీటర్ల ట్యాంకు, తడి, పొడి చెత్త సేకరించి, వేరు చేసి, సేంద్రియ ఎరువు తయారు చేయడానికి కంపోస్టు షెడ్డు నిర్మించారు.

అప్పుడు మాదాపూర్.. ఇప్పుడు ఖాసీంపేట

2016–17లో మాదాపూర్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా నిలిచింది. అప్పటి సర్పంచ్ మాడుగుల రవీందర్‌రెడ్డి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఇంటింటికీ ఇంకుడుగుంతలు పూర్తి చేసిన గ్రామంగా జిల్లాలోనే మొదటిస్థానంలో నిలిచింది. ప్రస్తుతం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ పురస్కారం పోటీల్లో ఖాసీంపేట నిలవడంతో గన్నేరువరం మండలానికి మరో అవార్డు దక్కే అవకాశాలున్నాయి.

15 నుంచి పనుల పరిశీలన

అభివృద్ధి, స్వచ్ఛతలో భాగంగా కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాల్లో చేపట్టిన పనులను పరిశీలించడానికి ఈ నెల 15వ తేదీ నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కేంద్ర బృందం సభ్యులు రానున్నారు. ఇందులో భాగంగా ఖాసీంపేటలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని అధికారులు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు వేగవంతం చేశారు. గ్రామంలో వాడకంలో లేని వస్తువుల తోపాటు ప్రతి ఇంటిలో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారించారు.

సమష్టి సహకారంతో..



స్వచ్ఛతలో ఖాసీంపేటకు జిల్లా స్థాయిలో పురస్కారం వచ్చింది. రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, స్థానిక, జిల్లాస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ పాలకవర్గ సభ్యుల సమష్టి సహకారం వల్లే ఇది సాధ్యమైంది. ఇదే స్ఫూర్తిగా జాతీయస్థాయిలో పురస్కారం అందుకునేందుకు కృషి చేస్తున్నాం. అభివృద్ధి పనులు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టిసారించాం.

– గంప మల్లీశ్వరి, సర్పంచ్, ఖాసీంపేట

15న బీసీల రాజకీయ ప్లీనరీకి రండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీసీ నాయకులు

విద్యానగర్: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న హైదరాబాద్‌లో బీసీల రాజకీయ ప్లీనరీ నిర్వహించనున్నట్లు బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో అరశాతం ఉన్న సామాజిక వర్గాల చేతుల్లో పాలనా పగ్గాలుంటే 60 శాతం ఉన్న బీసీలు పాలితులుగా ఉన్నారని తెలిపారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయ పార్టీలకు బీసీలు గుర్తుకు వస్తారని ఆరోపించారు. శాసనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, రాజకీయ పార్టీలన్నీ బీసీ డిక్లరేషన్ పేరిట కొత్త పల్లవి అందుకొని, సంక్షేమ పథకాలు, సబ్సిడీల పేరిట గాలం వేసే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. ఓటు మనదే–సీటు మనదే, మేమెంతో మాకంత దక్కాల్సిందే అంటూ అగ్రకుల ఆధిపత్య పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. మన రాష్ట్రంలో–మన పాలన అనే నినాదంతో హైదరాబాద్ ఎల్బీనగర్ కేబీఆర్ కన్వెన్షన్‌లో జరిగే ప్లీనరీకి బీసీ వర్గాలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్, నాయకులు నాగుల కనకయ్య, రాచమల్ల రాజు, నారోజు రాకేశ్, మాచర్ల అంజయ్య, శ్రీధర్, సురేందర్, శ్రీనివాస్, సంపత్, వరాల జ్యోతి, గంగిపల్లి అరుణ, దేవరకొండ సంతోషి, కవిత, పావని తదితరులు పాల్గొన్నారు.

'సీఆర్‌ఆర్‌టీ'తో 24 గంటలూ డయాలసిస్

- జిల్లా ఫైర్ ఆఫీసర్ వెంకన్న
- మెడికవర్ ఆస్పత్రిలో నూతన డయాలసిస్ మెషిన్ ప్రారంభం



మెషిన్‌ను ప్రారంభించిన ఫైర్ ఆఫీసర్ వెంకన్న

కరీంనగర్‌టౌన్: ఉత్తర తెలంగాణ జిల్లాల్లోనే మొట్టమొదటిసారిగా అత్యుత్తమ డయాలసిస్ కోసం కంటిన్యూస్ రీనల్ రీప్లేస్‌మెంట్ థెరపీ(సీఆర్‌ఆర్‌టీ) డయాలసిస్ మెషిన్‌ను కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకురావడం కిడ్నీ రోగులకు గొప్ప వరమని జిల్లా ఫైర్ ఆఫీసర్ టి.వెంకన్న అన్నారు. బుధవారం ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ మెషిన్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. అత్యవసర, ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేషెంట్లకు కిడ్నీలు విఫలమైన సమయంలో ఈ యంత్రం కిడ్నీలు చేసే పనిని నిరంతరాయంగా నిర్వహించి, ప్రాణాలు కాపాడుతుందని తెలిపారు. దీనికి 24 గంటలూ నిర్విరామంగా డయాలసిస్ చేసే సామర్థ్యం ఉంటుందన్నారు. బీపీ హెచ్చుతగ్గులు ఉన్నా, హార్ట్ రేట్ మెయింటేన్ కాకపోయినా డయాలసిస్ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ గుర్రం కిరణ్, నెఫ్రాలజిస్టు రామచందర్ తొర్రం, వైద్యులు ఉపేందర్‌రెడ్డి, కిరణ్ కొండపాక, బూర్ల శ్రీకాంత్, వినయ్, కృష్ణచైతన్య, ప్రత్యూష, నాగరాజు, కార్తీక్‌రావు, వేణుగోపాల్‌రావు, అక్షయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ రైలు ఢీకొని ఒకరి దుర్మరణం



రాజయ్య (ఫైల్)

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్‌లోని వావిలాలపల్లెకు చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి కందుల రాజయ్య(57) నిత్యం రైల్వేస్టేషన్ సమీపంలో మార్నింగ్ వాకింగ్‌కు వెళ్తుంటాడు. బుధవారం రైల్వే ట్రాక్‌పై నడుస్తుండగా కరీంనగర్ నుంచి నిజామాబాద్ వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయన పక్కనే ఉన్న స్థలంలో ఎగిరిపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. రాజయ్య చిన్న కుమారుడు సందీప్ వచ్చి, ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య శంకరమ్మ విద్యుత్‌శాఖలో పని చేస్తోంది. ఇద్దరు కుమారుల్లో పెద్ద కుమారుడు సాగర్ విదేశాల్లో, చిన్న కుమారుడు స్థానికంగా ఉంటున్నాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు రామగుండం రైల్వే పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైద్య సేవలను అప్‌డేట్ చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి

కరీంనగర్‌టౌన్: వ్యాధి నిరోధక టీకాలు, ఇతర ఆరోగ్య సేవలను అందించిన వెంటనే సబ్ సెంటర్‌లోని సూపర్‌వైజర్ సిబ్బంది, ఏఎన్‌ఎంలు ప్రతిరోజూ సాయంత్రం కేసీఆర్ కిట్ పోర్టల్‌లో అప్‌డేట్ చేసి జిల్లాను ప్రగతిపథంలో ఉండేలా చూడాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి అన్నారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి అతుల్ నిగమేతో కలిసి మిషన్ ఇంద్రధనస్సు అమలు చేయచేసేందుకు వైద్యాధికారులకు శిక్షణ ఇచ్చారు. ఆశా కార్యకర్తలు, ఫీల్డ్ సిబ్బంది ఇంటింటా తిరిగి డ్రాపవుట్స్, మిస్డ్ పిల్లలకు వ్యాక్సినేషన్ చేయాలన్నారు. వీరిని గుర్తించిన వెంటనే సమీప వ్యాక్సినేషన్ కేంద్రాల వద్దకు తీసుకెళ్లి వ్యాక్సినేషన్ చేయించడం మిషన్ ధనస్సు ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కేవీ రవీందర్‌రెడ్డి, డాక్టర్ సాజీదా అతహరి, డాక్టర్ చందు, డాక్టర్ వినీత, సీహెచ్.రంగారెడ్డి, కాంతరావు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన గల జీవిత ఖైదీలకు క్షమాభిక్ష పెట్టాలి

- ప్రభుత్వాన్ని కోరిన ఖైదీల కుటుంబసభ్యులు



మాట్లాడుతున్న ఖైదీల కుటుంబసభ్యులు

విద్యానగర్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సత్ప్రవర్తన కలిగిన జీవిత ఖైదీలకు క్షమాభిక్ష పెట్టి, విడుదల చేయాలని ఖైదీల కుటుంబసభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో వారు మాట్లాడారు. తెలిసీతెలియక, క్షణికావేశంలో చేసిన తప్పులకు జీవిత ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్న వారిలో సత్ప్రవర్తన కలిగిన వారిని గుర్తించి, దయతో విడుదల చేసి, తమ కుటుంబాల్లో వెలుగులు ప్రసాదించాలని వేడుకున్నారు. 60 ఏళ్ల వయసు పైబడిన వృద్ధులు తమ పని తాము చేసుకోలేకపోతున్నారని, చేసిన తప్పులకు పశ్చాత్తాపంతో ఏడుస్తున్నారని తెలిపారు. వారికి క్షమాభిక్ష పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఉచిత విద్యుత్ డాక్టర్ వైఎస్సార్ పేటెంట్

- అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ధర్నాలు చేయడం సిగ్గుచేటు
- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ఆక్షేపణీయం
- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్



కొత్తపల్లి: రైతులకు ఉచిత విద్యుత్ పథకం దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ పేటెంట్ అని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేశ్ ఒక ప్రకటనలో అన్నారు. వైఎస్సార్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా రైతులకు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీపై సంతకం చేసి, రైతు పక్షపాతిగా నిలిచారని కొనియాడారు. ఉచిత విద్యుత్‌పై పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ రెండు రోజులుగా ధర్నాలు చేపట్టడం సిగ్గుచేటన్నారు. కేవలం ఎన్నికల్లో లబ్ధి, రైతుల నుంచి సానుభూతి పొందేందుకు చేస్తున్న ప్రయత్నమని విమర్శించారు. రైతులపై ప్రభుత్వానికి ప్రేమ ఉంటే రైతు రుణమాఫీ చేయాలని, పంట పరిహారం చెల్లించాలని, యాసంగి ధాన్యం కటింగ్ డబ్బులు వాపస్ ఇచ్చి, చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సూచించారు. అలాగే ఉచిత విద్యుత్‌పై చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జరిమానా

కొత్తపల్లి/కమాన్‌పూర్: పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని నాగేపల్లికి చెందిన రామిండ్ల రవికి కోర్టు జరిమానా విధించినట్లు కరీంనగర్ ఉమ్మడి జిల్లా విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రవి తన ఇంటికి అనుమతి లేకుండా అక్రమంగా విద్యుత్ వినియోగిస్తుండగా విద్యుత్ విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి, మొదటి నేరంగా భావించి, రూ.1,000 జరిమానా విధించి వదిలేశారు. మళ్లీ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ పట్టుబడగా కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. అతన్ని బుధవారం పెద్దపల్లి జిల్లా సెషన్స్ జడ్జి డి.హేమంత్‌కుమార్ ఎదుట హాజరుపర్చగా నేరాన్ని అంగీకరించాడు. దీంతో న్యాయమూర్తి రూ.10,557 చెల్లించాలని, లేదంటే మూడు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పు వెలువరించినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. ఎస్సైలు ఎ.నిరంజన్‌రెడ్డి, టి.నరేష్, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీ అనుమతిపై ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

శంకరపట్నం: కొత్తగట్టు శివారులో బుధవారం గ్రానైట్ క్వారీ అనుమతి కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ రైతులు, పర్యావరణ ప్రేమికులు, ప్రజాసంఘాల నాయకుల అభిప్రాయం తెలుసుకున్నారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 157లో 1.70 హెక్టార్లలో గ్రానైట్ క్వారీ నిర్వహించేందుకు సాయి ఎంటర్‌ప్రైజెస్ పేరిట దరఖాస్తు చేసుకున్నారని అన్నారు.

ఆర్వోబీ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయండి

కరీంనగర్: సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న కరీంనగర్ తీగలగుట్టపల్లి నాలుగు లేన్ల (ఫోర్‌వే లేన్) రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులకు గురువారం శంకుస్థాపన జరుగుతుండటం సంతోషకరమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థలకు సూచించారు. ఈ పనులు పూర్తయితే కరీంనగర్‌వాసులతో పాటు చొప్పదండి వైపు వెళ్లే అనేక గ్రామాల ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా రాకపోకలకు ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు.

పేద వైద్య విద్యార్థినికి ఆర్థికసాయం

కరీంనగర్‌టౌన్: బీఎస్ రావు హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు ఓ పేద వైద్య విద్యార్థినికి ఆర్థికసాయం అందించి, తన ఔదార్యాన్ని చాటుకున్నారు. మంచిర్యాలకు చెందిన డి.సాయివెన్నెల కరీంనగర్ చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతోంది. ఆమె తండ్రి చంద్రశేఖర్ కూలి పనులు చేస్తూ కూతుర్ని చదివిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ బీఎస్ రావు బుధవారం సాయివెన్నెలకు పుస్తకాలు, నోటు బుక్కులు కొనుగోలు చేసుకోవడానికి, ఇతర ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. సాయివెన్నెల ఎన్ని కష్టాలు ఉన్నా తన చదువును కొనసాగిస్తూ వైద్య విద్యలో సీటు సాధించడం అభినందనీయమన్నారు. ఆ విద్యార్థిని చదువు ఆగిపోకూడదనే ఉద్దేశంతోనే సాయం చేసినట్లు తెలిపారు. వైద్యులు సైతం ఆమెకు చేయూతనివ్వాలని అన్నారు. సాయివెన్నెల అక్క వైద్య విద్యలో పీజీ చదువుతోందని పేర్కొన్నారు. ఈ సరస్వతీ పుత్రికల చదువుకు దాతలు ఆర్థికసాయం చేయాలని కోరారు.

ఇరువర్గాలపై కేసు

ధర్మారం(ధర్మపురి): బొట్లవనపర్తి గ్రామ శివారు వ్యవసాయ భూమి వద్ద జరిగిన దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బొట్లవనపర్తికి చెందిన కర్రె లచ్చయ్య బుధవారం తన వ్యవసాయ భూమిలో ఉన్న తాటి చెట్టును నరికివేశాడు. అనంతరం తాటిమొద్దులను గుడికందుల సాయిలు భూమిలో వేశాడు. సాయిలు వాటిని తన భూమిలో ఎందుకు వేశావని లచ్చయ్యను ప్రశ్నించగా తన భూమిలోనే వేసుకున్నానని బదులిచ్చాడు. దీంతో మాటా మాట పెరిగి, దాడి చేసుకున్నారు. లచ్చయ్య ఫిర్యాదు మేరకు సాయిలు, అతని కుమారుడు సురేష్‌పై, సాయిలు ఫిర్యాదు మేరకు లచ్చయ్యతోపాటు మహేశ్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ధ్రువీకరణ ఉంటేనే దుకాణం

- పురుగుమందులు, ఎరువుల డీలర్లకు ఇక తప్పనిసరి
- విడతలవారీ శిక్షణకు ఆదేశించిన కేంద్ర ప్రభుత్వం



కరీంనగర్ అర్బన్: దుకాణాల్లో విరామం లేకుండా గడిపే డీలర్లు తరగతి గదిలో కూర్చోవాల్సిందే.. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల లెక్కలతో కుస్తీ పట్టే వారంతా ఇకనుంచి నిపుణుల బోధనలు వినాల్సిందే.. కేంద్ర ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఆదేశాల ప్రకారం.. ప్రతి డీలర్ వ్యవసాయ శాఖ నుంచి డీఏఈఎస్ఐ డిప్లొమా కోర్సు ధ్రువపత్రం పొందాల్సిందే. లేకుంటే వారికి విక్రయాలు చేసే అవకాశం ఉండదు. కట్టుదిట్టమైన శిక్షణ.. తదుపరి డిప్లొమా కోర్సు ధ్రువపత్రం, ఆపై రైతులకు విక్రయిస్తున్న వాటిపై నిఘా వంటి ప్రత్యేక కార్యాచరణ ఉండనుంది. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) నేతృత్వంలో డిప్లొమా కోర్సు నిర్వహించనున్నారు. గతంలో జమ్మికుంట కేవీకేలో పలువురు డీలర్లకు ఈ కోర్సు శిక్షణ జరగగా ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలను సవరించింది. రైతు శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇచ్చి, ధ్రువపత్రం ఇవ్వనున్నారు. డీలర్లు ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని రైతు శిక్షణ కేంద్రం ఏడీ ప్రియదర్శిని తెలిపారు.

48 వారాలపాటు శిక్షణ

డీలర్లకు ఏడాదిపాటు శిక్షణనివ్వనున్నారు. వారంలో ప్రతి ఆదివారం తప్పనిసరిగా హాజరుకావాలి. కృషి భవన్‌ను శిక్షణకు వేదికగా నిర్ణయించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోనే డిప్లొమా కోర్సు శిక్షణ ఉండాలని కేంద్రం నిర్దేశించగా తదనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రైతు శిక్షణ కేంద్రం ఏడీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. శిక్షణలో 48 ఆదివారాలు తరగతి గదిలో దుక్కుల నుంచి విత్తనాలు, సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం, పురుగు మందులు వాటి దుష్పరిణామాలు, అసలు వాటిని వేటి కోసం తయారు చేశారు, వేటికి వాడుతున్నారు, భూసార పరీక్షలు.. ఫలితం ఆధారంగా వాటికి అందాల్సిన పోషకాలు వంటి సమగ్ర అంశాలను వివరించనున్నారు. మిగతా 8 వారాలు క్షేత్రస్థాయి శిక్షణ ఉండనుంది. వివరాలకు 81796 49595 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఏడీ సూచించారు.

ఒక్కో బ్యాచ్‌కు 40 మంది..

విత్తనాలు, క్రిమిసంహారక మందులు, ఎరువుల విక్రయ డీలర్లకు డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ టు ఇన్‌పుట్ డీలర్స్(డీఏఈఎస్ఐ) డిప్లొమా కోర్సుకు ఒక్కో బ్యాచ్‌కు 40 మందిని ఎంపిక చేయనున్నారు. లైసెన్స్ పొందిన డీలర్ల నుంచి మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖలోని రైతు శిక్షణ కేంద్రం కార్యాలయంలో అర్జీ అందజేయాలి. దుకాణం ఎవరి పేరు మీద ఉంటే వారే దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా డీలర్ల లైసెన్స్ ప్రతిని సంబంధిత ఏడీఏ ధ్రువీకరణతో సమర్పించాలి. దరఖాస్తుదారు తప్పకుండా పదో తరగతి ఉత్తీర్ణుడై ఉండాలి. గెజిటెడ్ అధికారి సంతకంతో ప్రతిని జత చేయాలి. ఎంపికైన అభ్యర్థులు రూ.10 వేలు డీడీ చెల్లించి, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు అందజేయాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

పరీక్షల్లో ఉత్తీర్ణులవ్వాలి..

ఏదో మొక్కుబడిగా కాకుండా సమగ్ర అవగాహన కలిగేలా కోర్సును ఏర్పాటు చేశారు. కాలక్షేపం చేస్తే సదరు డీలర్‌కు ఇబ్బందులు తప్పవు. 48 వారాల కోర్సు పూర్తయ్యాక పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతీ అంశంపై పట్టు సాధించాల్సిందే. ప్రతి పరీక్షలో ఉత్తీర్ణుడైతేనే ధ్రువపత్రం ఇవ్వనున్నారు.

15 వరకు ఫెసిలిటేటర్ నియామకానికి గడువు

శిక్షణకు ఫెసిలిటేటర్‌ను నియమించేందుకు ఆత్మ ఒక ప్రకటన విడుదల చేసింది. బీఎస్సీ(అగ్రికల్చర్) లేదా ఎంఎస్సీ అగ్రికల్చర్ చదివి, వ్యవసాయశాఖ లేదా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కేవీకేలో 20 ఏళ్ల అనుభవం ఉన్నవారిని ఫెసిలిటేటర్‌గా నియమించాలని ప్రభుత్వం నిర్దేశించింది. వీరికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15 వరకు గడువు ఇచ్చారు. ప్రతి ఆదివారం జరిగే శిక్షణలో శాస్త్రవేత్తలు, నిపుణులతో తరగతులు నిర్వహించడం ఫెసిలిటేటర్ విధి.

పోలీస్ అధికారుల బదిలీ



కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్

కరీంనగర్‌క్రైం: రాష్ట్ర వ్యాప్తంగా 26 మంది పోలీస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ టౌన్ ఏసీపీగా పని చేస్తున్న తుల శ్రీనివాసరావును గోదావరిఖని ఏసీపీగా, జైపూర్ ఏసీపీగా ఉన్న గోపతి నరేందర్ కరీంనగర్ టౌన్ ఏసీపీగా, గోదావరిఖని ఏసీపీగా ఉన్న గిరిప్రసాద్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని, రామగుండం ఎస్‌బీ ఏసీపీగా పని చేస్తున్న మోహన్ బలుసానిని జైపూర్ ఏసీపీగా, నిర్మల్ డీఎస్పీగా పని చేస్తున్న ఎల్.జీవన్‌రెడ్డిని హుజూరాబాద్ ఏసీపీగా, హుజూరాబాద్ ఏసీపీ కె.వెంకట్‌రెడ్డిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని, కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ–2గా పని చేస్తున్న సత్యనారాయణను మహబూబాబాద్ డీఎస్పీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నాయీబ్రాహ్మణులను ఆదుకోవాలి

విద్యానగర్: నాయీబ్రాహ్మణ వృత్తిలో కార్పొరేట్ సంస్థల ప్రవేశంతో కులవృత్తిదారులు నష్టపోకుండా ఆదుకోవాలని నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరిప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం కరీంనగర్‌లోని జిల్లా నాయీ బ్రాహ్మణ విద్యార్థి వసతిగృహంలో ఐక్యవేదిక జిల్లాస్థాయి సమావేశంలో మాట్లాడారు. నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం రూ.లక్ష సాయాన్ని బీసీ బంధు కింద ఇవ్వడం అభినందనీయమన్నారు. ఐక్యవేదిక కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నర్సయ్య, ప్రధానకార్యదర్శి వెంకటస్వామి, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రహరీ తొలగించాలని నోటీసులు



నోటీస్ అతికించిన పంచాయతీ సిబ్బంది

కరీంనగర్‌రూరల్: మండలంలోని బొమ్మకల్‌లో సర్వేనంబరు–132/డిలో అక్రమంగా నిర్మించిన ప్రహరీని తొలగించాలంటూ బుధవారం పంచాయతీ కార్యదర్శి హిదైతుల్లా నోటీసులు జారీచేశారు. ఈసందర్భంగా పంచాయతీ సిబ్బంది నోటీసును ప్రహరీకి అంటించారు. 15 మందికి చెందిన ప్లాట్ల స్థలాన్ని ఆక్రమించి పంచాయతీ అనుమతి లేకుండా అక్రమంగా ప్రహరీ నిర్మించారంటూ వెంకన్న పటేల్‌తోపాటు 15 మంది మంగళవారం ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హిదైతుల్లాకు ఫిర్యాదుచేశారు. ఈమేరకు పంచాయతీ కార్యదర్శి ప్రహరీ తొలగించాలంటూ సదరు నిర్మాణదారుడికి నోటీసులు జారీచేశారు. నోటీస్ అందిన వెంటనే ప్రహరీ తొలగించాలని లేకుంటే పంచాయతీ ఆధ్వర్యంలో తొలగిస్తామని నోటీస్‌లో పేర్కొన్నారు.

వ్యక్తికి మూడురోజుల జైలు

కరీంనగర్‌క్రైం: మద్యంతాగి వాహనం నడుపుతున్న వ్యక్తి పోలీసులకు పట్టుబడడంతో బుధవారం కోర్టు మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ సీఐ పర్స రమేశ్ తెలిపారు. మద్యంతాగి పట్టుబడిన 9మందిపై కేసులు నమోదుచేసి కోర్టులో ప్రవేశపెట్టారు. అధిక మోతాదులో మద్యంతాగి వాహనం నడిపిన సిద్దిపేటకు చెందిన సోమేశ్వర్‌కు మూడు రోజుల జైలుశిక్ష విధించగా 8మందికి రూ.11వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

వేతనాలు ఇప్పించాలని ఆసుపత్రి ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో 12 ఏళ్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారికి రెండునెలల వేతనాలు ఇవ్వాలని, రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆసుపత్రి ఎదుట సిబ్బంది నిరసన తెలిపారు. అనంతరం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్, ఆర్‌ఎంవో డాక్టర్ జ్యోతిని కలిసి వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ సభ్యులు ఆశీష్, జవ్వాజి హరికృష్ణ, సంతోష్, వందన, మునీర్, శ్రీదేవి, సొమిడి హరీశ్, నవత, శ్రీకాంత్, మనోహర్, ప్రవీణ్, శిరీష, రమేశ్, రవీందర్, శ్రీనాథ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు శిక్ష తప్పదు



మాట్లాడుతున్న మేయర్ వై.సునీల్‌రావు

కరీంనగర్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో రైతులు ఆనందంగా ఉన్నారని, దేశానికే ఆదర్శంగా రైతుసంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలతో ముందుకు వెళ్తున్న బీఆర్‌ఎస్‌ను చూసి ఓర్వలేక పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉచిత కరెంట్‌పై, వ్యవసాయంపై మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో పెన్షన్ల పెంపు, సాగు, తాగునీరు అందించడం, విద్య, వైద్యానికి సంబంధించి సంచలనాత్మక నిర్ణయాలతో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుంటే కాంగ్రెస్ నేతలకు నిద్రపట్టడం లేదన్నారు. రైతులపై రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు గంట కళ్యాణి, గుగ్గిల్ల జయశ్రీ, తోట రాములు, నేతికుంట యాదయ్య, దిండిగాల మహేశ్, భూమాగౌడ్, ఐలేందర్ యాదవ్, బుచ్చిరెడ్డి, వాల రమణరావు, శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వింధ్యావాలీలో బోనాలు



పోతరాజుల వేషధారణలో విద్యార్థులు

సప్తగిరికాలనీ: కరీంనగర్ మెహర్‌నగర్‌లోని వింధ్యావాలీ పాఠశాలలో బుధవారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు పోతురాజుల వేషధారణలో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బోనం వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. వేడుకల్లో పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ పృథ్వీరావ్, ప్రిన్సిపాల్ ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వంతెన పనులకు బ్రేక్..

- నెలలు గడుస్తున్నా పురోగతి శూన్యం
- అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ అలసత్వం.. బిల్లుల కోసం నిరీక్షణ?
- రైతులు, ప్రజలకు తప్పని ఇబ్బందులు
- వర్షాకాలంలో వంతెన నిర్మాణంపై అనుమానాలు
- కొత్తపల్లి చెరువు కట్ట వంతెన నిర్మాణంపై అలసత్వపు జాడలు

కొత్తపల్లి: ప్రజలకు చక్కని రవాణావ్యవస్థ అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో ప్రభుత్వం కృషిచేస్తుంటే వాటికి తూట్లు పొడుస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారుల అలసత్వం.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో చేపట్టిన అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు, కాంట్రాక్ట్ కంపెనీలు పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేయడంతో రైతులు, ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. పనులను సకాలంలో పూర్తిచేయించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో స్థానికంగా సమస్యకు దారితీస్తోంది. అయితే చేసిన పనులకు ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఏదేమైనా పనులు చేపట్టాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లపైనే ఉందనే వాదన ప్రజల నుంచి వినిపిస్తోంది.



కొత్తపల్లిలో నిలిచిన వంతెన నిర్మాణ పనులు

కొత్తపల్లిలోని కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి నుంచి పద్మానగర్–వేములవాడ ప్రధాన రహదారిని కలుపుతూ మల్కాపూర్ మీదుగా చింతకుంట వరకు రోడ్డు నిర్మాణంతో పాటు వంతెన నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టారు. అయితే కొత్తపల్లి–మల్కాపూర్–చింతకుంట రోడ్డు పనులు నిలిచిపోగా ..అదే దారిలో వంతెన నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. దీంతో స్థానికంగా ఉండే రైతులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సగం పనులు చేపట్టి వదిలేయడంతో ప్రయాణానికి ఆటంకం ఏర్పడుతోంది.

నిలిచిన వంతెన పనులు

కొత్తపల్లి(హెచ్) చెరువు కట్టను అనుసంధానిస్తూ రూ.2.60 కోట్లతో నిర్మిస్తున్న వంతెన పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో ప్రయాణానికి ఆటంకం కలుగుతోంది. అసలే వర్షాకాలం..ఆపై వరదలు వస్తే అటువైపు వెళ్లే రైతులు, ప్రయాణికులకు మార్గం లేకుండా పోయే పరిస్థితి ఉంది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం.. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు అలసత్వం వహిస్తుండడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేయడం అటుంచితే..ఏళ్ల తరబడి పనులు చేపట్టకపోవడం స్థానిక ప్రజలను ఆగ్రహానికి గురిచేస్తోంది. ప్రస్తుత వర్షాకాలంలో వరదలు వస్తే పొలం పనులకు వెళ్లే రైతులకు మార్గం కష్టతరం కానుండగా.. వంతెన పనులు చేపట్టడం కూడా కష్టంగానే మారనుంది. ఇప్పటికైనా పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ వంతెన, రోడ్డుపనులు పూర్తయితే మల్కాపూర్, చింతకుంట గ్రామాలకు దూరం తగ్గి రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు రాక పనులు అర్ధాంతరంగా నిలిపివేసినట్లు చర్చ జరుగుతోంది.

ప్రభుత్వానికి చెడ్డపేరు

ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడితే వాటిని దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తుండడం, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. కొత్తపల్లి చెరువు వద్ద వంతెన, మల్కాపూర్, చింతకుంట రోడ్డు పనులు ఏళ్ల తరబడిగా నిలిచి రైతులు, ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నా అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరం. పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వాసాల రమేశ్, కౌన్సిలర్

త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు

కొత్తపల్లి చెరువు వద్ద చేపడుతున్న వంతెన పనులు త్వరలో ప్రారంభించేలా ఉన్నతాధికారులకు నివేదిస్తా. లేబర్ల కారణంగా పనులు చేపట్టలేకపోతున్నట్లు కాంట్రాక్టర్ చెబుతున్నాడు. ఈ విషయమై ఉన్నతాధికారుల సూచనలతో కాంట్రాక్టర్లు వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. చింతకుంట–కొత్తపల్లి(హెచ్) వయా మల్కాపూర్ బీటీ రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– పి. సచిన్ ఏఈ, పీఆర్

రూ. 30 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా

- మరో 15 ఎకరాలు కబ్జాకు యత్నం
- పట్టించుకోని అధికారులు
- కార్పొరేటర్ శ్రీనివాస్ ఆరోపణ



మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్

విద్యానగర్: కరీంనగర్ నగరపాలక సంస్థ ఒకటో డివిజన్ పరిధిలో 120/342, 120/343, 120/343 సర్వే నంబర్లలోని 2.25 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నా అధికారుల పట్టించుకోవడం లేదని డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ ఆరోపించారు. బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కబ్జాకు గురైనా భూమి విలువ ప్రస్తుత మార్కెట్ ధర రూ.30 కోట్లకు ఉంటుందన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వభూమిని రక్షించి ప్రభుత్వాధీనంలోకి తీసుకోవాలన్నారు. మూడేళ్లుగా ఈస్థలం అన్యాక్రాంతమైందని కలెక్టర్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. వేగిని లింగయ్య అనే మాజీ సైనికుడి పేరుతో కొందరు ఈ భూమిని కబ్జాచేసేందుకు యత్నిస్తున్నారన్నారు. సమాచార హక్కు చట్టంతో 2021లో జిల్లా సైనిక సంక్షేమ శాఖ నుంచి మాజీ సైనికుడు లింగయ్య వివరాలు కోరగా, అతనికి ఎక్కడా ప్రభుత్వభూమి కేటాయించలేదని రిటైర్మెంట్ తర్వాత సైనికులు ప్రభుత్వ భూమి పొందడానికి అర్హులు కాదని సమాధానం ఇచ్చారన్నారు. లింగయ్య పేరుతో తప్పుడుపత్రాలు సృష్టించి రెండెకరాల భూమి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని ఇందులో స్థానిక అధికార పార్టీ నాయకుడి పాత్ర కీలకంగా ఉందన్నారు. గతంలో లింగయ్య పేరిట నగునూర్ జీపీ పరిధిలోని సర్వేనంబర్ 669/2లో 1.20 గుంటల భూమిని తప్పుడు పత్రాలతో కబ్జాచేశారని, తిమ్మాపూర్ మండలంలోని మన్నెంపల్లిలో కూడా లింగయ్య పేరుపై 2.25 ఎకరాల భూమిని పొందినట్లు సమాచార హక్కుచట్టం ద్వారా వివరాలు తీసుకున్నామన్నారు. లింగయ్య పేరిట ఇప్పటి వరకు తీసుకున్న స్థలాలపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ స్థలం కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తీగలగుట్టపల్లి జీపీ పరిధిలోని సర్వేనంబర్ 103లోని 15 ఎకరాల శిఖం భూమిని సైతం కబ్జా చేసేందుకు కొందరు యత్నిస్తున్నారని ఈ శిఖం భూమికి హద్దులు నిర్ణయించి కబ్జాకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పాదం శివరాజు, కైలాస నవీన్, బారి జితేందర్, బత్తిని మహేశ్, బొద్ల శ్రీరాములు, జిడిగె సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

- పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత
- దుర్శేడ్ సబ్‌స్టేషన్ ఎదుట కాంగ్రెస్ ధర్నా



సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



సీఎం దిష్టిబొమ్మను తొలగిస్తున్న పోలీసులు

కరీంనగర్‌రూరల్: ఉచిత విద్యుత్ పేరుతో రైతులను మోసగిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా బుధవారం దుర్శేడ్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా ఉద్రిక్తతకు దారి తీసింది. పీసీసీ ఆదేశాలతో సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించి చేపట్టిన ఆందోళనలో కరీంనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు మెన్నేని రోహిత్‌రావు పాల్గొని మాట్లాడారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ కృషిచేస్తోందని వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. మంత్రి హోదాలో ఉన్న గంగుల కమలాకర్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బొమ్మకు ఉరివేయడం హేయమన్నారు. త్వరలోనే మంత్రి కమలాకర్‌కు గుణపాఠం చెబుతామన్నారు. అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనానికి కార్యకర్తలు యత్నించగా రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి కొంత ఉద్రిక్తత నెలకొంది. చివరకు పోలీసులు మంటల్లో కాలుతున్న కేసీఆర్ దిష్టిబొమ్మను తొలగించి మంటలు ఆర్పివేశారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి రహమత్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, మండల అధ్యక్షుడు సాయిల్ల రాజు, కిసాన్‌సెల్ అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భవన్ ఎదుట కాంగ్రెస్ ధర్నా


కొత్తపల్లి: విద్యుత్ అంశంపై పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరిస్తూ కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేయడాన్ని నిరసిస్తూ కరీంనగర్ విద్యుత్ భవన్ ఎదుట కాంగ్రెస్ శ్రేణులు ధర్నాచేపట్టారు. అంతకముందు కేసీఆర్ దిష్టిబొమ్మ దహనాన్ని పోలీసులు అడ్డుకోగా మరో బొమ్మను దహనం చేశారు. అనంతరం విద్యుత్ భవన్ ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పీసీసీ చీఫ్ వ్యాఖ్యలను వక్రీకరిస్తూ రైతులను తప్పుదోవ పట్టించాలనే కేసీఆర్, కేటీఆర్ దుర్మార్గపు ఆలోచనలను తిప్పికొడతామన్నారు. రైతుల పట్ల బీఆర్‌ఎస్‌కు చిత్తశుద్ధి లేదని, తొమ్మిదేళ్లుగా రుణమాఫీ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఉచిత విద్యుత్‌ను ప్రారంభించిందే కాంగ్రెస్ అని ఆ పార్టీపై నిందలు వేస్తే ఊరుకోమన్నారు.

అంబేడ్కర్‌నగర్ సబ్‌స్టేషన్ ఎదుట..

కరీంనగర్‌లోని అంబేడ్కర్ సబ్‌స్టేషన్ ఎదుట పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ధర్నా చేపట్టారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. పీసీసీ రాష్ట్ర నాయకుడు రహమత్ హుస్సేన్, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల బంద్ విజయవంతం



నిరసన తెలుపుతున్న యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కరీంనగర్: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ కార్పొరేట్ విద్యను పెంచి ప్రోత్సహిస్తోందని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బంద్‌లో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని మన ఊరు– మనబడి పనులను సమీక్షించి పనులు పూర్తిచేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బంద్, నిరసనలో యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గణేశ్, సాయిభాను పాల్గొన్నారు. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాలలు, జూనియర్ కళాశాలల బంద్ సందర్భంగా ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌చేయగా ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థుల వద్దకు వెళ్లి గేట్ మీటింగ్స్ ఏర్పాటుచేసి తరగతులు బహిష్కరించి నగరంలో బైక్‌ర్యాలీ తీశారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ఖాళీ పోస్టులు భర్తీచేయాలని, ప్రభుత్వ విద్యను పరిరక్షించి, విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కరించాలని, ప్రైవేట్ విద్యా వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల ఆగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, పి డి ఎస్ యూ జిల్లా అధ్యక్షులు రత్నం రమేష్,రణ ప్రతాప్, అంగడి కుమార్ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు అరవింద్, ఏఐఎస్‌బీ రాష్ట్ర నాయకుడు అతికం రాజశేఖర్, వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మామిడిపల్లి హేమంత్,రోహిత్,నునవత్ శ్రీనివాస్,మొలుగూరి హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

సప్తగిరికాలనీ: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు రిపబ్లికన్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు సతీశ్‌కుమార్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అనుమతి లేని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఎన్నో ఉన్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేయకపోవడంతో ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

విద్యానగర్: శాతవాహన యూనివర్సిటీలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని కాంట్రాక్ట్ అధ్యాపకులు డిమాండ్ చేశారు బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో శాతవాహన కాంట్రాక్ట్ అధ్యాపకుల జేఏసీ చైర్మన్ యశ్వంతరావు హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ఈనెల 15న హైదరాబాద్‌లో రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నాకు రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్‌టైం టీచర్లు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో శాతవాహన కాంట్రాక్ట్‌అధ్యాపకుడు జేఏసీ కన్వీనర్ ఎం.మనోజ్‌కుమార్, కో కన్వీనర్ కే.రాజు, కాంట్రాక్ట్ లెక్చరర్స్ పి.కృష్ణకుమార్, కె.తిరుపతి, విజయప్రకాశ్, విజయ్‌కుమార్, రమేశ్‌రెడ్డి, శ్రీశైలం, భాగ్యలక్ష్మి, జోసెఫ్, రాజు, పర్శురాములు, రవికుమార్, నరసింహమూర్తి, గణేశ్, మధు పాల్గొన్నారు.

స్వీపర్లను పర్మినెంట్ చేయాలి



మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

కరీంనగర్: ప్రభుత్వ స్వీపర్లకు జీతాలు పెంచాలని, పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్ స్కూల్ స్వీపర్ల సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట రిలేదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో 40 ఏళ్లుగా నెలకు రూ.5,200 వేతనంతో స్వీపర్లుగా పనిచేస్తున్నారన్నారు. ఏపీలో రూ.19వేలు ఇస్తున్నారన్నారు. స్వీపర్లను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం మంజూరు చేయాలని కోరారు. అర్హతను బట్టి స్వీపర్స్‌కు ప్రమోషన్స్ ఇచ్చి పాఠశాలలో ఖాళీగా ఉన్న ఆఫీస్ సబార్డినేట్, అటెండర్ పోస్టులను భర్తీచేయాలని, శ్రీ ఏపీఎస్ రెడ్డి హైపవర్ కమిషన్ సిఫారసులను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీక్షలో జిల్లా అధ్యక్షుడు ఎడవెల్లి రాజమల్లు, ప్రధానకార్యదర్శి పాండ్రాల రమేశ్, జిల్లా కోశాధికారి సందవేని మొండయ్య, నాయకులు శంకరయ్య, అలీం, భూమయ్య, రాజమల్లు, లింగయ్య, రాములు, రాజవీరు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల ‘ఛలో హైదరాబాద్’



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎస్ నాయకులు

కరీంనగర్: సీపీఎస్ పెన్షన్ స్కీం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పాత పెన్షన్ పునరుద్ధరించాలని అభినహి తో కబీనహి అనే నినాదంతో రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 33 జిల్లాల గుండా పాత పెన్షన్ సాధన సంకల్పయాత్ర, ఆగస్టు 12న ఛలో హైదరాబాద్ నిర్వహిస్తున్నామని జిల్లా బాధితులు గోనెశివరాం, సంతోష్, బోయిని తిరుపతి తెలిపారు. జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పురాతన పాఠశాల ఆవరణలో ‘ఛలో హైదరాబాద్’ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటకం రమేశ్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముస్కు తిరుపతిరెడ్డి, టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నందికొండ విద్యాసాగర్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్‌రెడ్డి, డాక్టర్ రవి, ప్రవీణ్‌రెడ్డి డాక్టర్ అనితరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి సీహెచ్ అశోక్‌రావు, తాటిపల్లి రాజమల్లు, భాను ప్రకాశ్, అనిల్, సలీం, లక్ష్మీపతి, మురళి పాల్గొన్నారు.

రాజీవ్‌రహదారిపై రాస్తారోకో



చింతకుంటలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



రాజీవ్ రహదారి గోపాల్‌పూర్ చౌరస్తాలో..

- రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం
- గ్రామ గ్రామాన బీఆర్‌ఎస్ ఆందోళనలు..రాస్తారోకో

కరీంనగర్‌రూరల్: ఉచిత విద్యుత్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం కరీంనగర్ మండలంలోని చామనపల్లి, బొమ్మకల్, ఇరుకుల్ల, చెర్లభూత్కూర్, చేగుర్తి తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేశారు. రాజీవ్‌రహదారిలోని గోపాల్‌పూర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలు చేశారు. ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ఆరోపిస్తు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

కాంగ్రెసోల్లు మా ఊరికి రావొద్దు...

కొత్తపల్లి: బీఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్ కరెంట్ లొల్లి తీవ్రస్థాయికి చేరింది దీంతో బీఆర్‌ఎస్ శ్రేణులు కాంగ్రెసోళ్లు మా ఊర్లోకి రావద్దంటూ కొత్తపల్లి మండలంలోని ప్రతీ గ్రామశివారులో బ్యానర్లు ఏర్పాటుచేశారు. కొత్తపల్లి మండలంలోని చింతకుంట, మల్కాపూర్,కమాన్‌పూర్,బద్దిపల్లి,నాగులమల్యాల ఖాజీపూర్, బావుపేట, ఎలగందుల గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేశారు. కొత్తపల్లి(హెచ్) పట్టణంలోని కరీంనగర్–జగిత్యాల రహదారిపై బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం కలిగింది.

నూతన కార్యవర్గం

కరీంనగర్‌అర్బన్: కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు నూతన పాలకవర్గాన్ని రాష్ట్ర సహకార శాఖ నియమించింది. అధ్యక్షుడిగా అదనపు కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్‌లాల్, ఆర్గనైజర్‌గా జిల్లా సహకార అధికారి, పర్సన్ ఇన్‌చార్జి సభ్యులుగా దిండిగాల మహేశ్, చంద్రశేఖర్‌రావు, సూర్యశేఖర్,అర్ష మల్లేశం, ఎడబోయిన శ్రీనివాస్‌రెడ్డి,రాజశేఖర్,వీరారెడ్డిని ఎన్నుకున్నట్లు అర్బన్ బ్యాంకు సీఈవో తెలిపారు.

తెయూలో మరోసారి విజిలెన్స్ విచారణ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం మరోసారి విచారణ జరిపారు. ఉదయం 11.30 గంటలకు క్యాంపస్‌కు చేరుకున్న అధికారులు సాయంత్రం 5.30 గంటల వరకు ఇద్దరు మాజీ రిజిస్ట్రార్లతో పాటు మరో 8 మందిని తెయూ పరిపాలనా భవనంలోని ఎగ్జిక్యూటివ్ హాల్‌లో సుదీర్ఘంగా విచారించారు. వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్‌గుప్తా అక్రమాలకు సహకరించారని ఆరోపణలున్న మాజీ ఇంచార్జి రిజిస్ట్రార్లు ప్రొఫెసర్ కనకయ్య, ప్రొఫెసర్ విద్యావర్ధినితో పాటు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎం.అరుణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు సాయాగౌడ్, విజయలక్ష్మి, సూపరింటెండెంట్ భాస్కర్ (అకౌంట్ సెక్షన్), అసిస్టెంట్ ఇంజనీర్ వినోద్, సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కవిత తోరణ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ శాంతాబాయిలను విజిలెన్స్ అధికారులు విచారించారు. వీసీ చేసిన అక్రమ పదోన్నతులు, నియామకాలు, విచ్చలవిడి కొనుగోళ్లు, చెల్లింపులు, నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. ప్రభుత్వ ఆదేశాల మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జూన్ 6న మొదటిసారి దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే.

ఎంసీసీ కంపెనీ ఆస్తుల అటాచ్‌మెంట్

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని మంచిర్యాల సిమెంటు కంపెనీ(ఎంసీసీ) ఆస్తులను టీఎస్ఎన్‌పీడీసీఎల్ అధికారులు బుధవారం అటాచ్‌మెంట్ చేసుకున్నారు. టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ శేషారావు, డీఈఈ కైసర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిమెంట్ కంపెనీ రూ.10.30 కోట్లు విద్యుత్ బిల్లులు బకాయి పడింది. పలుమార్లు నోటీసులు జారీ చేసినా యాజమాన్యం స్పందించలేదు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం తెలంగాణ రెవెన్యూ రికవరీ యాక్టు 1864 ప్రకారం కంపెనీలోని యంత్రపరికరాలు, భవనాలతోపాటు 184 ఎకరాల 28 గుంటల భూమిని స్థానిక తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, ఎన్‌పీడీసీఎల్ తహసీల్దార్ ప్రసాదరావులు ఎంసీసీ అధికారుల సమక్షంలో అటాచ్‌మెంట్ చేశారు. కాగా, ఎంసీసీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు ముఖేష్‌గౌడ్ మాట్లాడుతూ.. కంపెనీకి చెందిన విలువైన ఆస్తులను యాజమాన్యం ఇప్పటికే అమ్ముకుందని, కంపెనీ మూసివేసి కార్మికులకు అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎంసీసీ ఆస్తులను స్వాధీనం చేసుకుని, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

ఇంటిదొంగ 'ఈశ్వరన్' ఔట్

అవినీతి ఊబిలో చంద్రబాబు సింగపూర్ స్నేహితుడు

- 'సీపీఐబీ'విచారణకు ఆదేశించిన సింగపూర్ ప్రధాని
- రవాణా శాఖ మంత్రిగా తొలగింపు
- ఈశ్వరన్‌ను ముందుపెట్టి బాబు అంతర్జాతీయ డ్రామా
- ఏకంగా సింగపూర్ ప్రభుత్వంతోనే ఒప్పందం కుదుర్చుకున్నట్లుగా ప్రచారం
- అమరావతి స్టార్టప్ ఏరియాలో రూ.లక్ష కోట్ల దోపిడీకి స్కెచ్


తన స్నేహితుడైన సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌ను సత్కరిస్తున్న చంద్రబాబు(ఫైల్)

సాక్షి, అమరావతి: పీకల్లోతు అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన సింగపూర్ సీనియర్ మంత్రి, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు స్నేహితుడు ఎస్.ఈశ్వరన్‌పై అక్కడి అత్యున్నత దర్యాప్తు సంస్థ సీపీఐబీ (కరప్ట్ ప్రాక్టీసెస్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో) విచారణ ప్రారంభించింది. సింగపూర్ రవాణా శాఖ మంత్రిగా ఉన్న ఎస్.ఈశ్వరన్ తీసుకున్న నిర్ణయాల వల్ల దేశానికి భారీ ఎత్తున నష్టం వాటిల్లినట్లు సీపీఐబీ గుర్తించింది. అత్యంత తీవ్రమైన అవినీతికి పాల్పడిన మంత్రి ఈశ్వరన్‌ను విచారించేందుకు అనుమతి ఇవ్వాలని సింగపూర్ ప్రధాని లీని సీపీఐబీ డైరెక్టర్ డెనిస్ టాంగ్ ఈనెల 5వతేదీన కోరారు. దీనిపై తక్షణమే స్పందించిన సింగపూర్ ప్రధాని ఈనెల 6న అనుమతి ఇచ్చారు. ఈనెల 11న సీపీఐబీ విచారణ ప్రారంభించడంతో ఈశ్వరన్‌ను తాజాగా మంత్రి పదవి నుంచి సింగపూర్ ప్రధాని తప్పించారు.

అమరావతి పేరుతో అంతర్జాతీయ నాటకం..
రాష్ట్ర విభజన నేపథ్యంలో 2014 ఎన్నికల్లో కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాటి సంక్షోభాన్ని అవకాశంగా మల్చుకుని సింగపూర్ ప్రభుత్వ సహకారంతో దేవతల రాజధాని అమరావతిని తలదన్నే రీతిలో నూతన నగరాన్ని నిర్మిస్తానంటూ నమ్మబలికారు. రాజధానిని ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారనే అంశంపై వందిమాగధులకు లీకులిచ్చి భారీ ఎత్తున భూములను కాజేశారు. ఆ తర్వాత తాపీగా రాజధాని ప్రాంతాన్ని ప్రకటించారు. సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌ను ముందు పెట్టి గ్రాఫిక్స్ చూపిస్తూ అందరినీ మభ్యపుచ్చారు. ఈ క్రమంలో రాజధాని స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు ముసుగులో సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌తో కలిపి రూ.లక్ష కోట్లు స్వాహా చేసేందుకు స్కెచ్ వేశారు.

సింగపూర్ ప్రభుత్వంతోనే ఒప్పందం అన్నట్లుగా
రాజధానిలో 1,691 ఎకరాల్లో స్టార్టప్ ఏరియా ప్రాజెక్టుకు సంబంధించి స్విస్ చాలెంజ్ విధానాన్ని తుస్సుమనిపించి ఇతర కంపెనీలేవీ బిడ్లు దాఖలు చేయకుండా సింగపూర్ సంస్థలు అసెండాస్–సిన్‌బ్రిడ్జి–సెంబ్‌కార్ప్ కన్సార్టియంకి కట్టబెడుతూ 2017 మే 2న నాటి చంద్రబాబు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఆ సంస్థల కన్సార్టియంకు స్టార్టప్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రాజెక్టును అప్పగిస్తూ 2017 మే 12న ఈశ్వరన్‌తో చంద్రబాబు ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో రాజధాని నిర్మాణం కోసం ఏకంగా సింగపూర్ ప్రభుత్వంతోనే ఒప్పందం కుదుర్చుకున్నట్లు చంద్రబాబు ప్రచారం చేసుకున్నారు. ఆ ప్రాజెక్టులో పెట్టుబడి సహా మౌలిక సదుపాయాల కల్పనకు రూ.5,721.9 కోట్లు వెచ్చించే రాష్ట్ర ప్రభుత్వం వాటా 42 శాతం కాగా కేవలం రూ.306.4 కోట్లు పెట్టుబడి పెట్టే సింగపూర్ కంపెనీల కన్సార్టియం వాటా 58 శాతం కావడం గమనార్హం. కన్సార్టియం, రాష్ట్ర ప్రభుత్వం తరపున అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీ) కలిసి 15 ఏళ్లలో మూడు దశల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసి.. రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా గ్రాస్ టర్నోవర్‌లో మొదటి విడత 5 శాతం, రెండో విడత 7.5 శాతం, మూడో విడత 12 శాతం (సరాసరి 8.7%) ఆదాయం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తే సరిపోతుందని నాటి చంద్రబాబు కేబినెట్ అంగీకరించింది. ఈ ముసుగులో రూ.లక్ష కోట్లకుపైగా దోచుకోవడానికి స్కెచ్ వేశారు.

అక్రమాల ఒప్పందం రద్దు..

గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించడంతో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో అసెండాస్–సిన్‌బ్రిడ్జి–సెంబ్‌కార్ప్ కన్సార్టియంతో తమ ప్రభుత్వానికి సంబంధం లేదని సింగపూర్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో ఈ ఒప్పందం రద్దు అయింది.

54 వేల ఎకరాల భూ పంపిణీ

- రైతులుగా మారనున్న 46,935 మంది భూమి లేని నిరుపేదలు
- అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కుల కల్పన
- సీఆర్డీయే పరిధిలో 24న ఇళ్ల నిర్మాణ పనులకు గ్రీన్ సిగ్నల్
- దేవాలయాల్లో పనిచేసే అర్చకులకు నో రిటైర్మెంట్
- దేవాదాయ శాఖ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు
- ఏపీ సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నిరుపేదలు, అసైన్డ్, సర్వీస్ ఈనామ్, లంక భూముల రైతులకు భారీ మేలు చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. తద్వారా భూములకు సంబంధించి గతంలో ఏ ప్రభుత్వం చేయనంత మేలు రైతులకు చేకూరనుంది. ఈ నిర్ణయాలకు సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన బుధవారం తాత్కాలిక సచివాలయంలో నిర్వహించిన కేబినెట్ సమావేశంలో మంత్రి మండలి ఆమోదం తెలిపింది. దివంగత సీఎం వైఎస్సార్ తర్వాత మళ్లీ భూ పంపిణీకి సీఎం జగన్ సర్కార్ సిద్ధమైంది. 54,129.45 ఎకరాలను భూమిలేని దళిత, బడుగు బలహీన వర్గాలకు చెందిన 46,935 మంది నిరుపేదలకు పంపిణీకి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అసైన్డ్ భూముల రైతులకు యాజమాన్య హక్కులను కల్పించేందుకు ఆమోదం తెలిపింది. భూమిని ప్రభుత్వం కేటాయించి (అసైన్ చేసి) 20 ఏళ్లు పూర్తయిన అనంతరం ఆ భూమిపై సంబంధిత రైతులు, వారి వారసులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది. దీంతో పట్టా భూముల రైతుల మాదిరిగానే అసైన్డ్ భూముల క్రయ, విక్రయాలకు అవకాశం ఏర్పడుతుంది. ప్రభుత్వం వాస్తవంగా ఎవరికైతే భూమిని కేటాయించిందో వారికి యాజమాన్య హక్కు దక్కుతుంది. వారు లేని పక్షంలో వారి వారసులకు హక్కులు రానున్నాయి. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలో దాదాపు 22 లక్షల మంది బడుగు, బలహీన వర్గాల వారికి ప్రయోజనం చేకూరనుంది. ఇంకా మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాల గురించి సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మీడియాకు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఆ కుల వృత్తుల వారికి శుభవార్త
మూడు కేటగిరీల్లోని 9,062 ఎకరాల లంక భూముల రైతులకు డీ పట్టాలు ఇవ్వడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. కొన్ని భూములను ఐదేళ్ల లీజు ఇవ్వడానికి అనుమతించారు. ఈ నిర్ణయంతో 19,176 మంది రైతులకు మేలు చేకూరనుంది. పేదలకు భూ పంపిణీ, లంక భూములకు డీ పట్టాలు ఇవ్వడం ద్వారా మొత్తంగా 63,191 ఎకరాలకు సంబంధించి 66,111 మందికి లబ్ధి చేకూరనుంది. గ్రామాల్లో కుల వృత్తులు చేసుకునే వారికి ఇచ్చిన సర్వీస్ ఈనామ్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. కుమ్మరి, రజక, కమ్మరి, నాయీబ్రాహ్మణ తదితర కుల వృత్తులు చేసుకునే వారికి గతంలో ఈనామ్‌గా ఇచ్చిన భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. వీటిని ఇప్పుడు ఆ జాబితా నుంచి తొలగింపు ద్వారా వారికి సర్వ హక్కులు కల్పించనున్నారు. 1,68,603.71 ఎకరాల భూములు నిషేధిత జాబితా(22ఏ) నుంచి తొలగించడం ద్వారా 1,13,610 మందికి ప్రయోజనం కలుగనుంది. 2013కు ముందే వీరందరూ రైత్వారీ పట్టాలు పొందారు. ఆ తర్వాత ఈ భూములపై ఆంక్షలను విధించారు. ఇప్పుడీ ఆంక్షలన్నీ తొలగిపోనున్నాయి. దేవాలయాల్లో పని చేస్తున్న అర్చకులు ఓపిక, శక్తి ఉన్నంత వరకు భగవంతుడి సేవలో కొనసాగేలా రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అర్చకులకు రిటైర్మెంట్ లేకుండా చట్ట సవరణ చేసేందుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. మరోవైపు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే దేవదాయ శాఖ ఉద్యోగులకు కూడా ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచేందుకు నిర్ణయించింది. 2024–25 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో కొత్తగా ఐదు వైద్య కళాశాలలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. పులివెందుల, పాడేరు, ఆదోని మెడికల్ కాలేజీలకు గత మంత్రివర్గ సమావేశంలో పోస్టులు మంజూరు చేశారు. మిగిలిన రెండు చోట్ల.. మదనపల్లి, మార్కాపురం వైద్య కళాశాలలు ప్రారంభించడానికి వీలుగా కళాశాలకు 222, బోధనాస్పత్రికి 484 చొప్పున 1,412 పోస్టుల సృష్టికి కేబినెట్ ఆమోదం తెలిపింది

నల్ల'మార్గ'ం ఉక్కిరిబిక్కిరి..!

▶ మొదటి పేజీ తరువాయి

జాతీయ బ్యాంకులు, కేంద్ర ఆర్థిక సంస్థల్లో కాకుండా మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో దాచడం సాధారణ అంశం కాదని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. జాతీయ బ్యాంకులు సేవింగ్స్ ఖాతాలపై 5 శాతం కంటే అధికంగా వడ్డీ చెల్లిస్తున్నాయి. మార్గదర్శి కేవలం 5 శాతం వడ్డీనే చెల్లించడం, అదికూడా ఓ రశీదు జారీ చేసి సరిపుచ్చుతున్నా భారీగా డిపాజిట్లు చేయడం వెనుక పెద్ద మతలబే ఉన్నట్లు స్పష్టమవుతోంది. జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ చేయాలంటే ఆ ఆదాయం ఎలా వచ్చిందో చెప్పాలి. పాన్, ఆధార్ నంబర్ ఇతర వివరాలను సమర్పించాలి. ఆర్బీఐ, ఆదాయపన్ను, సీబీడీటీ అధికారుల దృష్టిలో పడుతుంది. ఆ వివరాలేవీ వెల్లడించేందుకు సుముఖంగా లేనివారు మాత్రమే ఇతర సంస్థల్లో డిపాజిట్ చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. ఎందుకంటే వారు డిపాజిట్ చేసేదంతా నల్లధనమే కాబట్టి.

ఇదే తరహా మోసంలో సహారా చైర్మన్‌కు జైలు శిక్ష
బడాబాబుల నల్లధనాన్ని గుట్టుచప్పుడు కాకుండా దాచేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ ఓ వేదికగా మారిందన్న వాదనకు తాజా పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి. అక్రమ డిపాజిట్ల ద్వారా భారీగా నల్లధనాన్ని చలామణిలోకి తెస్తున్నట్లు స్పష్టమవుతోంది. గతంలోనూ మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట రామోజీరావు ఇలాంటి వ్యవహారాలనే సాగించినట్లు ఆర్థిక నిపుణులు గుర్తు చేస్తున్నారు. అక్రమ డిపాజిట్లు సేకరించిన సహారా పరివార్ లాంటి సంస్థలు తమ డిపాజిట్‌దారుల వివరాలను గోప్యంగా ఉంచటాన్ని ప్రస్తావిస్తున్నారు. సహారా ఇండియా అక్రమ డిపాజిట్ల వ్యవహారం గుట్టు రట్టు కావడంతో సంస్థ చైర్మన్ సుబ్రతోరాయ్‌కు న్యాయస్థానం జైలు శిక్ష విధించడం గమనార్హం. ఈ నేపథ్యంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అక్రమ డిపాజిట్‌దారులకు సీఐడీ నోటీసులు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

బుకాయించబోయి దొరికిన రామోజీ
మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో రూ.కోటి కంటే ఎక్కువ మొత్తం డిపాజిట్ చేసిన వారికి సీఐడీ నోటీసులు జారీ చేయడంతో ఈ కేసులో ఏ–1గా ఉన్న సంస్థ చైర్మన్ రామోజీరావు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. తమ డిపాజిట్‌దారులకు నోటీసులు జారీ చేయడాన్ని ఖండిస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఓ పత్రికా ప్రకటన జారీ చేసింది. తాము చిట్‌ఫండ్స్ చట్టం, ఆదాయపన్ను చట్టాన్ని సక్రమంగా పాటిస్తున్నట్లు అందులో పేర్కొంది. అయితే ఆర్బీఐ, సీబీడీటీ నిబంధనలను పాటిస్తున్నట్లు ఎక్కడా పేర్కొనకపోవడం గమనార్హం. చిట్‌ఫండ్ సంస్థలు డిపాజిట్లు సేకరించడాన్ని ఆర్బీఐ అనుమతించడంలేదు. డిపాజిట్ల సేకరణపై సీబీడీటీ కింద పన్నులు చెల్లించాలి. అలా చెల్లించినట్లు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎక్కడా చెప్పడం లేదు. ఆ విషయాన్ని కప్పిపుచ్చేందుకే ఆదాయపన్ను చట్టాన్ని పాటిస్తున్నట్లు మభ్యపుచ్చుతున్నట్లు స్పష్టమవుతోంది.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ సంతోష్
- రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం


బ్యాడ్మింటన్ ఆడుతున్న కలెక్టర్ సంతోష్


పోటీలను ప్రారంభిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

మంచిర్యాలటౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, అప్పుడే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని మంచిర్యాల జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రంగంపేటలో ఉన్న మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో బుధవారం రాష్ట్రస్థాయి అండర్–19 బ్యాడ్మింటన్ బాలబాలికల, మిక్స్‌డ్ డబుల్స్ చాంపియన్‌షిప్ పోటీలను కలెక్టర్, రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి, డీసీపీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్, రామగుండం సీపీ రెమా రాజేశ్వరి మాట్లాడుతూ రెండేళ్లపాటు కరోనా మహమ్మారితో ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారని, పిల్లలు ఆటలకు దూరమయ్యారని అన్నారు. పిల్లల్లో మళ్లీ క్రీడాస్ఫూర్తిని నింపేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. పిల్లలు చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించడం వల్ల వారిలో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెరుగుతుందని తెలిపారు. క్రీడల్లో రాణించేందుకు పేదరికం అడ్డుకాదని, ఆయా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని తెలిపారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్, మంచిర్యాల ఏసీపీలు తిరుపతిరెడ్డి, సదయ్య, బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్, మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్, డీఈవో యాదయ్య, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్, ఎస్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ చంద్రమోహన్ గౌడ్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, ట్రెజరర్ సత్యపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల క్యాంప్ ఫైర్
బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులు క్యాంప్‌ఫైర్‌ను ఏర్పాటు చేశారు. క్రీడాకారులు ఆనందోత్సాహాల మధ్య నృత్యాలు చేస్తూ అలరించారు. క్యాంప్‌ఫైర్‌ను ప్రోగ్రాం అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ గాజుల ముఖేశ్‌గౌడ్ ప్రారంభించగా, అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ షెడ్యూల్ విడుదల

- మూడేళ్ల తర్వాత జరగనున్న పాఠశాలల, కళాశాలల క్రీడాపోటీలు
- మండలం నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహణ
- ఆగస్టు మొదటి వారంలో ప్రారంభం
- ఇక మైదానాల్లో సందడే సందడి


కబడ్డీ పోటీలో తలపడుతున్న చిన్నారులు (ఫైల్)

కరీంనగర్ స్పోర్ట్స్: పాఠశాలల, కళాశాలల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఏటా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్న విషయం విదితమే. అండర్–14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో క్రీడా పోటీలను నిర్వహిస్తారు. కరోనా కారణంగా 2020 నుంచి 2023 వరకు ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు జరగలేదు. విద్యార్థులు మూడేళ్లు ఆటలపోటీలకు దూరంగా ఉండగా మంగళవారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాలల, కళాశాలల క్రీడాపోటీలకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసింది. వచ్చే నెలలో పోటీలు ప్రారంభం కానుండటంతో విద్యార్థులు ఆనందంలో మునిగిపోయారు.

పాత జిల్లాల ప్రకారమే..
పాఠశాలల, కళాశాలల క్రీడా పోటీలు గతంలో కొత్త జిల్లాల ప్రాతిపదికన జరిగాయి. రాష్ట్రస్థాయి పోటీలకు 33 జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. దీంతో పోటీల నిర్వహణ భారమైంది. ఈ సంవత్సరం నుంచి పాత పది జిల్లాల ప్రాతిపదికనే నిర్వహించనున్నట్లు షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

షెడ్యూల్ ఇదే..
- మండల స్థాయిలో క్రీడాపోటీలను ఆగస్టు మొదటి, రెండో వారంలోగా పూర్తి చేయాలి.
- కొత్త జిల్లా స్థాయిలో ఆగస్టు మూడో వారంలోగా పూర్తవ్వాలి.
- పాత జిల్లాస్థాయి పోటీలను సెప్టెంబర్ రెండో వారంలోపు పూర్తి చేయాలి.
- రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను సెప్టెంబర్ నాలుగో వారంలోపు పూర్తి చేసి, జాతీయస్థాయి పోటీలకు సిద్ధంగా ఉండాలి.

కాలేజ్ గేమ్స్ ఆడలేకపోయా

స్కూల్ గేమ్స్‌లో అండర్–14, 17 విభాగాల్లో బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ఇంటర్‌లో అండర్–19 విభాగంలో ఆడదాం అనుకున్న. కానీ ఎస్జీఎఫ్ పోటీలు జరగలేదు. ఇప్పుడు ఇంజినీరింగ్‌లోనైనా ఆడాలనుకుంటున్న.
– ఎం.సంజయ్, జాతీయ క్రీడాకారుడు

ఎదురుచూస్తున్న..

స్కూల్ గేమ్స్ ఎప్పుడెప్పుడు ప్రారంభమవుతాయా అని ఎదురుచూస్తున్న. నేను ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్నాను. అండర్–14 విభాగంలో ఆడలేకపోయా. ఇప్పుడు అండర్–17లో జూడోలో సత్తా చాటాలనుకుంటున్న.
– వెంకటేశ్, క్రీడాకారుడు

ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలి

స్కూల్ గేమ్స్ షెడ్యూల్ మూడేళ్ల తర్వాత విడుదలైంది. క్రీడాకారులు ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలి. మైదానంలో ఆటపై పట్టు సాధించేందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో సాధన చేయాలి. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా పేరు నిలబెట్టాలి.
– చల్ల హరిశంకర్, బేస్‌బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

జాతీయ షెడ్యూల్ విడుదల చేయాలి

ఎస్జీఎఫ్ పోటీలకు సంబంధించి తెలంగాణ రాష్ట్రం షెడ్యూల్ విడుదల చేయడం శుభపరిణామం. ఎందరో విద్యార్థులు ఇలాంటి పోటీల కోసం ఎదురుచూస్తున్నారు. జాతీయ ఫెడరేషన్ కూడా త్వరగా షెడ్యూల్ విడుదల చేయాలి.
– గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, జూడో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థులందరూ స్కూల్ గేమ్స్‌పై దృష్టి పెట్టాల్సిన సమయం వచ్చింది. ఎస్జీఎఫ్ క్రీడాపోటీలను సద్వినియోగం చేసుకోవాలి. ఆటల్లో రాణించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ కల్పించింది.
– నందెల్లి మహిపాల్, అథ్లెటిక్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

అడెల్లి ఆలయంలో జీహెచ్‌ఎంసీ మేయర్ పూజలు


మేయర్ దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ

సారంగాపూర్: నిర్మల్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేయర్‌కు ఆలయ అధికారులు, పాలకమండలి అధ్యక్షుడు ఆయిటి చందు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలతో ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుచరిత, ఆలయ ఈఓ రవికిషన్‌గౌడ్, సీనియర్ అసిస్టెంట్ రమణారావు, ఆలయ సిబ్బంది, స్థానిక నాయకులు రాజేశ్వర్ రావు, రాజు ఉన్నారు.

వాణిజ్య పంటలపై దృష్టి సారించాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్


రైతులకు విత్తనాలు, మొక్కలు పంపిణీ చేస్తున్న పీవో

ఉట్నూర్‌రూరల్: రైతులు సాంప్రదాయ పంటలకు భిన్నంగా కూరగాయలు, బొప్పాయి, మునగ, పండ్ల తోటల వంటి వాణిజ్య పంటలపై దృష్టి సారించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. ఉట్నూర్‌లోని కుమురంభీం కాంప్లెక్స్‌లో ఐటీడీఏ ఉద్యాన విభాగంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొలాం రైతులకు కూరగాయల విత్తనాలు, మునగ, కొబ్బరి మొక్కలు అందజేశారు. ఈ ఏడాది 350 మంది పీవీటీజీ రైతులకు కూరగాయలు విత్తనాలు ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. రైతులు ఒకే పంట మీద ఆధారపడవద్దని మిశ్రమ సాగు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌వో సందీప్‌కుమార్, ఏపీవో పీవీటీజీ భాస్కర్, సుధీర్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి
సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. ఐటీడీఏ పరిధిలోని మూడు జిల్లాలకు చెందిన డీఎంహెచ్‌వోలు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలతో పాటు 32 పీహెచ్‌సీల అధికారులతో సమీక్షించారు. పీవోతో పాటు ఏజెన్సీ అదనపు వైద్యాధికారి కొమురం బాలు పలు సూచనలు చేశారు. గిరిజన ఆరోగ్యకేంద్రం పరిధిలో ప్రభావిత గ్రామాలను గుర్తించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ర్యాపిడ్ ఫీవర్ సర్వే చేపట్టాలన్నారు. ప్రతీ ఆరోగ్య కేంద్రంలో ఎపిడమిక్ సెల్ ఏర్పాటు చేయాలని, వరదలు వచ్చే గ్రామాల్లోని గర్భిణులను ముందస్తుగా లేబర్ ప్లాన్‌కు తరలించాలని, డెంగీ, మలేరియా నిర్ధారణ కిట్లను ఆశ కార్యకర్తలకు అందజేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రతీ గ్రామంలో అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభావిత గ్రామాల్లో కళాజాత ద్వారా అవగాహన కల్పించాలన్నారు. రోజు వారి రిపోర్టు అదనపు జిల్లా వైద్యాధికారి కార్యాలయానికి అందజేయాలన్నారు.

వాగు దాటి.. విద్యాబోధన

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురంభీం జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగుల్లో వరద మొదలైంది. అనేకచోట్ల వాగులపై వంతెనలు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కెరమెరి మండలంలోని అనార్‌పల్లి వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. జన్కాపూర్, శంకర్‌గూడ, కరంజీవాడ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు గంగాసాగర్, శ్రీలత, అపర్ణ, ప్రవళిక బుధవారం కెరమెరి మండల కేంద్రం నుంచి ఆటోలో వచ్చి.. ఇలా మోకాళ్ల లోతు వాగు ప్రవాహం దాటి బడికి చేరుకున్నారు. ప్రవళిక చంటి బిడ్డను వెంటబెట్టుకురాగా, ఒకరికొక్కరు సాయంగా చేతులు పట్టుకుని భయంభయంగా వరద దాటారు.


వాగు దాటుతున్న ఉపాధ్యాయులు

కార్మికుల చర్చలు వాయిదా

- ఆగస్టు 10న ఆర్‌ఎల్‌సీ సమక్షంలో మరోసారి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందంపై జరిగిన చర్చలు వాయిదాపడ్డాయి. బుధవారం హైదరాబాద్‌లోని రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్‌ఎల్‌సీ) సునిల్ కుమార్ సాహూ సమక్షంలో జరిగిన చర్చల్లో ఎన్టీపీసీ యాజమాన్యం ప్రతినిధులు, కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు, కాంట్రాక్టర్లు చర్చల్లో పాల్గొన్నారు. కార్మికులకు చెల్లించే వేతనాలపై యూనియన్ ప్రతినిధులు రూ.2,840 మొత్తం డిమాండ్ చేయగా ఆమోదయోగ్యం కాదని తెలిపారు. ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాల కంటే రూ.500 చెల్లిస్తామన్నారు. సుదీర్ఘ చర్చల అనంతరం యూనియన్ డిమాండ్, కాంట్రాక్టర్ల సంఘం ప్రతిపాదనల మధ్య అంతరం ఉండటంతో ఎన్టీపీసీ యాజమాన్యం, కాంట్రాక్టర్లు, ప్రాతినిధ్యం వహిస్తున్న యూనియన్ల మధ్య ద్వైపాక్షిక సమావేశం నిర్వహించాలన్నారు. పదిహేను రోజుల తర్వాత నివేదిక అందించాలని, చర్చలు కొనసాగుతున్న క్రమంలో సమ్మెలోకి వెళ్లవద్దని కమిషనర్ సునిల్‌కుమార్ సాహూ సూచించారు. దీంతో ఆర్‌ఎల్‌సీ చర్చలు వచ్చేనెల పదో తేదీకి వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. చర్చల్లో వివిధ యూనియన్లకు చెందిన నాయకులు చిలుక శంకర్, సీహెచ్ ఉపేందర్, శంకర్, ఇజ్జగిరి భూమయ్య, భూమల్ల చందర్, రాధారపు రాజమల్లయ్య, ఆర్.లక్ష్మణ్, సత్యం, ఏ. శ్రీనివాస్, టి.శ్రీనివాస్, కాంట్రాక్టర్లు శ్రీనివాస రెడ్డి, శ్రీనివాస్, రాజేశం, ఎన్టీపీసీ అధికారులు శామ్యూల్ ప్రశాంత్, దీపక్ పాతక్, ప్రశాంత్, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



మదర్ ఎర్త్



రెయిన్‌బో



షనన్ స్నో

ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతోంది.
సాంకేతిక విప్లవంతో ప్రతి రంగం వేగం పుంజుకుంటోంది.
మరి... మహిళాభివృద్ధి కూడా అంతే వేగంగా జరుగుతోందా?
అభివృద్ధి పరుగులో మహిళ ఎక్కడో వెనుకబడుతోంది.
చిత్రలేఖనంలో మహిళల వాటా ఐదు శాతమే.
అందుకే 'వరల్డ్ ఆఫ్ ఉమెన్' (వావ్) పుట్టింది.
వావ్ సీఓఓ షనన్ స్నో పరిచయం ఇది.

సాధికార చిత్రాలు

షనన్ స్నో... అమెరికా అమ్మాయి. మయామిలో ఉంటోంది. ప్రపంచంలోని మహిళలందరినీ ఎంపవర్‌మెంట్ అనే వేదిక మీదకు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తోంది. యామ్ కర్‌కాయ్ అనే చిత్రకారిణి, మరికొంత మంది భావ సారూప్యత కలిగిన వ్యక్తులతో కలిసి 'వరల్డ్ ఆఫ్ ఉమెన్' వేదికగా ఉమెన్ ఆర్టిస్టుల కోసం పని చేస్తోన్న షనన్ తెలుగింటి కోడలు. ఆమె కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కి వచ్చిన సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడింది.

''నా దృష్టిలో జీవితం అంటే సాటి వారికి మనవంతుగా తోడ్పడడమే. అలాగే ప్రపంచం అంతటినీ చుట్టి రావడం కూడా. టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రపంచం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. సమాజం కూడా అంతే వేగంగా అభివృద్ధి చెందుతోందా అంటే సమాధానం కష్టమే. నిజానికి మహిళాభివృద్ధితోనే సమాజం సంపూర్ణాభివృద్ధిని సాధిస్తుంది. అలాంటిది మహిళ ఇంకా సాధికారత సాధన కోసం పోరాడుతూనే ఉంది. ఆ పోరాటంలో విజయం సాధించాలంటే మహిళలు ఒకరికొకరు చేయూతగా నిలవాలి. ఆ భావనతోనే 2021 జూలైలో వరల్డ్ ఆఫ్ ఉమెన్' అనే అనే సంస్థను స్థాపించాం. మా వరల్డ్ ఆఫ్ ఉమెన్ కమ్యూనిటీతో ఇప్పటికి ప్రపంచ వ్యాప్తంగా 350 మంది మహిళా చిత్రకారులు అనుసంధానమయ్యారు. ఈ రెండేళ్లలో మేము దాదాపు 30 మీట్ అప్స్ ఏర్పాటు చేశాం. ముంబయిలో శ్వేత పరేఖ్ మా కమ్యూనిటీ మేనేజర్. ఇలా మొత్తం ఇరవై మందిమి ఉన్నాం. కొత్తగా కుంచె పట్టుకున్న చిత్రకారిణుల చిత్రాలను అనతి కాలంలోనే ప్రపంచంలోని దేశాలన్నింటికీ పరిచయం చేస్తుంది ఈ వేదిక. ఒక విషయాన్ని చెప్పడానికి చిత్రలేఖనం ఒక అందమైన మాధ్యమం. అలాగే చిత్రలేఖనంలో ఎన్నో వైవిధ్యభరితమైన విధానాలుంటాయి. యామ్‌తోపాటు హాలీవుడ్ నటి ఎవా లాంగోరియా స్వచ్ఛందంగా ఆర్థిక సహకారం అందిస్తున్నారు.

అవకాశాల్లో సమానత్వం

మేము చేస్తున్న ఈ ప్రయత్నం మహిళ సాధికారత సాధన కోసమే. మహిళ తనంతట తానుగా నిలబడగలగాలి. అవకాశాలు అందరికీ సమానంగా ఉండాలి. కానీ సమాజం అలా లేదు. ప్రపంచంలో ఏ దేశాన్ని చూసినా మహిళ మనుగడ కోసం పోరాడుతూనే ఉంది. కొన్ని దేశాల్లో అస్తిత్వం కోసం పోరాటం, కొన్ని దేశాల్లో హక్కుల పోరాటం, మరి కొన్ని దేశాల్లో స్వేచ్ఛాస్వాతంత్ర్యాల కోసం పోరాడుతోంది. సంతోషంగా జీవించాలంటే పోరాటం తప్పని పరిస్థితి కనిపిస్తుంది. ఇప్పటికీ బాలికల విద్య ఇంకా ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన విషయంగానే ఉంది. వీటన్నింటి పరిష్కారం కోసం మా వరల్డ్ ఆఫ్ ఉమెన్ సర్వీసులను విస్తరిస్తున్నాం. మా చిత్రలేఖనాలు కూడా 'మహిళ' అనే అంశం మీదనే ఉంటాయి. బాల్యం నుంచి స్త్రీకి ఎదురయ్యే సవాళ్లు, ఆమె సాధించిన విజయాలు, ఆమె అధిరోహించిన శిఖరాలే ఇతివృత్తంగా ఉంటాయి. ఇది మహిళాభివృద్ధికి కొత్త ప్రారంభం వంటిది. ఈ పరంపరలో భాగస్వాములు కావడం సులభం. ఆన్‌లైన్‌లో లాగిన్ అయ్యి సభ్యత్వం తీసుకోవచ్చు. మహిళలు సాధించలేనిదంటూ ఏదీ లేదు. సంఘటితమై సాధించి చూపిద్దాం.

– షనన్ స్నో, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, వరల్డ్ ఆఫ్ ఉమెన్



సైబర్ జంగిల్

ఇండియాతో బంధం

ఇండియాతో అనుబంధం 2007లో మొదలైంది. భారతీయ సంస్కృతిని తెలుసుకోవడానికి, స్వయంగా ఆస్వాదించాలని వచ్చాను. గూగుల్‌లో ఉద్యోగం చేస్తూ నాలుగైదేళ్లు ఇండియాలోనే ఉన్నాను. అయితే ఇండియన్స్‌తో అనుబంధం ఏర్పడి ఇరవై ఏళ్లయింది. ప్రతాప్ పెనుమల్లి నాకు అండర్ గ్రాడ్యుయేషన్‌లో పరిచయమయ్యాడు. యాభై ఏళ్ల కిందట యూఎస్‌కి వెళ్లి, అక్కడే స్థిరపడిన కుటుంబం వాళ్లది. మామగారు రిటైర్ అయిన తర్వాత అత్తమ్మ, మామయ్య ఏటా కొంతకాలం ఇండియాలో ఉంటున్నారు. నేను కూడా వచ్చాను. మా అత్తగారి పుట్టిల్లు, మామగారి సొంత ఊరికి కూడా వెళ్లాను. బంధువులందరూ ఆత్మీయంగా పలకరిస్తుంటే ఇండియాలో కుటుంబ బంధాలు చాలా దృఢమైనవని తెలిసింది. మా అత్తమ్మ వంటతో తెలుగు రుచులన్నీ అలవాటయ్యాయి. దోశ, ఎగ్ బుర్జీ, రొయ్యల కూర ఇష్టం. నా పర్యటనల్లో భాగంగా ఇండియా అంతా చూసేశాను. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చారిత్రక, సాంస్కృతిక, యాత్రా ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాలన్నింటినీ చూశాను. ప్రతాప్‌తో కలిసి తిరుమల కొండను నడిచి ఎక్కాను తెలుసా'' అంటూ ఆహ్లాదంగా నవ్వింది షనన్ స్నో. తిరుమలకొండకు నడిచి వెళ్లడం గొప్ప అనుభూతి. ప్రకృతిని ప్రేమించే వాళ్లకు ఎప్పటికీ చెరగని జ్ఞాపకం' అందామె చిరునవ్వుతో.

– వాకా మంజులారెడ్డి
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

న్యూస్‌మేకర్

దేశ నేతలు ఇతర దేశాల నేతలతో సరిగా మాట్లాడాలి. వారు చెప్పేది సరిగా వినాలి. దౌత్య సంబంధాలు సఫలం కావాలంటే సంభాషణే కీలకం. కాని అన్ని భాషలు అందరు నేతలకూ రావాలని లేదు. అందుకే దుబాసీలను ఎంచుకుంటారు. ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనల్లో తరచు కనిపిస్తున్న దుబాసి గుర్‌దీప్ కౌర్ చావ్లా. ఇటీవల మోదీ అమెరికా పర్యటనలో ఆమె కీలక పాత్ర పోషించింది.




గుర్‌దీప్ కౌర్ చావ్లా

ప్రధానికి దుబాసీ

అది వేదిక మీద ఎవరో ఒక నాయకుడు చేస్తున్న రాజకీయ ప్రసంగాన్ని అనువాదం చేయడం కాదు. లేదా ఒక కథనో వ్యాసాన్నో అనువాదం చేయడం కాదు. అగ్రనేతలు చర్చలు చేసుకుంటున్నప్పుడు ఆ సంభాషణను అనువాదం చేయడం. దుబాసీగా ఉండటం. 'ఆ పని చాలా కష్టం' అంటారు గుర్‌దీప్ కౌర్ చావ్లా. అమెరికాలో స్థిరపడిన ఈ పంజాబీ భారతీయురాలు గత 26 ఏళ్లుగా దౌత్యరంగంలో దుబాసీగా సేవను అందిస్తున్నారు. 'డిప్లమాటిక్ ఇంటర్‌ప్రెటర్'గా అంతర్జాతీయ గుర్తింపు పొందారు గుర్‌దీప్ కౌర్.



మోదీ – బైడెన్‌లతో గుర్‌దీప్ కౌర్



ఢిల్లీలో చదువుకుని

గుర్‌దీప్ కౌర్ ఢిల్లీలో ఎం.ఏ. ఇంగ్లిష్ చదివి, ఆ తర్వాత పొలిటికల్ సైన్స్‌లో మాస్టర్స్ చేసి, పీహెచ్‌డీ చేశాక పార్లమెంట్‌లో అనువాదకురాలిగా కెరీర్‌ను ప్రారంభించారు. ఇంగ్లిష్, హిందీ, పంజాబీ, ఉర్దూ భాషల్లో గొప్ప ప్రవేశం ఉండటంతో దుబాసీగా ఆమె సేవలను పార్లమెంట్ భవన్ ఉపయోగించుకునేది. అయితే భర్త ఉద్యోగరీత్యా 1996లో అమెరికా వెళ్లిన గుర్‌దీప్ అక్కడ కూడా దౌత్యపరమైన దుబాసీగా కావాల్సిన అనుభవం కోసం 'జ్యుడిషియల్ కౌన్సిల్ ఆఫ్ కాలిఫోర్నియా'లో పని చేశారు. 'దౌత్యరంగానికి అవసరమైన మేలిమి ఇంటర్‌ప్రెటర్‌ల కొరతను ఆ రోజుల్లోనే నేను గమనించాను. అలాంటివారిని తయారు చేయడానికి 'ఇండియన్ లాంగ్వేజస్ సర్వీసెస్' అనే సంస్థను స్థాపించి దుబాసీలను తయారు చేస్తున్నాను. భారతీయ నేతల కోసమే కాదు ప్రపంచ నేతల కోసం కూడా అరబిక్, స్పానిష్, చైనీస్ తదితర భాషలలో నిపుణులైన దుబాసీలను మేము ఏర్పాటు చేస్తాం' అంటారు గుర్‌దీప్ కౌర్.

ప్రధానులకు దుబాసీ

అమెరికా పర్యటనకు వచ్చే భారతీయ ప్రధానులకు గుర్‌దీప్ దుబాసీగా పని చేసి ప్రశంసలు అందుకున్నారు. వి.పి.సింగ్, చంద్రశేఖర్, పి.వి.నరసింహారావు, వాజ్‌పేయి, గుజ్రాల్, మన్‌మోహన్ సింగ్ వీరందరూ అమెరికా వచ్చినప్పుడు వారి అధికారిక దుబాసీగా గుర్‌దీప్ పని చేశారు. ఇప్పుడు నరేంద్ర మోదీ కోసం పని చేస్తున్నారు. అయితే ట్రంప్ హయాంలో మోదీ అమెరికా వచ్చినప్పుడు ట్రంప్‌కు కూడా దుబాసీగా గుర్‌దీప్ పని చేశారు. అంటే ట్రంప్ మాట్లాడేది హిందీలో అనువాదం చేసి మోదీకి తెలిపారు. ఒబామాకు కూడా గుర్‌దీప్ పని చేశారు.

సవాళ్లతో నిండిన పని

'అగ్రనేతలు పాల్గొనే దౌత్య సంబంధ సమావేశాలలో దుబాసీగా పని చేయడం చాలా సవాలు. నేతలు మాట్లాడేది ఒక మాట తక్కువ కాకూడదు ఒక మాట ఎక్కువ కాకూడదు. ముఖ్యంగా మన భావాలు, పెడర్థాలు కలపకూడదు. నేను ఒక నేతకు దుబాసీగా పని చేయాలని అనుకున్న వెంటనే ఆ నేత వాడే పదసముదాయం, ఉచ్చారణ, యాస, వ్యక్తీకరణ మొత్తం స్టడీ చేస్తాను. రెండు దేశాల మధ్య ఉండే దౌత్య పరమైన సంబంధాల అవగాహన ఉండాలి. ఇరుదేశాల మధ్య వాణిజ్యం, సాంస్కృతిక అంతరం, అధికారిక సంబంధాల మధ్య ఉండే సవాళ్లు... వీటన్నింటిని తెలుసుకుని ఆ అగ్రనేత ఏం మాట్లాడబోతాడో ఊహించి సిద్ధంగా ఉండాలి. ఇంత హోమ్‌వర్క్ లేకపోతే తక్షణ అనువాదం సాధ్యం కాదు' అంటుంది గుర్‌దీప్ కౌర్.

ఐక్యరాజ్యసమితి, ఐ.ఎం.ఎఫ్, వరల్డ్ బ్యాంక్, యూ.ఎస్. ఇండియా బిజినెస్ కౌన్సిల్, డబ్ల్యు.హెచ్.ఓ తదితర సంస్థలకు గుర్‌దీప్ కౌర్ వ్యక్తిగతంగా తన సంస్థ తరఫున సేవలు అందిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇరు దేశాలు ఏవైనా మాట్లాడుకోవాలంటే గుర్‌దీప్ కౌర్ సేవలు తప్పనిసరి అనే స్థితిలో ఆమె తన సేవలను విస్తరించారు. భాష తెలియడం వల్ల వచ్చిన విజయం ఇది. భాషల మీద పట్టు సాధించి ఇటువైపు కెరీర్ మలుచుకోవాలనుకునేవారికి గుర్‌దీప్ గొప్ప స్ఫూర్తి.

సేవాపథం

ముచ్చటగా మూడోసారి...

ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో మూడుసార్లు ప్రసంగించిన తొలి భారతీయ యువతిగా లా ఆఫీసర్ దీపికా దేశ్వాల్ చరిత్ర సృష్టించింది.

కాలేజీ రోజుల నుంచి సేవా పథంలో నడుస్తున్న ఢిల్లీకి చెందిన దీపిక ఎంతోమంది బాధితులకు అండగా నిలిచి, ఎన్నోరకాల సేవాకార్యక్రమాల్లో పాల్గొంది. నలుగురిని ఒకటి చేసి తన దారిలో నడిచేలా చేసింది...

పీహెచ్‌డీ స్కాలర్ అయిన దీపికా దేశ్వాల్‌కు చదువు మాత్రమే ప్రపంచం కాదు. కాలేజీ రోజుల నుంచి సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనడం అంటే ఇష్టం. కోవిడ్ కల్లోల కాలంలో సామాజిక సేవా కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొంది. పంజాబ్‌లోని మోగా జిల్లాలో ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకుంటూ పల్లె, పట్టణం అనే తేడా లేకుండా వందలాదిమందికి సహాయం అందించింది. స్నేహితులు, బంధువులను కూడా తన సేవాకార్యక్రమాలలో భాగం చేసింది.

అన్నదానం నుంచి అనుకోకుండా ఆపదలో చిక్కుకున్న వారికి సహాయం చేయడం వరకు ఎన్నో చేసింది.

తన జీతం మొత్తం కరోనా బాధితుల చికిత్స కోసం విరాళంగా ఇచ్చేది. ఆమె తండ్రి కూడా తన జీతంలోని కొంతమొత్తాన్ని విరాళంగా ఇచ్చేవాడు.

ఏ అవసరం ఎప్పుడు వచ్చినా ఫోన్ చేయమంటూ ఎంతోమందికి తన ఫోన్ నంబర్ ఇచ్చింది. అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు ఫోన్ వచ్చినా పరుగులు తీసేది. బాధితులకు అన్ని రకాలుగా అండగా నిలిచేది.

సోషల్ మీడియాలో వేధింపులకు గురవుతున్న 80 మంది అమ్మాయిలకు అండగా నిలిచి, నేరస్థులు అరెస్ట్ అయేలా ఉద్యమించింది. వ్యభిచార కూపంలో చిక్కుకున్న అమ్మాయిలను రక్షించి వారికి పునరావాసం ఏర్పాటయ్యేందుకు కృషి చేసింది.

ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల విభాగానికి మనదేశం తరఫున ప్రాతినిధ్యం వహించింది.

మహిళా సాధికారత నుంచి మానవ హక్కుల వరకు ఎన్నో కార్యక్రమాలలో క్రియాశీల పాత్ర పోషించిన దీపికకు న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో మూడోసారి ప్రసంగించే అరుదైన అవకాశం లభించింది. గత రెండు సమావేశాల్లో 'మానవ హక్కులు–మహిళా హక్కులు' అంశంపై మాట్లాడి 150 దేశాలకు చెందిన ప్రతినిధుల ద్వారా ప్రశంసలు అందుకుంది.

మనసున్న దీపిక ఆటల్లోనూ బంగారం అనిపించుకుంది. 'యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ'లో రెజ్లింగ్, జూడోలలో ఆరుసార్లు బంగారు పతకం గెలుచుకుంది. ఆత్మరక్షణకు సంబంధించి అమ్మాయిల కోసం రకరకాల వర్క్‌షాప్‌లు నిర్వహించింది.



దీపికా దేశ్వాల్

సైబర్ టాక్

ఫేక్ యాడ్స్‌తో వల

సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో రకరకాల ప్రకటనలు కనిపిస్తుంటాయి. ముఖ్యంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విటర్, గూగుల్ ప్లాట్‌ఫారాలలో ఇవి అధికంగా కనిపిస్తుంటాయి. వీటిలో ఏవి నిజమైనవి, ఏవి నకిలీవి అని తెలుసుకోవడం కష్టంగా ఉంటుంది. నిజమని నమ్మి మోసపోయే బాధితుల సంఖ్య ఇటీవల పెరుగుతోంది. ప్రకటనల పేరుతో జరిగే ఈ ఆర్థిక మోసాల బారిన పడకుండా ఉండాలంటే మరింత అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఇది.

ఫేస్‌బుక్ ద్వారా..

మోసగాళ్లు నకిలీ అకౌంట్స్‌ను ఓపెన్ చేస్తారు. వీటిని ఫేక్ లైక్స్, షేర్స్, ఫాలోవర్స్, పోస్ట్‌ల ను రూపొందించడానికి ఉపయోగిస్తారు. ఈ నకిలీ అకౌంట్స్ ద్వారా వచ్చే యాడ్స్‌కు ఎటువంటి వాస్తవిక ఆధారాలు ఉండవు. ఫేస్‌బుక్ ప్రకటనలపై క్లిక్ లను రూపొందించడానికి ఆటోమేటెడ్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తారు. దీని ద్వారా కృత్రిమంగా క్లిక్ త్రూ రేట్లను పెంచి, ప్రకటనదారులకు చెల్లించాల్సిన మొత్తాన్ని పెంచుతారు. అలాగే, యాడ్ నెట్‌వర్క్‌ను మోసగించడానికి చట్టబద్ధమైన వెబ్‌సైట్‌లు లేదా యాప్స్‌ను అనుకరిస్తారు. దీంతో మోసపూరిత వెబ్‌సైట్‌లలో ఈ యాడ్స్ కనిపిస్తుంటాయి.

ఇన్‌స్టాగ్రామ్‌లో..

- కొంతమంది ఇన్‌ఫ్లుయెన్సర్లు ఫేక్ ఫాలోవర్లను కొనుగోలు చేయడం ద్వారా మోసానికి పాల్పడవచ్చు. లేదా వారి ప్రజాదరణను పెంచుకోవడానికి ఒక ఒప్పందం చేసుకోవచ్చు. అయితే, దీని ద్వారా ప్రకటనదారులు ఆశించిన ప్రయోజనాన్ని పొందలేరు.
- మోసగాళ్లు ఫేక్ గ్రూప్‌లను క్రియేట్ చేస్తారు. ఒకరి పోస్ట్‌లను లైక్, షేర్, రివ్యూ చేయడానికి ఒప్పుకుంటారు. దీని ద్వారా వినియోగదారులు నమ్మకాన్ని పొందేందుకు ఒక భ్రమను సృష్టిస్తారు. తమ యాడ్స్‌ను ప్రచారం చేసే విధంగా మలుచుకుంటారు.
- ఫేక్ గ్రూప్స్ మాదిరిగానే పాడ్ నెట్‌వర్క్‌లను ఏర్పాటుచేస్తారు. దీని ద్వారా సభ్యులు ఒకరి పోస్ట్‌లపై మరొకరు కృత్రిమమైన ఎంగేజ్‌మెంట్‌ను పెంచుకుంటారు. ఎక్కువమంది వ్యూవర్స్‌ను చేరుకోవడానికి ఇదో తరహా ఎత్తుగడ.

ట్విటర్

- ఫేక్ ఫాలోవర్లు, రీ ట్వీట్‌లు, లైక్స్ క్రియేట్ చేయడానికి మోసగాళ్లు ఆటోమేటెడ్ బాట్‌లను అమలు చేస్తారు. వారు హ్యాష్‌ట్యాగ్స్ లేదా టాపిక్స్‌ను విస్తరించడానికి బాట్స్‌ను ఉపయోగిస్తారు. ఇది ట్రెండింగ్ భ్రమను సృష్టిస్తుంది.
- మోసగాళ్లు కొన్ని హ్యాష్‌ట్యాగ్‌లు లేదా టాపిక్స్‌తో జనాదరణ పొందేలా, ట్రెండింగ్‌లో ఉండేలా కృత్రిమ ప్రచారం చేస్తారు. ఎక్కువ మందిని చేరుకోవచ్చనే ఆశతో ప్రకటనదారులు ఈ మార్గాన్ని ఎంచుకుంటారు.
- హ్యాష్‌ట్యాగ్స్, రీ ట్వీట్స్ చేయడానికి, విస్తరించడానికి ఫేక్ అకౌంట్స్‌ను క్రియేట్ చేస్తారు. దీని ద్వారా కంటెంట్, విజిబిలిటీతో వ్యూవర్స్‌ను రీచ్ అవడమే లక్ష్యంగా పెట్టుకుంటారు.

ప్రచార మోసానికి మార్గాలు

- మోసగాళ్లు క్లిక్‌బైట్ మెసేజ్‌లను ఎస్సెమ్మెస్, వాట్సాప్, ఇ-మెయిల్ లేదా సోషల్ మీడియా ద్వారా పంపుతారు.
- సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో, గూగుల్ ప్రకటనలలో ఫేక్ యాడ్స్ సృష్టిస్తారు. ముఖ్యంగా కొత్త ఐ ఫోన్ మోడల్ వంటి ట్రెండింగ్‌లో ఉన్న విషయాలను ప్రచారం చేస్తారు.
- ప్రకటనలకు ఆకర్షితుడై మోసగాడిని సంప్రదించినప్పుడు అతను బుకింగ్ లేదా అడ్వాన్స్ చెల్లించమని అడుగుతాడు.
- కోరుకున్న వస్తువు డిస్కౌంట్ రేట్‌లో లభిస్తుందనే ఆశతో మోసగాడు చెప్పిన మొత్తాన్ని బాధితుడు ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తాడు. ఆ తర్వాత డెలివరీ, జీఎస్టీ, ఎక్స్‌ప్రెస్ డెలివరీ ఛార్జీలు మొదలైనవాటికి అదనపు మొత్తాన్ని చెల్లించమని బాధితుడిని కోరతాడు.
- మోసగాడు చెప్పింది నిజమని బాధితుడు నమ్మి డెలివరీ ట్రాకింగ్ వివరాలను పంపుతాడు. లేదంటే, అడిగినంత మొత్తాన్ని చెల్లిస్తాడు.
- బాధితుడు డబ్బును ట్రాన్స్‌ఫర్ చేసిన తర్వాత మోసగాడు కాల్స్‌ను, ఇతర కమ్యూనికేషన్ మార్గాలను బ్లాక్ చేస్తాడు.

మోసాన్ని అధిగమించడానికి ..

- మంచి ట్రాక్ రికార్డ్ ఉన్న ప్రముఖ వ్యాపార ప్రకటనల నెట్‌వర్క్‌లు, పబ్లిషర్స్, ఇన్‌ఫ్లుయెన్సర్లను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. ఏవైనా అడ్వర్టైజింగ్ పార్టనర్‌షిప్‌లలోకి ప్రవేశించే ముందు క్షుణ్ణంగా పరిశీలించి, తగిన శ్రద్ధ తీసుకోవాలి.
- ప్రకటనల మోసాన్ని గుర్తించి, నిరోధించడంలో సహాయపడే ధ్రువీకరణ సాధనాలు, టెక్నాలజీని ఉపయోగించాలి. ఇవి, అనుమానాస్పద యాడ్స్ లోని లొసుగులను కనిపెట్టగలవు. క్లిక్ ఫ్రాడ్, ఇంప్రెషన్ ఫ్రాడ్ వంటి వివిధ రకాల మోసాలకు వ్యతిరేకంగా ఇవి రక్షణను అందిస్తాయి.
- ఏవైనా అనుమానాస్పద యాడ్స్‌ను గుర్తించడానికి ఇతర యూజర్ల క్రమాన్ని కూడా పర్యవేక్షించాలి. అంటే, అసహజంగా అనిపించే లైక్స్, షేర్స్ వేగంగా పెరగడం వంటివి ఉన్నాయేమో చెక్ చేయాలి.
- మోసాన్ని గుర్తించే లెర్నింగ్ టెక్నిక్స్‌ను ఉపయోగిస్తే ఇవి మోసపూరిత తేడాలను గుర్తించగలవు.
- మీ యాడ్స్... సంబంధిత ప్లాట్‌ఫారమ్‌లలో కనిపించేలా చూసుకోవడానికి స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించాలి. అనుమానాస్పదమైన, క్వాలిటీ లేని వెబ్‌సైట్స్, మోసపూరిత కార్యకలాపాలకు గురయ్యే యాప్‌లలో ప్రకటనలను ఉంచడం మానుకోవాలి.
- ఈ తరహా తాజా మోసాలను మీ టీమ్ అంటే.. బంధుమిత్రుల సమూహాలకు అవగాహన కల్పించాలి. ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యేందుకు ఇండస్ట్రీ కాన్ఫరెన్స్‌లు, వెబినార్లు, వర్క్‌షాప్స్‌కు హాజరవ్వాలి.
- ప్రకటనల ప్రచారాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలి. డేటాలో ఏవైనా తేడాలు ఉన్నాయేమో సరిచూసుకోవాలి.
- మీరు మోసపూరిత కార్యకలాపాలను అనుమానించినట్లయితే, వాటిని సంబంధిత యాడ్ ప్లాట్‌ఫారమ్స్ లేదా నెట్‌వర్క్‌లకు తెలియజేయాలి. మోసపూరిత ప్రకటనల విధానాలను పంచుకోవడం ద్వారా మిగతావారిని అలెర్ట్ చేయవచ్చు.
- ప్రకటనల మోసాన్ని ఎదుర్కోవడానికి నిజాయితీని ప్రోత్సహించే ఇండస్ట్రీ అసోసియేషన్స్‌తో కనెక్ట్ అయి ఉండటం శ్రేయస్కరం.



ప్రతీకాత్మక చిత్రం



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



క్లీన్ స్వీప్ లక్ష్యంగా బరిలోకి...

తమ విజయపరంపరను కొనసాగిస్తూ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంతో... మిర్పూర్‌లో నేడు బంగ్లాదేశ్‌తో జరిగే చివరిదైన మూడో టి20 మ్యాచ్‌లో భారత మహిళల జట్టు బరిలోకి దిగనుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌ల్లో గెలిచి సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుంది. తొలి మ్యాచ్‌లో ఏడు వికెట్ల తేడాతో నెగ్గిన భారత్... రెండో మ్యాచ్‌లో 95 పరుగులు చేసినా స్పిన్నర్ల మాయాజాలంతో గట్టెక్కింది. మధ్యాహ్నం గం. 1:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను ఫ్యాన్‌కోడ్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

జ్ఞానేశ్వరికి స్వర్ణ పతకం

కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో మహిళల 49 కేజీల విభాగంలో భారత ప్లేయర్ జ్ఞానేశ్వరి యాదవ్ స్వర్ణ పతకం సాధించింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జ్ఞానేశ్వరి మొత్తం 176 కేజీలు బరువెత్తి అగ్రస్థానంలో నిలిచింది. గ్రేటర్ నోయిడాలో జరుగుతున్న ఈ పోటీల్లో భారత్‌కే చెందిన జిలీ దలబెహెరా రజత పతకం గెలిచింది. మహిళల 45 కేజీల విభాగంలో కోమల్... పురుషుల 55 కేజీల విభాగంలో ముకుంద్ అహిర్ భారత్‌కు స్వర్ణ పతకాలు అందించారు.





‘జబర్’దస్త్ విజయం

- డిఫెండింగ్ చాంపియన్ రిబాకినాపై ఆన్స్ జబర్ గెలుపు
- వరుసగా రెండో ఏడాది సెమీస్‌లోకి
- సబలెంకా కూడా ముందుకు

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో ఈసారి కొత్త చాంపియన్ అవతరించనుంది. ట్యునీషియా క్రీడాకారిణి, ప్రపంచ ఆరో ర్యాంకర్ ఆన్స్ జబర్ ధాటికి డిఫెండింగ్ చాంపియన్, మూడో సీడ్ ఎలీనా రిబాకినా (కజకిస్తాన్) క్వార్టర్ ఫైనల్లోనే ఇంటిదారి పట్టింది. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో గత ఏడాది రన్నరప్ ఆన్స్ జబర్ 6-7 (5/7), 6-4, 6-1తో రిబాకినాను బోల్తా కొట్టించి వరుసగా రెండో ఏడాది ఈ టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గంటా 53 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జబర్ తొలి సెట్‌ను టైబ్రేక్‌లో కోల్పోయినా... వెంటనే తేరుకొని వరుసగా రెండు సెట్‌లు గెలిచి విజయం దక్కించుకుంది. ఎనిమిది ఏస్‌లు సంధించిన జబర్ నెట్ వద్దకు 11 సార్లు దూసుకొచ్చి 9 సార్లు పాయింట్లు గెలిచింది. మరోవైపు రిబాకినా 22 సార్లు నెట్ వద్దకు వచ్చి 10 సార్లు మాత్రమే పాయింట్లు నెగ్గింది. 35 విన్నర్స్ కొట్టిన జబర్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. రిబాకినా 20 అనవసర తప్పిదాలు చేసింది. మరో క్వార్టర్ ఫైనల్లో రెండో సీడ్ సబలెంకా (బెలారస్) అలవోక విజయంతో రెండోసారి వింబుల్డన్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరింది. 87 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సబలెంకా 6-2, 6-4తో 25వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా)పై గెలిచింది. రెండో సెట్‌లో ఒకదశలో సబలెంకా 2-4తో వెనుకబడినా ఆందోళన చెందకుండా పట్టుదలతో ఆడి వరుసగా నాలుగు గేమ్‌లు గెలిచి విజయాన్ని ఖరారు చేసుకుంది. నేడు జరిగే సెమీఫైనల్స్‌లో స్వితోలినా (ఉక్రెయిన్)తో వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్); ఆన్స్ జబర్‌తో సబలెంకా తలపడతారు.

తొలిసారి సెమీస్‌లోకి అల్‌కరాజ్, మెద్వెదెవ్

పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ అల్‌కరాజ్ (స్పెయిన్), మూడో ర్యాంకర్ మెద్వెదెవ్ (రష్యా) తొలిసారి ఈ టోర్నీలో సెమీఫైనల్లోకి ప్రవేశించారు. క్వార్టర్ ఫైనల్స్‌లో మెద్వెదెవ్ 2 గంటల 58 నిమిషాల్లో 6-4, 1-6, 4-6, 7-6 (7/4), 6-1తో క్రిస్టోఫర్ యుబాంక్స్ (అమెరికా)పై, అల్‌కరాజ్ 7-6 (7/3), 6-4, 6-4తో ఆరో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్)పై గెలిచారు. శుక్రవారం జరిగే సెమీఫైనల్స్‌లో యానిక్ సినెర్ (ఇటలీ)తో జొకోవిచ్ (సెర్బియా); మెద్వెదెవ్‌తో అల్‌కరాజ్ ఆడతారు.



బోపన్న జోడీ జోరు

పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-7 (3/7), 7-5, 6-2తో టాలన్ గ్రీక్స్‌పూర్-బార్ట్ స్టీవెన్స్ (నెదర్లాండ్స్) జంటను ఓడించింది. 2015 తర్వాత వింబుల్డన్ టోర్నీలో బోపన్న డబుల్స్ విభాగంలో సెమీఫైనల్లోకి ప్రవేశించాడు.

భారత బౌలర్ల జోరు



- తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ విఫలం
- టీ విరామానికి 137/8
- అశ్విన్‌కు 4 వికెట్లు

రోసీయూ (డొమినికా): వెస్టిండీస్‌తో ప్రారంభమైన తొలి టెస్టులో మొదటి రోజే భారత్ పైచేయి సాధించింది. తమ స్థాయికి తగ్గ ప్రదర్శనతో ప్రత్యర్థిని కుప్పకూల్చింది. భారత బౌలర్ల ధాటికి విండీస్ బ్యాటర్లు చేతులెత్తేశారు. తొలి రోజు టీ విరామ సమయానికి వెస్టిండీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. కెరీర్‌లో మొదటి టెస్టు ఆడుతున్న అలిక్ అతనజ్ (99 బంతుల్లో 47; 6 ఫోర్లు, 1 సిక్స్) మినహా అంతా విఫలమయ్యారు. అశ్విన్ 4 వికెట్లు పడగొట్టగా, జడేజాకు 2 వికెట్లు దక్కాయి.

టాస్ గెలిచి విండీస్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి వికెట్‌కు 31 పరుగులు జత చేసి ఓపెనర్లు క్రెయిగ్ బ్రాత్‌వైట్ (20), తేజ్‌నారాయణ్ చందర్‌పాల్ (12) కుదురుకున్నట్లుగా అనిపించారు. అయితే 7 పరుగుల వ్యవధిలో వీరిద్దరిని అశ్విన్ అవుట్ చేసి దెబ్బ కొట్టాడు. శార్దుల్ తన తొలి ఓవర్లోనే రీఫర్ (2)ను వెనక్కి పంపగా, సిరాజ్ చక్కటి క్యాచ్‌కు బ్లాక్‌వుడ్ (14) అవుట్ కావడంతో లంచ్ సమయానికే స్కోరు 68/4కు చేరింది. మరో ఎండ్‌లో అలిక్ మాత్రమే ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. సొంత మైదానంలో అతను కొన్ని చక్కటి షాట్లతో జట్టును ఆదుకున్నాడు. రెండో సెషన్‌లో భారత్ మరో 3 వికెట్లు తీయడంలో సఫలమైంది. డిసిల్వ (2) ప్రభావం చూపలేకపోగా, హోల్డర్ (18) వికెట్ సిరాజ్ ఖాతాలో చేరింది. ఐదు పరుగుల వ్యవధిలో జోసెఫ్ (4), అలిక్‌లను అశ్విన్ అవుట్ చేశాడు. జోసెఫ్ వికెట్‌తో అశ్విన్ అంతర్జాతీయ వికెట్ల సంఖ్య 700కు చేరడం విశేషం. ఈ మ్యాచ్ ద్వారా తండ్రీ కొడుకులిద్దరినీ టెస్టు క్రికెట్‌లో అవుట్ చేసిన తొలి భారత బౌలర్‌గా అశ్విన్ గుర్తింపు తెచ్చుకున్నాడు. 2011లో తన తొలి టెస్టులో శివ్‌నారాయణ్ చందర్‌పాల్ వికెట్ తీసిన అశ్విన్ ఈ మ్యాచ్‌లో తేజ్‌నారాయణ్‌ను అవుట్ చేశాడు. గతంలో బోథమ్, వసీమ్ అక్రమ్, మిచెల్ స్టార్క్, సైమన్ హార్మర్ ఇలాంటి ఫీట్‌ను నమోదు చేశారు.

యశస్వి, ఇషాన్ అరంగేట్రం



తొలి టెస్టులో భారత జట్టు ఇద్దరు కొత్త ఆటగాళ్లకు అవకాశం కల్పించింది. ఊహించిన విధంగానే యశస్వి జైస్వాల్‌కు తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడే అవకాశం లభించగా... వికెట్ కీపర్‌గా ఇప్పటికే 14 వన్డేలు, 27 టి20లు ఆడిన ఇషాన్ కిషన్ తొలిసారి టెస్టు క్రికెట్ బరిలోకి దిగాడు. భారత్ తరఫున టెస్టులు ఆడిన 306వ, 307వ ఆటగాళ్లుగా వీరిద్దరు నిలిచారు. భారత్ ఆడిన గత ఐదు టెస్టుల్లో కీపర్‌గా ఉన్న ఆంధ్ర ఆటగాడు కేఎస్ భరత్ స్థానంలో ఈసారి టీమ్ మేనేజ్‌మెంట్ ఇషాన్‌కు తుది జట్టులో చోటు ఇచ్చింది. జార్ఖండ్‌కు చెందిన ఇషాన్ 48 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో 38.76 సగటుతో 2985 పరుగులు చేశాడు. ముంబై ఆటగాడు యశస్వి గత రెండేళ్లుగా అన్ని ఫార్మాట్‌లలో సత్తా చాటుతూ సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఐపీఎల్‌లో మెరుపులు, దేశవాళీ వన్డేల్లో మెరుపు బ్యాటింగ్ మాత్రమే కాకుండా 15 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలోనే 9 సెంచరీలతో 80.21 సగటుతో 1845 పరుగులు సాధించడం అతనికి అవకాశం కల్పించింది.

రాణించిన విహారి



బెంగళూరు: వెస్ట్ జోన్ జట్టుతో బుధవారం మొదలైన దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్ జట్టు తొలి రోజే తడబడింది. వెస్ట్ జోన్ కెప్టెన్ ప్రియాంక్ పాంచల్ టాస్ నెగ్గి ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 65 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసింది. వర్షం కారణంగా తొలిరోజు పూర్తి 90 ఓవర్ల కోటా సాధ్యపడలేదు. మయాంక్ అగర్వాల్ (28; 6 ఫోర్లు) తక్కువ స్కోరుకే అవుటవ్వగా... కెప్టెన్ హనుమ విహారి (130 బంతుల్లో 63; 9 ఫోర్లు), హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మ (87 బంతుల్లో 40; 5 ఫోర్లు, 1 సిక్స్) మూడో వికెట్‌కు 79 పరుగులు జోడించి ఆదుకున్నారు. ఒకదశలో సౌత్ జట్టు 121/2తో పటిష్టంగా కనిపించింది. అయితే అర్జన్ నాగ్వస్‌వాలా (2/45), చింతన్ గజా (2/27), షమ్స్ ములానీ (2/19) ధాటికి సౌత్ జట్టు 55 పరుగుల తేడాతో ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆంధ్ర క్రికెటర్ రికీ భుయ్ (33 బంతుల్లో 9) నిరాశపరిచాడు. వాషింగ్టన్ సుందర్ (9 బ్యాటింగ్), వైశాక్ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

అభిషేక్‌కు కాంస్యం



బ్యాంకాక్: ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ తొలి రోజు భారత్‌కు ఒక కాంస్య పతకం లభించింది. పురుషుల 10 వేల మీటర్ల విభాగంలో అభిషేక్ పాల్ కాంస్య పతకం సాధించాడు. అభిషేక్ 29 నిమిషాల 33.26 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచాడు. మహిళల జావెలిన్ త్రోలో అన్ను రాణి (59.10 మీటర్లు) నాలుగో స్థానంలో నిలిచింది.

ఈనెల 22, 23 తేదీల్లో రెజ్లింగ్ ట్రయల్స్

న్యూఢిల్లీ: ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత రెజ్లింగ్ జట్లను ఎంపిక చేసేందుకు ఈనెల 22, 23 తేదీల్లో సెలెక్షన్ ట్రయల్స్ నిర్వహిస్తామని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అడ్‌హక్ కమిటీ ప్రకటించింది. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసి... నిరసన చేపట్టిన రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, బజరంగ్, సాక్షి మలిక్, సంగీత ఫొగాట్, సత్యవర్త్, జితేందర్‌లకు ట్రయల్స్‌లో ప్రత్యేక మినహాయింపు ఇవ్వాలా వద్దా అనేది శుక్రవారం నిర్ణయిస్తామని అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు భూపేందర్ సింగ్ బజ్వా తెలిపారు.

నేటి నుంచి అల్టిమేట్ టీటీ లీగ్

పుణే: మూడేళ్ల తర్వాత అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (టీటీ) లీగ్ నాలుగో సీజన్‌కు నేడు తెర లేవనుంది. మొత్తం ఆరు జట్లు (చెన్నై లయన్స్, దబంగ్ ఢిల్లీ, పుణేరి పల్టన్, యు ముంబా, బెంగళూరు స్మాషర్స్, గోవా చాలెంజర్స్) బరిలో ఉన్నాయి. ఈనెల 30న ఫైనల్‌తో లీగ్ ముగుస్తుంది. తెలంగాణ క్రీడాకారులు ఆకుల శ్రీజ దబంగ్ ఢిల్లీ తరఫున, సూరావజ్జుల స్నేహిత్ పుణేరి పల్టన్ తరఫున ఆడుతున్నారు. తొలిరోజు చెన్నై లయన్స్‌తో పుణేరి పల్టన్ తలపడుతుంది. రాత్రి గం. 7:30 నుంచి మొదలయ్యే మ్యాచ్‌లను స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.



క్వాలిఫయింగ్‌లో కశ్యప్ ఓటమి



కౌన్సిల్ బ్లఫ్స్ (అమెరికా): యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ పారుపల్లి కశ్యప్ మెయిన్ ‘డ్రా’కు అర్హత సాధించలేకపోయాడు. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో హైదరాబాద్‌కు చెందిన కశ్యప్ 21-19, 21-17తో రోహన్ మిధా (ఇంగ్లండ్)పై గెలిచాడు. కూ తకహాషి (జపాన్)తో జరిగిన రెండో రౌండ్‌లో కశ్యప్ తొలి గేమ్ 21-23తో కోల్పోయి, రెండో గేమ్‌లో 7-11తో వెనుకబడిన దశలో గాయంతో మ్యాచ్ నుంచి వైదొలిగాడు. చెన్నైకి చెందిన 19 ఏళ్ల శంకర్ ముత్తుస్వామి మెయిన్ ‘డ్రా’కు అర్హత పొందాడు. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో శంకర్ 21-17, 21-11తో దావి సిల్వా (బ్రెజిల్)పై, రెండో రౌండ్‌లో 21-11, 21-17తో బీఆర్ సంకీర్త్ (కెనడా)పై గెలిచాడు. పురుషుల డబుల్స్ మెయిన్ ‘డ్రా’ తొలి రౌండ్‌లో పంజాల విష్ణువర్ధన్ గౌడ్-గరగ కృష్ణప్రసాద్ (భారత్) ద్వయం 14-21, 14-21తో లిన్ యు చియె-సు లీ వె (చైనీస్ తైపీ) జంట చేతిలో ఓడిపోయింది.

సినిమా



● ఐశ్వర్య, రజనీకాంత్, విష్ణు విశాల్, జీవిత

బై బై భాయ్

మొయుద్దీన్ భాయ్ పాత్రకు టాటా చెప్పేశారు రజనీకాంత్. ‘లాల్ సలామ్’లో ఆయన చేసిన పాత్ర ఇది. రజనీ పెద్ద కుమార్తె ఐశ్వర్య దర్శకత్వంలో విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా ఈ చిత్రం రూపొందుతోంది. ఇందులో రజనీ ముంబైకి చెందిన మాఫియా డాన్ మొయుద్దీన్ భాయ్‌గా కీలక పాత్ర చేశారు. బుధవారంతో ఆయన పాత్ర చిత్రీకరణ పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి, బై బై చెప్పింది యూనిట్. ఆ ఫొటోను షేర్ చేసి, ‘‘మీతో సినిమా చేయడం ఓ అద్భుతం.. మీరు ప్యూర్ మేజిక్ నాన్నా’’ అని పేర్కొన్నారు ఐశ్వర్య. రజనీ చెల్లెలిగా జీవిత నటిస్తున్న ఈ చిత్రంలో క్రికెటర్ కపిల్ దేవ్ ఓ కీ రోల్‌లో కనిపిస్తారు. లైకా ప్రొడక్షన్స్ పై సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.

నాతో రా...



● సమంత, విజయ్ దేవరకొండ

‘నాతో రా.. నీలా రా.. ఆరాధ్యా..’ అంటూ విజయ్ దేవరకొండ పాడగా, ‘పదము నీ వైపిలా.. పరుగు నీదే కదా..’ అంటున్నారు సమంత. ఈ ఇద్దరూ జంటగా నటించిన ‘ఖుషి’ చిత్రంలోని రెండో పాట ఇది. ఈ చిత్రదర్శకుడు శివ నిర్వాణ తెలుగు వెర్షన్‌కి ఈ పాట రాయగా, తమిళంలో మదన్ కార్కీ సాహిత్యం అందించారు. తెలుగు, తమిళంలో సిద్ శ్రీరామ్, చిన్మయి, హిందీలో జుబిన్ నాటియల్, పలక్ ముచ్చల్, కన్నడంలో హరిచరణ్ శేషాద్రి, చిన్మయి, మలయాళంలో కేఎస్ హరిశంకర్, శ్వేతా మోహన్ ఆలపించారు. హిషామ్ అబ్దుల్ వాహబ్ స్వరపరిచారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 1న తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

మలయాళ ఇండస్ట్రీకి మైత్రీ



● రవిశంకర్, లాల్ జూనియర్

తెలుగు చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోలతో పలు బ్లాక్ బస్టర్‌లను అందించిన మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ మలయాళంలో అడుగుపెట్టింది. తొలి ప్రాజెక్ట్‌గా ‘గాడ్ స్పీడ్’ అనే బ్యానర్‌తో కలిసి ‘నడికర్ తిలగం’ సినిమాకి శ్రీకారం చుట్టారు. టొవినో థామస్ హీరోగా లాల్ జూనియర్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. నవీన్ యర్నేని, వై. రవిశంకర్, అల్లన్ ఆంటోని, అనూప్ వేణుగోపాల్ నిర్మిస్తున్న ఈ సినిమా బుధవారం కొచ్చిలో ప్రారంభమైంది. ‘‘టొవినో థామస్ ఈ చిత్రంలో అనేక సవాళ్లతో కూడిన సూపర్ స్టార్ డేవిడ్ పడిక్కల్ పాత్రను పోషిస్తున్నారు. బుధవారమే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాం’’ అన్నారు. భావన కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆల్బీ, సంగీతం: యక్జాన్ గారి పెరీరా, నేహా నాయర్.

పాన్ ఇండియా చిత్రాల్లో...



● రోషన్

‘నిర్మలా కాన్వెంట్’ (2016)లో లీడ్ రోల్ చేసి, ‘పెళ్లి సందడి’ (2021)తో హీరోగా మంచి మార్కులు తెచ్చుకున్నారు నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ మేకా. ఇప్పుడు పర్ఫెక్ట్ ప్లానింగ్‌తో హీరోగా సినిమాలు సైన్ చేశారు. రోషన్ ఒకేసారి రెండు పాన్ ఇండియా చిత్రాలు అంగీకరించడం విశేషం. కన్నడ దర్శకుడు నందకిశోర్ దర్శకత్వంలో రోషన్-మోహన్ లాల్ కాంబినేషన్‌లో రూపొందనున్న పాన్ ఇండియా చిత్రం షూటింగ్ ఈ నెలాఖరులో ఆరంభం కానుంది. తండ్రీ-కొడుకుల అనుబంధం నేపథ్యంలో పీరియాడికల్ యాక్షన్ మూవీగా రూపొందనుంది. రోషన్ నటించనున్న మరో పాన్ ఇండియా చిత్రం వైజయంతీ మూవీస్-స్వప్నా సినిమా బేనర్లపై రూపొందనుంది. నూతన దర్శకుడు ప్రదీప్ అద్వైతం ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు.

అమ్మాయిలతో మాట్లాడ్డానికి రెండేళ్లు పట్టింది

- ఆనంద్ దేవరకొండ



‘ప్రేమలో సంతోషం, బాధ ఉంటాయి. ఆ భావోద్వేగాలను ‘బేబీ’ సినిమాలో బాగా చూపించాం. ట్రైలర్‌లో చూపించిన ఎమోషన్ కంటే సినిమాలో మరో యాభై శాతం ఎక్కువే ఉంటుంది. వాటికి ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు’’ అని హీరో ఆనంద్ దేవరకొండ అన్నారు. సాయి రాజేష్ దర్శకత్వంలో ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్ హీరోలుగా, వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటించిన చిత్రం ‘బేబీ’. ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) రిలీజవుతోంది. ఈ సందర్భంగా ఆనంద్ దేవరకొండ చెప్పిన విశేషాలు.

● ఇప్పటివరకు నేను పక్కింటి అబ్బాయిలా కనిపించే సినిమాలు చేశాను. కానీ, మొదటిసారి వైడ్ రేంజ్ ఆడియన్స్‌ని పలకరించే ‘బేబీ’తో వస్తున్నాను. ఈ సినిమాకి యూత్, మాస్ ఆడియన్స్ బాగా కనెక్ట్ అవుతారు. ఈ పాత్రను చేయగలననే నమ్మకాన్ని సాయి రాజేష్ అన్న నాలో నింపాడు. నా కెరీర్‌లో బేబీ ఎప్పటికీ నిలిచిపోతుంది.

● ‘బేబీ’కి విజయ్ బుల్గానిన్ అద్భుతమైన సంగీతం, ఆర్ఆర్ అందించారు.

మా అన్నకి (విజయ్ దేవరకొండ) ‘టాక్సీవాలా’ లాంటి మంచి హిట్ ఇచ్చారు ఎస్‌కేఎన్‌గారు.. ఇప్పుడు నాకు ‘బేబీ’తో హిట్ ఇవ్వనున్నారు.

● ఎవరి జీవితంలో అయినా తొలి ప్రేమ ఎప్పటికీ ఓ అందమైన అనుభూతి. అది సక్సెస్ అయినా, ఫెయిల్ అయినా ఎప్పటికీ గుర్తుంటుంది. నేను బాయ్స్ బోర్డింగ్ స్కూల్‌లో చదివాను. బయటకు వచ్చాక అమ్మాయిలతో మాట్లాడేందుకు రెండేళ్లు పట్టింది.

● ‘ప్రేమ దేశం’ సినిమాకు ‘బేబీ’కి అస్సలు పోలికలుండవు. ఫీల్ వైజ్ చూస్తే ‘ప్రేమిస్తే, 7/జీ బృందావన కాలనీ’ స్టైల్‌లో ఉంటుంది. ‘బేబీ’లోకి ముందుగా నేను వచ్చాను. ఆ తర్వాత వైష్ణవి, విరాజ్‌లు వచ్చారు. ముగ్గురి పాత్రలకు సమ ప్రాధాన్యం ఉంటుంది. నా సినిమాల కథ గురించి మా అన్నతో చర్చించను.. కానీ ఫలానా డైరెక్టర్, ఫలానా జానర్‌లో సినిమా అని చెబుతాను. అయితే తుది నిర్ణయాన్ని మా నాన్న, అన్న నాకే వదిలేస్తారు. ప్రస్తుతం ‘గం గం గణేశా’ సినిమా చేస్తున్నాను.

నా కళ్లతో భయపెట్టాను!



● శివ రాజ్‌కుమార్

‘‘మీరు గన్నుతో ఎంత మందిని భయపెట్టారో అంత కంటే ఎక్కువ మందిని నేను నా కళ్లతో భయపెట్టాను. దే కాల్ మీ ఓజీ... ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్’ అనే డైలాగ్‌తో ‘ఘోస్ట్’ సినిమా టీజర్ విడుదలైంది. కన్నడ హీరో శివ రాజ్‌కుమార్ నటించిన చిత్రం ‘ఘోస్ట్’. శ్రీని (బీర్బల్) దర్శకత్వంలో సందేశ్ నాగరాజ్ పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాని నిర్మించారు. బుధవారం శివ రాజ్‌కుమార్ పుట్టినరోజుని (జూలై 12) పురస్కరించుకుని ఈ మూవీ టీజర్‌ను విడుదల చేశారు. తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో దసరాకి ‘ఘోస్ట్’ ప్రేక్షకుల ముందుకి రానుంది.

తెలుగు నిర్మాతతో...

శివ రాజ్‌కుమార్ హీరోగా తెలుగు నిర్మాత సుధీర్ చంద్ర పదిరి కన్నడంలో ఓ సినిమా నిర్మించనున్నారు. శివ రాజ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాని ప్రకటించారు. ఈ చిత్రానికి కార్తీక్ అద్వైత్ దర్శకత్వం వహించనున్నారు. ఎస్‌సీఎఫ్‌సీపై (సుధీర్ చంద్ర ఫిల్మ్ కంపెనీ) సుధీర్ చంద్ర పదిరి నిర్మించనున్న ఈ మూవీ క్యారెక్టర్ కాన్సెప్ట్ పోస్టర్‌ని బుధవారం రిలీజ్ చేశారు. కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్.

రోజా నుంచి నా మైండ్ సెట్ అదే!

- ఏఆర్ రెహమాన్



ఏఆర్ రెహమాన్ దాదాపు 150 చిత్రాలకు పాటలు స్వరపరిచారు. ఆస్కార్ అవార్డు సాధించారు. ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారు. అయితే ‘‘నేనింకా నేర్చుకునే దశలో ఉన్నాను. నా కెరీర్ ఇప్పుడే మొదలైనట్లుగా అనిపిస్తోంది. ఎందుకంటే ప్రతీ పదేళ్లకు సంగీతంలో మార్పులొస్తున్నాయి’’ అన్నారు రెహమాన్. ఉదయనిధి స్టాలిన్, కీర్తీ సురేష్ ప్రధాన ప్రాతల్లో రూపొందిన తమిళ ‘మామన్నన్’కి రెహమాన్ సంగీతం అందించారు. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం తెలుగులో ‘నాయకుడు’గా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా ఏఆర్ రెహమాన్ ఇచ్చిన ఇంటర్వ్యూ...

● ఇటీవల ‘పొన్నియిన్ సెల్వన్’లాంటి పీరియాడికల్ ఫిల్మ్‌కి సంగీతం అందించిన మీకు ‘నాయకుడు’లాంటి రెగ్యులర్ కమర్షియల్ చిత్రాలు చేయడం ఎలా అనిపిస్తుంటుంది?

‘నాయకుడు’ రాజకీయ నేపథ్యంలో రూపొందిన సినిమా. సమాజంలోని అసమానతలతో పాటు చాలా విషయాల గురించి చర్చించారు. ఈ తరహా సినిమాలకు సంగీతం అందించడం సవాల్ అని చెప్పలేను కానీ ఓ కొత్త అనుభూతి మాత్రం దక్కుతుంది. చాలా రోజుల తర్వాత నేను జానపద తరహా పాటలు ఇచ్చిన చిత్రమిది.

● మీరు ఒక సినిమా ఒప్పుకో దానికి కథ, హీరో, దర్శకుడు.. ఈ మూడింటిలో ఏ అంశానికి ప్రాధాన్యం ఇస్తారు?

మూడూ ముఖ్యమే. మంచి కథ ఉంటే మంచి పాటలు ఇవ్వగలం. ఆ పాటలను దర్శకుడు చక్కగా తెరకెక్కించాలి. హీరో చేసే మంచి పెర్ఫార్మెన్స్‌ని బట్టి ఆ పాట హైలైట్ అవుతుంది. ఇప్పుడు ‘నాయకుడు’ విషయానికి వస్తే.. హీరో ఉదయనిధి స్టాలిన్ ముందు నన్ను సంప్రదించారు. సంగీతం అందించాలని అడిగారు. ఆ తర్వాత నేను కథ విన్నాను.. ఆసక్తిగా అనిపించింది. దర్శకుడు మారీ సెల్వరాజ్ ఇప్పటివరకూ తీసిన సినిమాలకు భిన్నంగా ఈ చిత్రకథ ఉంది. మారి ఈ కథకు చాలా మాస్ అప్పీల్ ఇచ్చారు. అందుకు తగ్గట్టు పాటలు ఇచ్చాను. ఈ సినిమాలో ప్రతి పాట కథను ముందుకు తీసుకుని వెళుతుంది. అందుకే మ్యూజిక్ ఇవ్వడాన్ని ఎంజాయ్ చేశా.

● అందుకేనా ఈ సినిమా ఫంక్షన్‌కి సంబంధించిన వేదికపై ‘జిమ్మ జిమ్మ...’ పాటకు డ్యాన్స్ కూడా చేశారు..

ఈ సాంగ్ సిట్యువేషన్ చాలా మెచ్యూర్డ్‌గా ఉంటుంది. అది మైండ్‌లో పెట్టుకోవడంతో పాటు ఫన్ టచ్ ఇవ్వాలనుకుని ట్యూన్ చేశా. ఫన్ కోసమే స్టేజి మీద డ్యాన్స్ కూడా చేశాను.

● సంగీతంలో మార్పులు వస్తున్నట్లే మీ ఆలోచనా విధానం కూడా మారుతోందా?

ఎన్ని మార్పులు వచ్చినా మెలోడీ మారదు. లిరిక్ కూడా మారదు.. 30, 40 ఏళ్లుగా అదే. అయితే వైబ్రేషన్ కొంచెం మారుతుంది... బీట్ మారుతుంది. ‘రోజా’ నుంచి నా ఫార్ములా, మైండ్ సెట్ ఒక్కటే. అదేంటంటే నా పాట సింపుల్‌గా, క్యాచీగా ఉండాలి. ప్రేక్షకుల్లో, సమాజంలో వచ్చిన మార్పు తాలూకు ప్రభావం సంగీతంపై ఉంటుంది. ఇప్పుడు సంగీతానికి ఇంకా స్కోప్ పెరిగింది.

● మీ అమ్మాయి ఖతీజా తమిళ చిత్రం ‘మిన్‌మిని’తో సంగీత దర్శకురాలిగా పరిచయం కానున్నారు... ఓ ఫాదర్‌గా మీ ఫీలింగ్?

మహిళలు తాము అనుకున్నది సాధించాలనుకునే మైండ్ సెట్ నాది. మా ఇంట్లో మా అమ్మగారు, నా వైఫ్ వెరీ స్ట్రాంగ్. నా కూతురు ఖతీజా కూడా అంతే. ఏ మాత్రం టెన్షన్ పడటంలేదు. ట్యూన్స్ ఎలా ఇవ్వాలనే విషయంలో తనకు మెచ్యూర్టీ ఉంది. ఓ ఫాదర్‌గా ఐయామ్ హ్యాపీ.

● తెలుగులో బుచ్చిబాబు డైరెక్షన్‌లో రామ్‌చరణ్ హీరోగా రూపొందనున్న చిత్రం గురించి?

ఇది చాలా ఎగ్జయిటింగ్ ప్రాజెక్ట్. అయితే ఈ ప్రాజెక్ట్ గురించి చెప్పడానికి ఇంకా చాలా టైమ్ ఉంది. ఇప్పుడే రివీల్ చేయలేను.

● ‘గాంధీ టాక్స్’ అనే సైలెంట్ చిత్రానికి మ్యూజిక్ ఇవ్వడంపై మీ అనుభూతి గురించి?

గతంలో ‘పుష్పక విమానం’లాంటి సైలెంట్ సినిమాలను అద్భుతంగా చేశారు. ఇప్పుడు నాకలాంటి మంచి అవకాశం వచ్చింది. ఇలాంటి సినిమాలు సవాల్ అనాలి. అందుకే ఈ సినిమా డైరెక్టర్ కిశోర్‌తో ‘ఐ హేట్ యు.. లవ్ యు’ అని సరదాగా అన్నాను. డైలాగ్స్ లేకుండా సాగే ఈ సినిమాలోని సందర్భాలకు తగ్గట్టు మ్యూజిక్ ఇవ్వడం అనేది నాకు ఎగ్జయిటింగ్‌గా అనిపించింది.

స్టాక్ మార్కెట్లు		
దేశీ సూచీలు	సెన్సెక్స్ ▽ 224	65,394
	నిఫ్టీ ▽ 55	19,384

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	13,930	△	169
డోజోన్స్	34,394	△	133
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,416	△	134
డాక్స్	16,023	△	233
షాంఘై	3,196	▽	25
నికాయ్	31,945	▽	260

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	58,786	▽	100
బంగారం (99.5 స్వచ్ఛత)	58,551	▽	99
వెండి (కేజీ)	70,777	▽	51

విప్రో ఉద్యోగులకు ఏఐలో శిక్షణ

బిలియన్ డాలర్ల వెచ్చింపు



న్యూఢిల్లీ: దేశీ ఐటీ దిగ్గజం విప్రో తమ యావత్ సిబ్బందికి కృత్రిమ మేధ (ఏఐ)లో శిక్షణ కల్పించడంపై దృష్టి పెడుతోంది. ఇందుకోసం వచ్చే మూడేళ్లలో విప్రో ఏఐ360 ప్రోగ్రాం ద్వారా బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 8,200 కోట్లు) వెచ్చించనుంది. సంస్థలో మొత్తం 2.5 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. 'వచ్చే 12 నెలల్లో మొత్తం 2,50,000 మంది ఉద్యోగులకు ఏఐ ఫండమెంటల్స్, బాధ్యతాయుతంగా ఏఐ వినియోగంపై శిక్షణ అందిస్తాం' అని విప్రో ఒక ప్రకటనలో తెలిపింది. వివిధ స్థాయిల్లో ఏఐ వినియోగానికి సంబంధించి కంపెనీ బోధనాంశాలను రూపొందించనుంది. అలాగే హ్యాకథాన్స్ మొదలైనవి కూడా నిర్వహించనుంది. అటు విప్రో వెంచర్స్ ద్వారా ఆధునిక స్టార్టప్‌లలో ఇన్వెస్ట్ కూడా చేయడంతో పాటు జెన్ ఏఐ సీడ్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ ద్వారా జనరేటివ్ఏఐ ఆధారిత స్టార్టప్‌లకు శిక్షణ కల్పించనుంది.

ఉన్నత విద్యకు 'జీఆర్‌టీ జ్యువెలర్స్' చేయూత



హైదరాబాద్: ప్రతిభ కలిగిన విద్యార్థుల్లో ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు 'జీఆర్‌టీ జ్యువెలర్స్' చేయూత అందించింది. ఈ విద్యా సంవత్సరం (2023-24) మొదటి లేదా రెండో ఏడాది ఇంజనీరింగ్, ఆర్ట్స్, సైన్స్ సబ్జెక్టులు చదువుతున్న వారిలో అర్హులైన 100 మంది విద్యార్థులకు రూ.50 లక్షల ఉపకార వేతనాలు మంజూరు చేసింది. కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయితే డిగ్రీ పూర్తయ్యే వరకు ఈ సాయం కొనసాగుతుందని వెల్లడించింది. ఉన్నత విద్య ద్వారానే సామాజిక చైతన్యం అభివృద్ధి చెందుతుందని కంపెనీ తెలిపింది.

టీసీఎస్ బోణీ.. బాగుంది!

- క్యూ1 లాభం రూ. 11,074 కోట్లు
- మొత్తం ఆదాయం రూ. 59,381 కోట్లు

ముంబై: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) తొలి త్రైమాసిక(క్యూ1) ఫలితాలతో సీజన్‌కు తెరతీసింది. ఈ ఆర్థిక సంవత్సరం(2023-24) ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం వార్షికంగా 17 శాతం ఎగసి రూ. 11,074 కోట్లను తాకింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 9,478 కోట్లు ఆర్జించింది. అయితే గతేడాది క్యూ4(జనవరి-మార్చి)లో సాధించిన రూ. 11,392 కోట్లతో పోలిస్తే లాభాలు స్వల్పంగా తగ్గాయి. ఇక మొత్తం ఆదాయం 13% పుంజుకుని రూ. 59,381 కోట్లకు చేరింది. గతేడాది క్యూ4లో రూ. 59,162 కోట్ల ఆదాయం నమోదైంది.

ఆర్డర్‌బుక్ జోష్

టీసీఎస్ ప్రస్తుత ఆర్డర్‌బుక్ విలువ బిజినెస్ పటిష్టతను చాటుతూ 10.2 బిలియన్ డాలర్లను తాకింది. నిర్వహణ లాభ మార్జిన్లు 23.1 శాతం నుంచి స్వల్పంగా మెరుగుపడి 23.2 శాతానికి చేరాయి. ఉద్యోగులకు వార్షిక వేతన పెంపు చేపట్టినప్పటికీ మార్జిన్లు మెరుగుపరచుకోగలిగినట్లు కంపెనీ సీఎఫ్‌వో సమీర్ సేక్సారియా పేర్కొన్నారు. అత్యుత్తమ పనితీరు చూపిన ఉద్యోగులకు 12-15 శాతం వేతన పెంపును చేపట్టినట్లు మానవ వనరుల చీఫ్ మిలింద్ లక్కడ్ వెల్లడించారు. కాగా.. కీలక మార్కెట్లలో సవాళ్ల కారణంగా సమీప భవిష్యత్‌లో దేశీ ఐటీ రంగం ఆటుపోట్లను చవిచూసే వీలున్నట్లు పరిశ్రమ నిపుణులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

విభాగాల వారీగా

క్యూ1లో లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ విభాగంలో ఐటీ సర్వీసుల ఆదాయం 10.1 శాతం పురోగమించగా.. కంపెనీకి ప్రధానమైన బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ) నుంచి 3 శాతమే వృద్ధి నమోదైనట్లు టీసీఎస్ పేర్కొంది. ప్రాంతాలవారీగా చూస్తే యూకే 16.1 శాతం వృద్ధిని అందుకోగా.. సాఫ్ట్‌వేర్ సేవలకు ప్రధానమైన ఉత్తర అమెరికా బిజినెస్ 4.6 శాతమే బలపడింది.

ఫలితాల వెల్లడి, మార్కెట్ల క్షీణత నేపథ్యంలో టీసీఎస్ షేరు బీఎస్‌ఈలో 0.4 శాతం నీరసించి రూ. 3,260 వద్ద ముగిసింది.



డిమాండ్ కొనసాగుతుంది

దీర్ఘకాలంలో కంపెనీ సర్వీసులకు డిమాండ్ కొనసాగనున్నట్లు విశ్వసిస్తున్నాం. కొత్త టెక్నాలజీల అవసరం ఇందుకు దోహదం చేయనుంది.
-కె.కృతివాసన్, కొత్త సీఈవో, ఎండీ

ఇతర హైలైట్స్

- క్యూ1లో నికరంగా 523 ఉద్యోగులను జత చేసుకుంది.
- జూన్‌కల్లా మొత్తం సిబ్బంది సంఖ్య 6.15 లక్షలకు చేరింది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 17.8 శాతంగా నమోదైంది.

ఆఖర్లో అమ్మకాలు

- 19,400 దిగువకు నిఫ్టీ
- సెన్సెక్స్ 224 పాయింట్ల నష్టం
- మూడు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై: ఆఖరి గంట అమ్మకాలతో ఆరంభ లాభాల్ని కోల్పోయిన స్టాక్ సూచీలు బుధవారం నష్టాలను చవిచూశాయి. దేశీయ ద్రవ్యోల్బణ, పారిశ్రామికోత్పత్తి గణాంకాల వెల్లడి, ఐటీ దిగ్గజాలు టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ కంపెనీల క్యూ1 ఆర్థిక ఫలితాల వెల్లడి నేపథ్యంలో మార్కెట్లో అప్రమత్తత చోటు చేసుకుంది. ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో అధికంగా లాభాల స్వీకరణ జరిగింది. సెన్సెక్స్ ఇంట్రాడేలో 65,320 వద్ద కనిష్టాన్ని, 65,812 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 224 పాయింట్ల నష్టంతో 65,394 వద్ద స్థిరపడింది. నిఫ్టీ రోజంతా 19,362-19,508 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 55 పాయింట్ల పతనంతో 19,384 వద్ద నిలిచింది. దీంతో సూచీల మూడు రోజుల వరుస ర్యాలీకి బ్రేక్ పడినట్లైంది. డాలర్ మారకంలో రూపాయి విలువ 23 పైసలు బలపడి 82.18 స్థాయి వద్ద స్థిరపడింది.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- జీఎస్‌టీ మండలి క్యాసినోలపై 28% జీఎస్‌టీ విధింపుతో డెల్టా కార్ప్ షేరు లిస్టింగ్ తేదీ నాటి నుంచి ఒక రోజులో అతి పెద్ద పతనాన్ని చవిచూసింది. ఏకంగా 28% క్షీణించి రూ. 178 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 23% నష్టపోయి రూ.189 వద్ద ముగిసింది.
- రిలయన్స్ (రూ.2,802), ఎయిర్‌టెల్ (రూ.895), సన్ ఫార్మా (రూ.1,083), హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ (రూ.2,350), ఇండిగో (రూ.2,744), జైడస్ లైఫ్‌సైన్సెస్ (రూ.595), టాటా మోటార్స్ డీవీఆర్ (రూ.345), షేర్లు ఏడాది గరిష్టాన్ని నమోదు చేశాయి.

మ్యాక్సివిజన్‌లో క్వాడ్రియా పెట్టుబడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కంటి వైద్య సేవలు అందిస్తున్న మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్స్ తాజాగా రూ.1,300 కోట్ల నిధులను సమీకరిస్తోంది. ఆరోగ్య సేవల రంగంలో పెట్టుబడులు చేస్తున్న క్వాడ్రియా క్యాపిటల్ ఈ మొత్తాన్ని సమకూరుస్తోంది. మ్యాక్సివిజన్‌లో మైనారిటీ వాటా కోసం క్వాడ్రియా సుమారు రూ.600 కోట్ల ప్రారంభ పెట్టుబడి, అలాగే అదనపు వాటా కోసం మరో రూ.700 కోట్ల వరకు తదుపరి పెట్టుబడి చేయనుంది. మ్యాక్సివిజన్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోసహా ఆరు రాష్ట్రాల్లో 42 కేంద్రాలను నిర్వహిస్తోంది. మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్స్‌ను 1996లో డాక్టర్ కె.పి.రెడ్డి స్థాపించారు. 2010లో ఈ సంస్థను డాక్టర్ జీఎస్‌కే వేలు చేజిక్కించుకున్నారు.



ఎకానమీకి గణాంకాల ఊరట...

- నిర్దేశిత స్థాయిలోనే జూన్ వినియోగ ధరల స్పీడ్
- 4.81 శాతంగా నమోదు
- మేలో పరిశ్రమల మెరుగైన పనితీరు
- ఉత్పత్తిలో 5.2 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: భారత్ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి బుధవారం వెలువడిన గణాంకాలు ఎకానమీకి కొంత ఊరటనిచ్చాయి. వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం జూన్ నెల్లో మూడు నెలల గరిష్ట స్థాయిలో 4.81 శాతంగా నమోదవగా, మే నెల పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో 5.2 శాతం పురోగతి నెలకొంది. తయారీ, మైనింగ్ రంగాలు మంచి పనితీరును ప్రదర్శించాయి. రిటైల్ ద్రవ్యోల్బణం జూన్ నెల్లో మూడు నెలల గరిష్ట స్థాయిని చూసినా, అది ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న స్థాయిలోనే ఉండడం ఊరట నిస్తున్న అంశం.



అన్ని విభాగాలూ పురోగతిలోనే...

- మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో దాదాపు 70 శాతం వాటా ఉన్న తయారీ రంగం 5.7 శాతం వృద్ధిని (గత ఆర్థిక సంవత్సరం ఇదే నెల విలువతో పోల్చి) నమోదుచేసుకుంది.
- విద్యుత్ ఉత్పత్తి 0.9% వృద్ధి నమోదయ్యింది.
- మైనింగ్‌లో 6.4 శాతం పురోగతి ఉంది.
- క్యాపిటల్ గూడ్స్ విభాగంలో 8.2 శాతం వృద్ధి.
- కన్జూమర్ డ్యూరబుల్స్ ఉత్పత్తిలో 1.1% వృద్ధి.
- మౌలిక, నిర్మాణ రంగంలో వృద్ధి రేటు 14%.

ఏప్రిల్- మే నెలల్లో...

ఆర్థిక సంవత్సరం మొదటి రెండు నెలల్లో పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో 4.8 శాతం వృద్ధి నమోదయ్యింది. గత ఏడాది ఇదే నెలల్లో ఈ రేటు 12.9 శాతంగా నమోదయ్యింది.

పెరిగిన ఆహార ధరలు



ఆహార ధరలు పెరగడంతో రిటైల్ ద్రవ్యోల్బణం జూన్ నెలలో 4.81 శాతంగా (2022 జూన్‌తో పోల్చి) నమోదయ్యింది. అంతక్రితం మూడు నెలల్లో ఈ స్థాయి పెరుగుదల ఇదే తొలిసారి. రిటైల్ ద్రవ్యోల్బణం ప్లస్ 2 లేదా మైనస్ 2తో 4% వద్ద ఉండాలి. ఈ ప్రాతిపదిక రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న స్థాయిలోనే ఉందని భావించవచ్చు. కాగా ఒక్క ఆహార బాస్కెట్‌ను చూస్తే, ద్రవ్యోల్బణం 4.49%గా ఉంది. మేలో ఈ రేటు 2.95 శాతమే.

హెచ్‌సీఎల్ టెక్ లాభం ఓకే

- క్యూ1లో రూ. 3,534 కోట్లు
- షేరుకి రూ. 10 డివిడెండ్

ముంబై: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఈ ఆర్థిక సంవత్సరం(2023-24) తొలి త్రైమాసికానికి(క్యూ1) ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ1(ఏప్రిల్-జూన్)లో నికర లాభం వార్షికంగా 7 శాతం బలపడి రూ. 3,534 కోట్లను తాకింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 3,324 కోట్లు ఆర్జించింది. అయితే గతేడాది క్యూ4(జనవరి-మార్చి)లో సాధించిన రూ. 3,983 కోట్లతో పోలిస్తే లాభాలు 11 శాతం క్షీణించాయి. ఇక మొత్తం ఆదాయం 12 శాతం ఎగసి రూ. 26,296 కోట్లకు చేరింది. గతేడాది క్యూ1లో రూ. 23,464 కోట్ల ఆదాయం నమోదైంది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 10 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. డివిడెండు చెల్లింపునకు ఈ నెల 20 రికార్డ్ డేట్‌గా నిర్ణయించింది.



ఇతర విశేషాలు

- కొత్తగా 1,597 మంది ఫ్రెషర్స్‌కు ఉపాధి
- క్యూ1లో నికరంగా 2,506 మంది ఉద్యోగులు తగ్గారు.
- జూన్‌కల్లా మొత్తం సిబ్బంది సంఖ్య 2,23,438కు చేరింది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 16.3 శాతంగా నమోదైంది.

ఫలితాల వెల్లడి నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్ షేరు బీఎస్‌ఈలో 0.7 శాతం క్షీణించి రూ. 1,107 వద్ద ముగిసింది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీలో బీఎస్సీ, బీటెక్ ప్రవేశాలు

ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ.. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి అండర్ గ్రాడ్యుయేట్ వ్యవసాయ బీఎస్సీ, అనుబంధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **ఇంటర్‌లో బైపీసీ స్ట్రీమ్ కోర్సులు:** బీఎస్సీ(హానర్స్) వ్యవసాయం, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) కోర్సులకు ఈఏపీసెట్-2023లో అర్హత సాధించిన అభ్యర్థులు అర్హులు. ఎన్నారై కోటాలో బీఎస్సీ(హానర్స్)వ్యవసాయం, కమ్యూనిటీ సైన్స్ కోర్సులకు ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. -ఎంపీసీ స్ట్రీమ్ కోర్సులు బీటెక్(వ్యవసాయ ఇంజనీరింగ్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ)ల్లో రైతు కోటాలో ప్రవేశాలకు ఈఏపీసెట్-2023లో ర్యాంకులు సాధించిన వారు అర్హులు.
» **మొత్తం సీట్ల సంఖ్య:** 1117
» **కోర్సులు-సీట్ల సంఖ్య:** బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్-1062, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ)-55.
» **అర్హత:** ఇంటర్మీడియట్(ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్ లేదా నేచురల్ సైన్సెస్) ఉత్తీర్ణతతో పాటు ఏపీ ఈఏపీసెట్-2023 ర్యాంకు సాధించి ఉండాలి. » **వయసు:** 31.12.2023 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఏపీ ఈఏపీసెట్-2023 ర్యాంకు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 27.07.2023.
» **వెబ్‌సైట్:** https://ugadmissionsangrau.aptonline.in

ఏపీ వైద్య కళాశాలల్లో పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్(ఏపీఎస్ఏహెచ్‌పీసీ)..2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, ప్రైవేటు పారామెడికల్ కళాశాలల్లో వివిధ పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సులు:** డీఎంఎల్‌టీ, డీఎంఐటీ, డీఓఏ, డీడీఐఏఎల్‌వై, డీఆర్‌ఈఎస్‌టీ, డీఎంఎస్‌టీ, డీఈఆర్ఎఫ్‌యూ, డీఓటీ, డీఆర్‌టీటీ, డీఆర్‌జీఏ, డీడీఆర్‌ఏ, డీకార్డియో, డీసీఎల్‌టీ, డీఈసీజీ, డీఏఎన్ఎస్, డీఎంపీహెచ్ఏ.
» **అర్హత:** రెండేళ్ల కాలపరిమితి గల ఈ పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఇంటర్మీడియట్, బైపీసీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 16 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులకు సంబంధించి ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుంది.
» **కాలేజీలు-జిల్లాలు:** ఏపీలో మొత్తం తొమ్మిది ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, జిల్లాల్లోని పలు ప్రైవేటు పారామెడికల్ కళాశాలల్లో వివిధ పారా మెడికల్ కోర్సులను అందిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉన్న సీట్లకు ఆ కాలేజీ పరిధిలోని జిల్లాలకు చెందిన అభ్యర్థులు(లోకల్) దరఖాస్తు చేసుకోవాలి.
» **సీట్ల సంఖ్య:** తొమ్మిది గవర్నమెంట్ కాలేజీల్లో వివిధ పారామెడికల్ కోర్సుల్లో మొత్తం 1053 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఆయా కాలేజీల పరిధిలోకి వచ్చే జిల్లాలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. అలాగే వివిధ జిల్లాల్లో ఉన్న ప్రైవేట్ పారామెడికల్ కాలేజీల్లో 17,254 పారా మెడికల్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో మొత్తం 18,307 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
» **ఎంపిక విధానం:** బైపీసీ విద్యార్థులు అందుబాటులో లేకుంటే ఎంపీసీ విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తారు.ఈ రెండు గ్రూపు విద్యార్థుల లేకుంటే.. ఇతర గ్రూపు విద్యార్థులకు ప్రవేశం కల్పించే అవకాశం ఉంది. సీట్లను ప్రభుత్వ రిజర్వేషన్ల మేరకు ప్రతిభ ఆధారంగా కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ప్రభుత్వ కళాశాలల్లో ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు వెబ్‌సైట్‌లో సూచించిన దరఖాస్తు నమూనాను పూర్తి చేసి సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ చిరునామకు పంపాలి. » ప్రైవేటు పారామెడికల్ కళాశాలల్లో దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత జిల్లా వైద్యారోగ్య అధికారికి కార్యాలయం చిరునామకు పంపాల్సి ఉంటుంది.
» **దరఖాస్తుతో జత చేయాల్సిన సర్టిఫికేట్‌లు:** పదో తరగతి సర్టిఫికేట్, ఆధార్ కార్డు, ఇంటర్ సర్టిఫికేట్-మార్క్ షీట్స్, ఆరు నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికేట్లు, క్యాస్ట్ సర్టిఫికేట్ తదితరాలు జత చేయాలి.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.07.2023.
» **కౌన్సెలింగ్ నిర్వహణ,అభ్యర్థుల కేటాయింపు:** 01.08.2023.
» **తరగతులు ప్రారంభం:** 01.09.2023.
» **వెబ్‌సైట్:** appmb.co.in/apsahpc.co.in


కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ప్రవేశాలు

కొచ్చిలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, మెరైన్ ఇంజనీరింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ .. 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీరింగ్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం సీట్ల సంఖ్య:** 114
» **అర్హత:** బీఈ, బీటెక్(మెకానికల్ ఇంజనీరింగ్/మెకానికల్ స్ట్రీమ్ ఆఫ్ ఇంజనీరింగ్/నేవల్ ఆర్కిటెక్చర్ స్ట్రీమ్ ఆఫ్ ఇంజనీరింగ్/మెరైన్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, మెడికల్ ఫిట్‌నెస్,సైకలాజికల్ స్క్రీనింగ్ టెస్ట్ ఆధారంగా.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.07.2023.
» **వెబ్‌సైట్:** www.cslmeti.in

బీటెక్ తర్వాత పయనమెటు..!

బీటెక్.. నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సు! ఈ కోర్సు పూర్తి చేసుకుంటే.. విస్తృత కెరీర్ అవకాశాలు ఖాయమనే భావన! అందుకే ఏటా లక్షల మంది విద్యార్థులు బీటెక్‌లో చేరి బంగారు భవిష్యత్తు కోసం కృషి చేస్తుంటారు. ఇంజనీరింగ్ తర్వాత కొంతమంది ఉన్నత విద్య లక్ష్యంగా చేసుకుంటే.. మరికొందరు ఉద్యోగావకాశాలపై దృష్టిపెడతారు. ఈ నేపథ్యంలో.. బీటెక్ ఉత్తీర్ణులకు అందుబాటులో ఉన్న ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలపై ప్రత్యేక కథనం..

» బీటెక్ అర్హతతో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు
» గేట్ స్కోర్‌తో ఎంటెక్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశం
» ఇంజనీరింగ్ తర్వాత పలు సర్కారీ కొలువులు
» ఐఐఎంల్లో మేనేజ్‌మెంట్ పీజీకి మార్గం క్యాట్
» విదేశాల్లో ఎంఎస్, ఎంబీఏ చదివే అవకాశం



ప్రస్తుత పరిస్థితుల్లో నాలుగేళ్ల బీటెక్ కోర్సును పూర్తి చేసుకున్న అభ్యర్థులకు విస్తృతమైన ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీరింగ్ తర్వాత క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా కార్పొరేట్ కొలువులు ఖాయం అవుతాయి. అంతేకాకుండా ప్రభుత్వ విభాగాల్లోనూ ఉద్యోగాలు సొంతం చేసుకునే వీలుంది. దీంతోపాటు బీటెక్ తర్వాత గేట్ ద్వారాప్రతిష్టాత్మక ఐఐటీల్లో ఎంటెక్, క్యాట్‌తో ఐఐఎంల్లో ఎంబీఏలో చేరొచ్చు.

గేట్‌తో.. ఎంటెక్ బాట

బీటెక్ ఉత్తీర్ణులు ఎక్కువ మంది ఎంటెక్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఎంటెక్‌లో అడుగుపెట్టాలంటే.. జాతీయ స్థాయిలో నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్(గేట్)లో స్కోర్ సాధించాల్సి ఉంటుంది. గేట్‌లో ర్యాంకు ఆధారంగా ఐఐటీలు, ఎన్ఐటీలు, వివిధ కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఎంటెక్‌లో ప్రవేశం లభిస్తోంది. రాష్ట్ర స్థాయిలోని యూనివర్సిటీలు సైతం గేట్ ఉత్తీర్ణులకు ఎంటెక్ సీట్ల కేటాయింపులో తొలి ప్రాధాన్యం ఇస్తున్నాయి.గేట్‌ను ప్రతి ఏటా ఫిబ్రవరిలో నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ సెప్టెంబర్/అక్టోబర్‌ల్లో వెలువడుతుంది. గేట్ స్కోర్‌తో ఎంటెక్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ కూడా లభిస్తుంది.

పీజీఈసెట్

రాష్ట్ర స్థాయిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎంటెక్‌లో చేరేందుకు మార్గం.. పోస్ట్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(పీజీఈసెట్). ఇందులో స్కోర్ ఆధారంగా.. యూనివర్సిటీ అనుబంధ కళాశాలలతోపాటు, ప్రైవేట్ కళాశాలల్లో ఎంటెక్‌లో అడుగు పెట్టొచ్చు.

క్యాట్‌తో మేనేజ్‌మెంట్ పీజీ

బీటెక్ అభ్యర్థులు ఆసక్తి చూపుతున్న మరో కోర్సు.. మేనేజ్‌మెంట్ పీజీ లేదా ఎంబీఏ. దేశంలో మేనేజ్‌మెంట్ విద్యను అందించడంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)లకు మంచి పేరుంది. వీటిల్లో చేరేందుకు మార్గం.. కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్). ఆన్‌లైన్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా ఐఐఎంలు ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తాయి. రాత పరీక్షలో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీడింగ్ కాంప్రహెన్షన్ అండ్ వెర్బల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా సఫిషియన్సీ అంశాలపై ప్రశ్నలుంటాయి. ఐఐఎంలే కాకుండా..దేశంలోని ప్రముఖ బిజినెస్ స్కూళ్లు కూడా క్యాట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. ఎన్ఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశానికి ఈ స్కోరే ప్రామాణికం. రాష్ట్ర స్థాయిలోని కళాశాలల్లో ఎంబీఏలో చేరాలంటే.. ఐసెట్(ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)లో ర్యాంకు సాధించాల్సి ఉంటుంది.

సీఎస్ఐఆర్ యూజీసీ నెట్

పరిశోధనలపై ఆసక్తి ఉన్న బీటెక్ ఉత్తీర్ణులు సీఎస్ఐఆర్-యూజీసీ నెట్‌కు హాజరుకావచ్చు. కెమికల్ సైన్సెస్; ఎర్త్, అట్మాస్ఫియరిక్ సైన్సెస్, ఓషియన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్; లైఫ్ సైన్సెస్; మ్యాథమెటికల్ సైన్సెస్; ఫిజికల్ సైన్సెస్ విభాగాల్లో పరిశోధనల కోసం పీహెచ్‌డీకి అభ్యర్థులను ఎంపిక చేసే ఎంట్రన్స్ సీఎస్ఐఆర్ యూజీసీ-నెట్. దీనిద్వారా బీటెక్‌తోనే ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీకి ఎంపికైన వారికి మూడేళ్ల పాటు నెలకు రూ.31 వేలు చొప్పున జేఆర్ఎఫ్(జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్), ఆ తర్వాత పీహెచ్‌డీకి నమోదు చేసుకుంటే నెలకు రూ.35 వేలు చొప్పున ఎస్ఆర్ఎఫ్(సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్) లభిస్తుంది. ఇలా గరిష్ఠంగా మొత్తం అయిదేళ్ల పాటు జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్‌లు లభిస్తాయి.

విదేశీ విద్యకు ఇలా

బీటెక్ పూర్తిచేసిన విద్యార్థుల్లో ఎక్కువ మంది లక్ష్యం విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించడమంటే అతిశయోక్తి కాదు. విదేశాల్లో చదవాలంటే.. జీఆర్ఈ, టోఫెల్ వంటి టెస్ట్‌ల్లో మంచి స్కోర్ సాధించాలి. సంబంధిత యూనివర్సిటీలో ప్రవేశం ఖరారయ్యాక వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. మేనేజ్‌మెంట్ కోర్సులు చదవాలనుకునే వారు..గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(జీమ్యాట్)లాంటి పరీక్షల్లో మంచి స్కోరు సాధించాలి. ప్రస్తుతం మన దేశ విద్యార్థులు ఎక్కువగా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా తదితర దేశాలకు ఉన్నత విద్య కోసం పయనమవుతున్నారు.

ఉద్యోగావకాశాలు అందుకునేలా

బీటెక్ ఉత్తీర్ణులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు కూడా సొంతం చేసుకునే అవకాశముంది. ఆ వివరాలు..

గేట్ స్కోర్‌తో.. పీఎస్‌యూ కొలువు

గేట్ స్కోర్ ఆధారంగా దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలు(పీఎస్‌యూ) ఇంజనీర్ ట్రైనీ, ఎగ్జిక్యూటివ్ ట్రైనీ నియామకాలు చేపడుతున్నాయి. గేట్ స్కోర్‌తో ఆయా సంస్థలకు దరఖాస్తు చేసుకుంటే.. మలిదశలో గ్రూప్ డిస్కషన్, గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహించి ఎంపిక చేస్తారు. పీఎస్‌యూ కొలువు ఖాయమైతే ప్రారంభంలోనే నెలకు రూ.50 వేలకు పైగా వేతనం లభిస్తోంది. గేట్‌లో కనీసం 700 స్కోర్ సాధిస్తే పీఎస్‌యూల్లో ఉద్యోగావకాశాలు మెరుగవుతాయి.

ఈఐఎస్‌తో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో

బీటెక్ ఉత్తీర్ణులకు కేంద్ర ప్రభుత్వ కొలువు సొంతం చేసుకునేందుకు చక్కటి మార్గం.. ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(ఈఎస్ఈ). ఈ పరీక్షలో ర్యాంకు ఆధారంగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని దాదాపు 40కు పైగా శాఖల్లో.. సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో.. గ్రూప్-ఎ, గ్రూప్-బి హోదాలో గెజిటెడ్ ర్యాంకులో ఇంజనీర్లుగా నియామకాలు ఖరారు చేస్తారు. ఎంపిక ప్రక్రియలో మూడు దశలు(ప్రిలిమ్స్ రాత పరీక్ష, మెయిన్స్ రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ) ఉంటాయి. ప్రిలిమ్స్‌ను 500 మార్కులకు, మెయిన్స్‌ను 600 మార్కులకు నిర్వహిస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూకు 200 మార్కులు ఉంటాయి.

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోనూ ఉద్యోగాలు

ఇంజనీరింగ్ పూర్తి చేసిన అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోనూ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులు అందుబాటులో ఉంటాయి. ఇరిగేషన్ అండ్ క్యాడ్, వాటర్ వర్క్స్, రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్, హౌసింగ్ డెవలప్‌మెంట్ వంటి శాఖల్లో ఏఈ పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వ పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నోటిఫికేషన్లు విడుదల చేస్తాయి. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా ఆయా పోస్టులకు నియామకాలను ఖరారు చేస్తారు.

ప్రైవేట్ రంగంలో

బీటెక్ తర్వాత ప్రైవేట్ రంగంలోనూ అవకాశాలు విస్తృతమవుతున్నాయి. ఉత్పత్తి రంగం నుంచి సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ వరకూ.. వివిధ రంగాల్లో ఉద్యోగాలకు ఆయా సంస్థలు ప్రకటనలు ఇస్తున్నాయి. సబ్జెక్టుపై పట్టుతోపాటు ఇంటర్న్‌షిప్, అప్రెంటిషిప్ వంటి మార్గాల ద్వారా ప్రాక్టికల్ నైపుణ్యాలు పెంచుకుంటే.. కోరుకున్న కంపెనీల్లో కొలువు దక్కించుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇటీవల కాలంలో సంస్థలు క్యాంపస్ ప్లేస్‌మెంట్ ప్రక్రియలకే పరిమితం కాకుండా. ఆఫ్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్, వాక్-ఇన్స్ నిర్వహిస్తూ అభ్యర్థులను ఎంపిక చేసుకుంటున్నాయి.

సర్టిఫికేషన్స్‌తో అవకాశాలు

బీటెక్ విద్యార్థులు ప్రైవేట్ రంగంలో అవకాశాలను దక్కించుకునేందుకు జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న అంశాల్లో సర్టిఫికేషన్స్ చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, ఐఓటీ, క్లౌడ్ కంప్యూటింగ్, 3-డి డిజైన్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అంశాల్లో నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారా జాబ్ మార్కెట్ అవకాశాలను చేజిక్కించుకోవచ్చు. ప్రస్తుతం ఈ కోర్సులను పలు సంస్థలు ఆన్‌లైన్ విధానంలో అందిస్తున్నాయి.



మనిషికి నిత్యం సంతోషాన్నిచ్చేది ఏంటి?

ఈ ప్రశ్నకు సమాధానం కోసం తరతరాలుగా అన్వేషణ సాగుతూనే ఉంది.

మనిషికి నిత్యం సంతోషాన్నిచ్చేది ఏంటి? ఈ ప్రశ్నకు సమాధానం కోసం తరతరాలుగా అన్వేషణ సాగుతూనే ఉంది. తత్వవేత్తల నుంచి యోగుల వరకూ ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడానికి ప్రయత్నించారు. యోగం, భోగం నిరంతరంగా ఆనందాన్ని ఇవ్వలేవు. ధనం, పదవి, హోదా వంటివి కూడా ఎప్పటికీ మనిషిని ఆనందదాయకంగా ఉంచలేవనేది అందరూ అంగీకరించే విషయమే. మరి ఏ అంశం మనిషిని నిత్య సంతోషిగా మార్చగలదు? దీనికి సమాధానం కనుగొనేందుకు హార్వర్డ్ యూనివర్సిటీ దశాబ్దాలుగా పరిశోధన చేస్తోంది. ఒకప్పుడు ప్రపంచాన్ని కుదిపేసిన ఆర్థిక సంక్షోభం–గ్రేట్ డిప్రెషన్ కాలంలో మొదలై, ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా మహమ్మారి తర్వాతి కాలం దాకా కొనసాగిన ఈ పరిశోధన.. తమ చుట్టూ ఉన్నవారితో కొనసాగే ఆరోగ్యకరమైన సంబంధాలే మనిషి ఆనందకరమైన జీవితం సాగించడానికి దోహదపడుతుందని తేల్చింది.

ఆనందం అంబరమైతే..

- చుట్టూ ఉన్నవారితో ఆరోగ్యకర సంబంధాలే సంతోషకర జీవితానికి మార్గం
- మంచి మానసిక ఆరోగ్యం.. తద్వారా శారీరక ఆరోగ్యానికీ తోడ్పాటు
- హార్వర్డ్ యూనివర్సిటీ సుదీర్ఘ అధ్యయనంలో వెల్లడి
- స్వార్థం, ప్రతికూల ఆలోచనలు.. అన్నింటిపైనా శత్రు భావనను పెంచుతాయన్న శాస్త్రవేత్తలు


దొడ్డ శ్రీనివాస్‌రెడ్డి

మనిషి సంతోషదాయకమైన జీవితం గడిపేందుకు కారణమయ్యే అంశం ఏమై ఉంటుందనే మీమాంసకు సమాధానం వెదికేందుకు 1938లో హార్వర్డ్ యూనివర్సిటీ 'హార్వర్డ్ స్టడీ ఆఫ్ అడల్ట్ డెవలప్‌మెంట్' పేరిట పరిశోధనా ప్రాజెక్టు మొదలుపెట్టింది. వందలాది మంది జీవితాలను దశాబ్దాలు పరిశీలిస్తూనే ఉంది. మనిషి జీవన విధానంపై ప్రపంచంలో అత్యంత సుదీర్ఘకాలం సాగిన ఈ పరిశోధనలో తేలిన విషయం ఏమిటంటే.. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో మనకు ఉన్న సంబంధాలే మన మానసిక ఆరోగ్యానికి, తద్వారా శారీరక ఆరోగ్యానికి దోహదపడుతుంది.

సత్సంబంధాలే కొలమానం

ఒంటరితనం మనిషిని కుంగదీస్తుందని.. ఆరోగ్యకరమైన సంఘ జీవనం మానసిక, శారీరక ఆరోగ్యాన్నిస్తుందని అధ్యయనానికి నేతృత్వం వహిస్తున్న హార్వర్డ్ మెడికల్ స్కూల్ మానసిక శాస్త్రం ప్రొఫెసర్ రాబర్ట్ వాల్డింగర్ అంటున్నారు. మనిషి తన చుట్టూ అల్లుకున్న ఆరోగ్యకర బంధాల ఫలితంగా సంతోషకరమైన జీవితాన్ని నిరంతరంగా కొనసాగిస్తాడని పేర్కొన్నారు. తమ పరిశోధన ఫలితాలపై 2015లో వాల్డింగర్ చేసిన 'టెడ్ టాక్' ప్రసంగాన్ని ఇప్పటివరకు నాలుగున్నర కోట్ల మంది వీక్షించడం గమనార్హం. హార్వర్డ్ మాత్రమే కాకుండా ఐక్యరాజ్యసమితి సహా అనేక సంస్థలు నిర్వహించిన పరిశోధనల్లో కూడా మనిషికి తన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఉన్న సత్సంబంధాలే మానసిక, శారీరక ఆరోగ్యానికి కొలమానాలు కాగలవని తేలింది. మనిషి తన 50వ ప్రాయంలో చుట్టూ ఉన్న అనుబంధాల పట్ల ఎంత సంతృప్తితో ఉన్నాడనేదే అతడి శారీరక ఆరోగ్యానికి కూడా కొలమానం కాగలదని, కొలెస్ట్రాల్ స్థాయి కాదని పరిశోధకులు అంటున్నారు. కోవిడ్ తదనంతర కాలంలో ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో ఇతరులపట్ల సహానుభూతి స్థాయి పెరగడం సంతోషకర పరిణామమని ఐక్యరాజ్యసమితి సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్ నెట్‌వర్క్ తాజా నివేదిక పేర్కొంది. ఇతరుల పట్ల సహానుభూతి, అపరిచితులపట్ల సానుభూతి స్థాయి ప్రపంచవ్యాప్తంగా 2021 నుంచీ పెరుగుతూ వస్తోందని వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్టుకు రూపకల్పన చేసినవారిలో ఒకరైన జాన్ హెల్లీవెల్ అన్నారు.

మిస్టర్ సంతోషి!



ప్రపంచం మొత్తంలో అత్యంత సంతోషకర జీవితం గడుపుతున్న వ్యక్తి ఎవరనే విషయం తేల్చడానికి విస్కాన్సిన్ యూనివర్సిటీ 12 ఏళ్లపాటు పరిశోధించి మాథ్యూ రికార్డ్ అనే బౌద్ధ భిక్షువును ఎంపిక చేసింది. మాలిక్యులర్ జెనెటిక్స్‌లో పీహెచ్‌డీ చేసిన మాథ్యూ తదనంతరం బౌద్ధ భిక్షువుగా మారారు. వర్సిటీ శాస్త్రవేత్తలు మాథ్యూ రికార్డ్ తలకు 256 సెన్సర్లను తగిలించి వివిధ అంశాలపై పరిశోధన చేశారు. ఆయన మెదడు అధిక స్థాయిలో గామా తరంగాలను ఉత్పత్తి చేస్తోందని కనుగొన్నారు.

మాథ్యూ మెదడు ఎటువంటి ప్రతికూల భావనలకు చోటు ఇవ్వకుండా ఎల్లప్పుడూ సానుకూల ధోరణిలో ఉండేట్టు చేస్తోందని వెల్లడించారు. ''ఎల్లప్పుడూ నేనే, నాదే అనే భావన.. ప్రపంచంలో ఇతర అంశాలన్నింటి పట్లా శత్రు భావనను రేకెత్తిస్తుంది. మనిషిని నిత్యం అలజడిలో ఉంచుతుంది. అదే ఇతరుల పట్ల సహానుభూతి పెంచుకుంటూ ఉంటే మానసిక ఆరోగ్యం తద్వారా శారీరక ఆరోగ్యం ఇనుమడిస్తుంది.'' అని మాథ్యూ రికార్డ్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు.

ఆనంద నిలయం ఫిన్‌లాండ్

ఫిన్‌లాండ్ ప్రపంచంలో అత్యంత సంతోషకర దేశంగా వరుసగా ఆరోసారి ఎంపికైంది. పౌరుల జీవన విధానం ఆధారంగా అమెరికాకు చెందిన గాలప్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో ఫిన్‌లాండ్ మొదటిస్థానంలో నిలవగా.. దాని పొరుగు దేశాలు డెన్మార్క్, ఐస్‌లాండ్, స్వీడన్, నార్వే తదుపరి స్థానాల్లో ఉన్నాయి. ఆరోగ్యకర జీవితం, సగటు ఆదాయం, సామాజిక భద్రత, అవినీతి రహితం, సహానుభూతి, తమ జీవితానికి సంబంధించి నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ పౌరులకు ఉండటం వంటి అంశాలు/లక్షణాల ఆధారంగా దేశాలకు ర్యాంకులు ఇచ్చినట్టు గాలప్ సంస్థ వెల్లడించింది. ఐక్యరాజ్యసమితి ఏటా విడుదల చేసే హ్యాపీనెస్ ఇండెక్స్ కూడా ఫిన్‌లాండ్‌ను అత్యంత సంతోషకర దేశంగా పేర్కొంది. ఫిన్‌లాండ్ పౌరుల మధ్య ఆర్థిక అసమానతలు అతి తక్కువ స్థాయిలో ఉండటం, ప్రభుత్వం పట్ల విశ్వాసం ఉండటం కూడా ప్రజల మధ్య సయోధ్య ఎక్కువ స్థాయిలో ఉందని పేర్కొంది.

ఆనందాల హార్మోన్లు

మనిషి ఆనందాన్ని మరింత ఇనుమడింపజేయడానికి శరీరం పలు రకాల హార్మోన్లను (రసాయనాలను) విడుదల చేస్తుంది. వాటిలో నాలుగు ముఖ్యమైన హార్మోన్ల గురించి తెలుసుకుందాం.

సెరటోనిన్: శాస్త్రవేత్తలు 'హ్యాపీనెస్ కెమికల్'గా పిలిచే ఈ హార్మోన్ మనిషి మెదడు, పేగులలో ఉత్పత్తి అవుతుంది. కేంద్ర నాడీ మండలమంతా వ్యాపిస్తుంది. సంఘజీవి అయిన మనిషి నలుగురి మధ్య సంతోషంగా సమయం గడుపుతున్న వేళ ఈ సెరటోనిన్ ఉత్పత్తి పెరిగి సంతోషకర అనుభూతిని మరింత పెంచుతుంది. దీని స్థాయి పెరిగే కొద్దీ మనిషిలో సంతృప్తి, ఆనందం, ఆత్మ నిర్భరత స్థాయి కూడా పెరుగుతూ ఉంటుంది.

డోపమైన్: మెదడులో ఉత్పత్తి అయి శరీరమంతా వ్యాపించే డోపమైన్ హార్మోన్ గుండె కొట్టుకోవడాన్ని, రక్తపోటును నియంత్రించడంతోపాటు మూత్రపిండాల పనితీరునూ మెరుగుపరుస్తుంది. మంచి భోజనం చేసిన తరువాత, ఏదైనా లక్ష్యాన్ని సాధించినప్పుడు, గమ్యాన్ని చేరుకున్నప్పుడు మనలో కలిగే ఆనందం, సంతృప్తికి ఈ డోపమైనే కారణం.

ఆక్సిటోసిన్: మనిషిలో ప్రశాంతతను, భద్రతను విశ్వాసాన్ని కలిగించడంలో ప్రేరకంగా పనిచేసే ఆక్సిటోసిన్.. ఆత్మీయత, అనుబంధాలనూ పెంపొందించేందుకు దోహదపడుతుంది. అయినవారిని ఆలింగనం చేసుకున్నప్పుడు, ఆత్మీయులతో అనుబంధాలు పంచుకునేప్పుడు విడుదలయ్యే ఈ ఆక్సిటోసిన్ దీర్ఘకాలంపాటు మనిషిని సంతోషంగా ఉండేలా చేస్తుంది.

ఎండార్ఫిన్: మత్తు మందులా పనిచేసే ఎండార్ఫిన్ శరీరంలోని నాడీ మండలం, పిట్యూటరీ గ్రంథిలో ఉత్పత్తి అవుతుంది. ప్రధానంగా నొప్పి నుంచి ఉపశమనం కోసం తయారయ్యే ఈ హార్మోన్ సంతోషం, సంతృప్తికి కూడా కారణమవుతుంది. ఆహారం తీసుకున్నాక, వ్యాయామం చేశాక, ఇష్టమైన పానీయాలు తీసుకున్నప్పుడు విడుదలయ్యే ఎండార్ఫిన్.. మనిషిలో ఆత్మ నిర్భరతను పెంచడం, ఒత్తిడిని తగ్గించడం, బరువును తగ్గించడానికీ తోడ్పడుతుంది. ఎండార్ఫిన్ హార్మోన్ స్థాయి పెంచుకోవాలంటే.. ఇష్టమైన పాటకు డ్యాన్స్ చేయడం, సుగంధాలను ఆస్వాదించడం, ఇష్టమైన ఆహారాన్ని తీసుకోవడం వంటివి చేయాలి.

నవ్వుల క్వాకా..



టెడ్డీ బేర్ వంటి మొహంతో ఎల్లప్పుడూ చిరునవ్వుతో ఉన్నట్టు కనిపించే క్వాకాకు ప్రపంచ పౌరులు అత్యంత సంతోషకర జీవిగా ముద్రవేశారు. సాధారణ పిల్లి పరిమాణంలో ఎలుకను పోలినట్టుగా ఉండే ఈ క్వాకా నిజానికి కంగారూల జాతికి చెందినది. ఆస్ట్రేలియా పశ్చిమ తీరానికి దగ్గరగా ఉండే రెండు దీవులు రాట్‌నెస్ట్, బాల్డ్ ఐలాండ్‌లలో మాత్రమే ఈ క్వాకాలు జీవిస్తున్నాయి. మనుషులతో సన్నిహితంగా మెదిలే ఈ జీవి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులకు ప్రీతిపాత్రమైంది. క్వాకాతో సెల్ఫీ దిగేందుకు వేలాదిమంది పర్యాటకులు ఏటా ఈ దీవులను సందర్శిస్తుంటారు. '#సెల్ఫీ విత్ క్వాకా' అనేది ట్రెండ్‌గా మారింది. క్వాకాల సంఖ్య పదివేలలోపే ఉండటంతో ఆస్ట్రేలియా ప్రభుత్వం వాటి సంరక్షణకు చర్యలు చేపట్టింది.

భారత్ గౌరవ్ రైలు 8వ యాత్ర ప్రారంభం

పూరి–కాశీ–అయోధ్య పుణ్యక్షేత్ర యాత్రకు బుకింగ్స్



ప్రయాణికురాలితో 'పుణ్యక్షేత్ర యాత్ర'ను ప్రారంభింపజేస్తున్న రైల్వే అధికారులు

సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలు తూర్పు, ఉత్తర భారత్‌లోని పురాతన, చరిత్రాత్మక ప్రదేశాలను సందర్శించడం కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేకంగా ప్రారంభించిన భారత్ గౌరవ్ రైలు 8వ 'పుణ్యక్షేత్రయాత్ర'ను ప్రారంభించింది. బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి మొదలైన ఈ రైలును సీనియర్ సిటిజన్ ప్రయాణికురాలు లక్ష్మీ రాజయ్యతో రైల్వే అధికారులు ప్రారంభింపజేశారు. కార్యక్రమంలో ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) గ్రూప్ జనరల్ మేనేజర్ పి.రాజ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ.. గౌరవ్ టూరిస్ట్ రైలుకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. జూలై 26 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు కొనసాగే 9వ పుణ్య క్షేత్ర యాత్ర (పూరి–కాశీ–అయోధ్య) కోసం బుకింగ్స్ కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ టూరిస్ట్ సర్క్యూట్ రైలులో తెలంగాణలోని సికింద్రాబాద్, కాజీపేట, ఖమ్మంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, పెందుర్తి, విజయనగరంలోనూ ప్రయాణికులు ఎక్కి, దిగే సౌకర్యం ఉందన్నారు. బుకింగ్స్ కోసం http://www.irctctourism.com వెబ్‌సైట్‌ని సందర్శించాలని సూచించారు.

చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్‌గా లోకేశ్ జైస్వాల్

అటవీ శాఖలో బదిలీలు

సాక్షి, హైదరాబాద్: అటవీశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న కొందరు అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీనియర్ ఐఎఫ్‌ఎస్ అధికారి లోకేశ్ జైస్వాల్‌ను పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్‌గా నియమించింది. ప్రస్తుతం ఆయన పీసీసీఎఫ్ (కాంపా)గా వ్యవహరిస్తున్నారు. కొన్నేళ్లుగా కేంద్రప్రభుత్వంలో డిప్యుటేషన్‌పై పనిచేసి తిరిగి వచ్చిన డాక్టర్ సి.సువర్ణను పీసీసీఎఫ్ (హరితహారం)గా నియమించారు. సోషల్ ఫారెస్ట్రీ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి.రామలింగంను చీఫ్ కన్జర్వేషన్ ఆఫ్ ఫారెస్ట్స్–ప్రొడక్షన్‌గా (బీడీ లీఫ్స్, సా మిల్స్ వ్యవహారాలు) బదిలీ చేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ఉపాధి హామీ అమలు స్పెషల్ కమిషనర్‌గా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న వి.ఎస్.ఎన్.వి.ప్రసాద్‌ను జూపార్కుల సంచాలకునిగా నియమించారు. భద్రాద్రి కొత్తగూడెం డీఎఫ్‌వో లక్ష్మణ్ రంజిత్ నాయక్‌ను అటవీ అభివృద్ధి సంస్థకు బదిలీ చేసి.. భద్రాద్రి కొత్తగూడెం డీఎఫ్‌వోగా కిష్టాగౌడ్‌కు పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'వారంలోగా వీకే సింగ్‌కు పింఛన్ ఇవ్వాలి'

- లేదంటే ట్రిబ్యునల్ ముందు సీఎస్ హాజరవ్వాలి
- మాజీ ఐపీఎస్‌కు పింఛన్ జాప్యంపై క్యాట్ ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: మాజీ ఐపీఎస్ అధికారి వినోయ్ కుమార్ సింగ్‌కు వారంలోగా పింఛన్‌ను అంద జేయాలని, లేని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేరుగా ట్రిబ్యునల్ ముందు హాజరై వివరణ ఇవ్వాలని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే చాలా రోజులు గడువిచ్చామని, ఇకపై ప్రభుత్వం అడిగినంత సమయం ఇవ్వలేమని తేల్చిచెప్పింది. తదుపరి విచారణను ఈనెల 19కి వాయిదా వేసింది. డీజీపీ నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై అసంతృప్తితో ఆయన 2020లో ముందస్తు పదవీ విరమణ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ అంశం పెండింగ్‌లో ఉండగానే ఆయన పదవీ కాలం కూడా పూర్తయింది. అయితే పదవీ విరమణ అనంతరం తనకు రావాల్సిన పింఛన్ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వక పోవడంతో ఆయన క్యాట్‌ను ఆశ్రయించారు. క్రమశిక్షణ చర్యల పేరుతో పింఛన్‌ను నిలిపివేశారని పేర్కొన్నారు. పిటిషన్ తరఫున కేఆర్‌కే ప్రసాద్ వాదనలు వినిపించారు. వీకే సింగ్‌కు పింఛన్‌ను వెంటనే చెల్లించాలని మే 10న, జూన్ 21న క్యాట్ ఆదేశించినా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీపీ కవిత వాదనలు వినిపిస్తూ.. పింఛన్ చెల్లింపు ఏర్పాట్లు జరుగుతున్నాయని, మరో రెండు వారాలు సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ ఆదేశాలను అమలు చేయకపోవడం కోర్టు ధిక్కరణ కింద పరిగణించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది. వారంలోగా చెల్లింపు జరపాలని ఆదేశించింది.

గానుగాపూర్‌కు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ

అమావాస్యకు, పౌర్ణమికి భక్తుల రద్దీతో నిర్ణయం

అఫ్జల్‌గంజ్: గానుగాపూర్ వెళ్లే భక్తులకు తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్టీసీ) శుభవార్త తెలిపింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రతి అమావాస్యకు, పౌర్ణమికి భక్తులు పెద్ద సంఖ్యలో గానుగాపూర్‌లోని దత్తాత్రేయ స్వామి దర్శనానికి వెళ్తుంటారు. వీరిని దృష్టిలో ఉంచుకొని టీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీని తీసుకొచ్చింది. రానున్న అమావాస్యరోజు మహాత్మా గాంధీ బస్ స్టేషన్ నుంచి గానుగాపూర్, పండరీపూర్, తుల్జాపూర్‌లకు సూపర్ లగ్జరీ సర్వీసును ప్రారంభించారు. ఈ సర్వీసు ఈ నెల 16న ఎంజీబీఎస్ నుంచి బయలుదేరి, 17న ఉదయం గానుగాపూర్‌లో దత్తాత్రేయస్వామి దర్శనం, సాయంత్రం పండరీపూర్ పాండురంగస్వామి దర్శనం అనంతరం తుల్జాపూర్ వెళ్తుంది. 18న భవానీమాత దర్శనం తరువాత రాత్రి 8.30 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటుంది. దర్శనం, భోజనం, వసతి సదుపాయాల ఖర్చు భక్తులదే. ప్రయాణ చార్జీలను ఒక్కరికి రూ. 2,500గా నిర్ణయించినట్లు రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ ఎ.శ్రీధర్ తెలిపారు. భక్తులు ముందస్తుగా తమ సీట్లను ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్, బస్ స్టేషన్లలో, ఏటీబీ ఏజెంట్ల వద్ద, ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చని వెల్లడించారు. వివరాలకు 9440566379, 9959226257, 9959224911 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.